ప్రజాశక్తి

టెక్కలి పీఠం ఎవరికి దక్కేనో..?
(4, 5లో)
బుధవారం మే 1 2024
8 పేజీలు
శ్రీకాకుళం

ఎన్నికల వేళ విస్తృత తనిఖీలు

- రూ.1.30 కోట్లు నగదు, రూ.1.36 కోట్ల విలువైన 3 కేజీల బంగారం సీజ్
- రూ.74 లక్షల విలువైన మద్యం స్వాధీనం
- 459 మంది అరెస్టు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఇటీవల నగదు, మద్యం, బంగారం, వెండి వంటివి సీజ్ చేస్తున్న ఘటనలు వరుసగా వెలుగు చూస్తున్నాయి. ఎన్నికల వేళ తనిఖీలు కూడా ముమ్మరం చేశారు. సోమవారం విశాఖ నుంచి వస్తున్న ఒక బస్సులో రూ.28.50 లక్షలు నగదు దొరకడంతో, జిల్లాలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి ఇప్పటివరకు అక్రమంగా తరలిస్తున్న వాటిని ఏవేవి ఎంత మొత్తంలో స్వాధీనం చేసుకున్నారనే విషయాలు ఒక్కసారి పరిశీలిద్దాం. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన మార్చి 16వ తేదీ నుంచి ఏప్రిల్ 28వ తేదీ వరకు ఎటువంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న వారి నుంచి రూ.1,30,18,920 నగదును సీజ్ చేశారు. రూ.50 వేలు కంటే ఎక్కువ మొత్తంలో నగదును తమతో పాటు

ఎవరైనా తీసుకెళ్లాలంటే వాటికి సంబంధించి బ్యాంకుల నుంచి ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే ఆ నగదును సీజ్ చేసే అధికారం ఫ్లయింగ్ స్క్వాడ్‌కు ఉంటుంది. ఈ నగదును ఆదాయపు పన్ను శాఖకు అప్పగిస్తారు. అన్ని ఆధారాలు సమర్పిస్తే జిల్లాలోని గ్రీవెన్స్ కమిటీ దీన్ని రిలీజ్ చేసే అవకాశం ఉంది. ఇక బంగారం విషయానికొస్తే 2,901 గ్రాముల బంగారాన్ని ఇప్పటివరకూ స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1,36,80,284గా ఉంది. రూ.14,41,669 విలువైన 26,581 గ్రాముల వెండిని కూడా స్వాధీనం చేసుకున్నారు.

రూ.74 లక్షల విలువైన మద్యం స్వాధీనం

ఎన్నికల వేళ నిత్యం చర్చకు వచ్చే మద్యం విషయంలో కూడా భారీ ఎత్తున సీజర్లు నమోదయ్యాయి. 5509 లీటర్ల సారా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ 285 లీటర్లు, ఒడిశా, ఇతర రాష్ట్రాల నుంచి తరలిస్తున్న 1154 లీటర్ల లిక్కర్ ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్నారు. సారా (మిగతా...2లో)

మే డే సైకతశిల్పం

మే డేను పురస్కరించుకుని ఆమదాలవలస మండలంలోని గాజుల కొల్లివలస సమీపంలో ఉన్న సంగమేశ్వర కొండ దిగువన సైకత శిల్పి గేదెల హరికృష్ణ రూపొందించిన సైకత శిల్పం విశేషంగా ఆకట్టుకుంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైకత శిల్పాన్ని తిలకించి హరికృష్ణను అభినందించారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

వడదెబ్బకు ఇద్దరు వృద్ధులు మృతి

ప్రజాశక్తి - టెక్కలి, పలాస

రామారావు మృతదేహం

బలరాం మృతదేహం

వడదెబ్బకు గురై ఇద్దరు వృద్ధులు మృతి చెందారు. ఎండ తీవ్రతకు తట్టుకోలేక వడదెబ్బ తగిలి టెక్కలి మండలం బన్నువాడకు చెందిన పోలాకి రామారావు (68) మంగళవారం మృతి చెందారు. పలాస మండలం బ్రాహ్మణతర్లాకు చెందిన పొందర బలరాం (85) మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. టెక్కలి మండలంలోని బన్నువాడకు చెందిన పోలాకి రామారావు ఎండ వేడిమికి ఇటీవల అస్వస్థతకు గురయ్యాడు. కొంచెం కుదుటపడడంతో మంగళవారం ఉదయం పొలానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా గ్రామం మధ్యలో స్పృహ తప్పి (మిగతా...2లో)

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు సిబ్బందికి సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇచ్ఛాపురంలోని పురుషోత్తపురం వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఎస్‌పి జి.ఆర్ రాధిక మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల తనిఖీల తీరును పర్యవేక్షించారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, నాటుసారా, గంజాయి, ఓటర్లను ప్రలోభపెట్టే ఇతర సామగ్రి అక్రమ రవాణా కాకుండా ముమ్మరంగా వాహనాలు తనిఖీలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలోని బెల్లుపడ, ఎ.ఎస్ పేట, (మిగతా...2లో)

సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వరరావు

రాష్ట్రానికి బిజెపి తీరని ద్రోహం

- ఎవరిని మోసం చేయడానికి టిడిపి, జనసేన పొత్తు
- మోడీకి తొత్తుగా జగన్
- ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలి
- ఫోరం నాయకుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని డిసిసి అధ్యక్షులు, శ్రీకాకుళం ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి పేడాడ పరమేశ్వరరావు, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ విమర్శించారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవనలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తీరని అన్యాయం చేసిన బిజెపితో టిడిపి, జనసేన జత కట్టాయని, ఎవరిని మోసం చేయడానికి ఈ పొత్తు అని ప్రశ్నించారు. దేశ సంపదను అంబానీ, అదానీకి దోచిపెడుతూ ప్రజలను మరింత పేదరికంలోకి నెడుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తుందన్నారు. జిల్లాలో (మిగతా...2లో)

ఎన్నికల విధుల్లో లోపాలకు తావీయొద్దు

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, ఎచ్చెర్ల

జిల్లాలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ నిర్వహణ అత్యంత కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి లోపాలకు తావు లేకుండా ఎన్నికల విధులు సజావుగా నిర్వర్తించాలని ఆదేశించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల, ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన పిఒలు, ఎపిఒల శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధులు సజావుగా నిర్వహించే బాధ్యత ప్రిసైడింగ్ అధికారులు, సహాయ

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

పోలింగ్ అధికారులపై ఉందన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలతో ఓటింగ్ నిర్వహించడంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అందులో భాగంగా మోడల్ పోలింగ్ నిర్వహించి ఆ (మిగతా...2లో)

ఎన్నికల వ్యయంపై ప్రత్యేక దృష్టి

- రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి
- స్పష్టం చేసిన వ్యయ పరిశీలకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల రోజువారీ ప్రచార వ్యయంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు అన్నారు. రోజు వారీ నివేదికలు పంపించడం, రికార్డుల నిర్వహణలో పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రత్యేక వ్యయ పరిశీలకులు శరవణ కుమార్, కోమల్‌జిత్ మీనా, నవీన్ కుమార్ సోనీ జిల్లా సమన్వయ కమిటీలు, నోడల్ అధికారులతో సీజర్ నిర్వహణ, ఖర్చుల వివరాలు, ఆడిటింగ్ అంశాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బరిలో ఉన్న వారి తుది

సమావేశంలో మాట్లాడుతున్న వ్యయ పరిశీలకులు

జాబితా ఖరారైన నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సాధారణ పౌరులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు.

ఎన్నికల కమిషన్ కళ్లు, చెవులు, నోరుగా పనిచేస్తున్న ఎన్నికల సిబ్బందిపై ఎంతో (మిగతా...2లో)

ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి- టెక్కలి

రానున్న సార్వత్రిక ఎన్నికల సక్రమంగా నిర్వహించి ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా సిబ్బంది తమ విధులను నిర్వర్తించాలని సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ సూచించారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో నియోజకవర్గ పిఒ, ఎపిఒ, పోలింగ్ సిబ్బందికి మంగళవారం ఇవిఎంల ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ ద్వారా అవగాహన చేసుకుని ఎన్నికల్లో సక్రమంగా నిర్వాహణకు కృషి చేయాలన్నారు. నియోజకవర్గం పరిధిలోని 315 పోలింగ్ కేంద్రాలకు గాను 720 మంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : వచ్చే పోలింగ్‌కు జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శనదొర అన్నారు. స్థానిక ఉమెన్స్ కాలేజీలో ఎన్నికల పిఒలకు, ఎపిఒలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని 671 మంది హాజరయ్యారు.

భోజనం లేక అవస్థలు

పలాస : ఎన్నికల అధికారులకు పాట్లు తప్పడం లేదు. శిక్షణకు వచ్చిన ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో భోజనం అందక ఇబ్బందులు పడ్డారు. శిక్షణ కేంద్రం వద్ద పూర్తి స్థాయిలో తాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో మంగళవారం పిఒలు, ఎపిఒలకు సార్వత్రి ఎన్నికల పోలింగ్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణకు ఇతర మండలాలు నుంచి పిఒలు, ఎపిఒలు 700 మంది పాల్గొన్నారు. అయితే ఇరుకు గదుల్లో కూర్చోపెట్టి ఉదయం సాయంత్రం వరకు శిక్షణ ఇవ్వడంతో ఉక్కపోతతో ఇక్కట్లు పడ్డామని ఉపాధ్యాయులు తెలిపారు. మరోవైపు

భోజనాల వద్ద అవస్థలు పడుతున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం : శిక్షణ ఇస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొర

పూర్తిస్థాయిలో తాగునీరు ఏర్పాటు చేయడం లేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో సుమారు వంద మందికి భోజనం అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శిక్షణకు ఎంత మంది వస్తున్నారో ముందుగా తెలుసుకొని భోజనం తీసుకురావాలి. కానీ, తీసుకువచ్చిన భోజనం విడతలు విడతలుగా తీసుకురావడంతో చాలా మందికి భోజనం అందలేదు. విషయం తెలుసుకున్న ఆర్‌డిఒ భరత్ నాయక్ పాఠశాలకు వద్దకు చేరుకుని ఉపాధ్యాయులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. బుధవారం నిర్వహించనున్న శిక్షణకు ఎటువంటి ఇబ్బందు లు లేకుండా చూస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గౌతు శిరీష

టిడిపితోనే బిసిలకు న్యాయం

ప్రజాశక్తి- పలాస

టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ప్రభుత్వంతోనే బిసి సాధికారత సాధ్యమని పలాస టిడిపి అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. నగర సాధికార సమితి నాయకులతో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో బిసిలకు పూర్తిగా అన్యాయం జరిగిందని ఉదహరించారు. ప్రత్యేక కార్పొరేషన్లు పెట్టినా ఒక్క పైసా విడుదల చేయకుండా వాటిని నిర్వీర్యం చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ జంపన వీర శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్ పిండి రామారావు, జిల్లా అధ్యక్షుడు గుర్రం నూకరాజు, నక్కా రామచంద్రుడు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఓటమి భయంతోనే అచ్చెన్న డ్రామాలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టిడిపి అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఈ ఎన్నికల్లో ఓడిపోతానని భయంతో రోజూ వైసిపి నుంచి టిడిపిలో చేరికల డ్రామా ఆడుతున్నారని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, నూక సత్యరాజు, కవిటి రామారాజు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజలను మభ్య పెట్టేందుకు వైసిపి నుంచి టిడిపి వస్తున్నారని రోజూ ఫొటోలు పెడుతున్నారని తెలిపారు. నిజానికి టిడిపి వారికే పార్టీ కండువా వేసి ఫొటోలు తీసి పేపర్లలో సోషల్ మీడియాలో పెడుతున్నారని వారు ఆరోపించారు. వాలంటీర్లు అంటే నచ్చని వారు... ఇప్పుడు నిమ్మాడ సచివాలయంలో పలువురు వాలంటీర్లను బయపెట్టి తమ పార్టీలో చేర్చుకున్నారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో బోయిన నాగేశ్వరరావు, బొడ్డు అప్పన్న, పేడాడ వెంకటరావు, మెట్ట సింహాచలం, బగాది దివాకర్, పూజారి సత్యం, కోతి చిన్నారావు, బోనేల ఎల్లయ్య పాల్గొన్నారు.

ఎంజిఆర్‌ను గెలిపించాలి

కొత్తూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావుని గెలిపించాలని టిడిపి నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు ఓటర్లను కోరారు. స్థానిక బిసి కాలనీలో మంగళవారం ఎన్నిక ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాతపట్నం నియోజకవర్గానికి తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. మండలానికి వచ్చిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి తిరిగి పాలకొండకు వెళ్లేటట్టు చేసిన ఘనత రెడ్డి శాంతికే దక్కుతుందన్నారు. అలాగే పోలీస్ సర్కిల్ ఆఫీసు కొత్తూరు నుంచి ఎత్తివేసిన ఘనతా ఆమెదేన్నారు. జ్యోతిరావు పూలే స్కూల్ కూడా మండలం నుంచి వెళ్లిపోవడానికి కారణం ఆమెని అన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన మామిడి గోవిందరావుకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో లోతుగడ్డ తాతబాబు, లోతు గడ్డ ఇందిరారామ్, పడాల వెంకటకృష్ణ, గడ్డవలస కమలాకర్, ధర్మాన పకీరునాయుడు, బియ్యాలా నర్సయ్య, పెద్దకోట గోపాల్, శాసపు శ్రీరాములు, గేదెల వెంకటకృష్ణ, సొంట్యాన లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తులసీవరప్రసాదరావు

మాట్లాడుతున్న వెంకన్న చౌదరి

గౌతు శిరీష గెలుపే లక్ష్యం

ప్రజాశక్తి- పలాస

వచ్చే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గౌతు శిరీష గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టిడిపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి, జనసేన, బిజెపి, నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న కాలంలో పలాస ప్రశాంతంగా ఉండాలంటే గౌతు శిరీష గెలుపు అవసరమన్నారు. ప్రతిఒక్కరూ ప్రజలకు అవగాహన కల్పించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా గౌతు శిరీష, ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిసిసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బి.నాగరాజు, సప్ప నవీన్, టంకాల రవిశంకర్‌గుప్తా, మల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న అచ్చెన్నాయుడు

అచ్చెన్న ఇంటింటా ప్రచారం

టెక్కలి: టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలిలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి కృష్ణచంద్ర మఠం, సోగ్గాడుపేట తదితర వీధుల్లో ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి అమలు చేయనున్న మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, పట్టణ అధ్యక్షులు కోళ్ల లవకుమార్, మామిడి రాము, రామకృష్ణ, చాపర గణపతి, దొంకాన రామకృష్ణ, కోళ్ల కామేష్ బెహరా, కాశీమట్ల పురుషోత్తం, పోలాకి షణ్ముఖరావు, ప్రీతిష్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నుపురంలో కవాతు

నందిగాం: మండలంలోని అన్నుపురంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ అధ్యక్షతన సిఆర్‌పిఎఫ్ సాయుధ బలగాలతో కలిసి రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది మంగళవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశామని, స్వేచ్ఛగా ఓటర్లు తన హక్కుని వినియోగించుకోవాలని సూచించారు. ఎటువంటి ప్రలోభాలకు లోను కాకూడదని, మీపై ఎవరైనా ఒత్తిడి తెస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమించి అల్లర్లు, గొడవలకు

కవాతు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు

ప్రేరేపించే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డిఎస్‌పి సిహెచ్.రాజా, టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి,నందిగామ ఎస్‌ఐ మహమ్మద్ అమీర్ అలీ, తహశీల్దార్ వి.పద్మావతి, ఎంపిడిఒ జి.శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న ఓంశ్రీకృష్ణ

రెడ్డి శాంతి తనయుడు ప్రచారం

మెళియాపుట్టి: ఎమ్మెల్యే రెడ్డి శాంతితోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని ఆమె కుమారుడు ఓంశ్రీకృష్ణ అన్నారు. మండలంలోని మర్రిపాడు-కె, ముక్తాపురం పంచాయతీల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించారని అన్నారు. మన పాలన మనమే చేసుకునేలా మనకు ఒక అవకాశం కల్పించిన నాయకుడు జగన్ తెలిపారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి రెడ్డి శాంతి, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, ట్రై కార్ రాష్ట్ర డైరెక్టర్ సవర సుభాష్, జనపరెడ్డి కన్నబాబు, మాధవరావు, సవర రంగారావు, తెంబూరు ప్రసాదరావు, గణేష్ ప్రధాన్, పెద్దింటి చంద్రరావు పాల్గొన్నారు.

పలాస చేరిన వీల్‌చైర్లు

ప్రజాశక్తి- పలాస

ఈనెల 13న జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వృద్ధులు, వికలాంగులు ఓట్లు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని, ముందు చర్యగా పలాస నియోజకవర్గానికి 200 వీల్‌చైర్లు వచ్చాయని పలాస ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు మంగళవారం తెలిపారు. పలాస మండలానికి 46, మున్సిపాలిటీకు 5, మందస మండలం 84, వజ్రపుకొత్తూరు మండలానికి 65 వీల్‌చైర్లు వచ్చాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా ఉన్నతాధికారులు వీల్‌చైర్లు పంపించారని తెలిపారు.

కవిటి : మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి

పక్కాగా పింఛన్ల పంపిణీ

కవిటి: పింఛన్ల పంపిణీలో ఎటువంటి అవాంతరాలు లేకుండా పక్కా పంపిణీ చేయాలని ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని 11,678 పింఛన్లలో బ్యాంకు ఖాతా లేనివారు 2,398 మంది ఉన్నట్టు తెలిపారు. వీరికి ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు అందించాల్సి ఉందని, మిగతా 9280 మందికి బ్యాంకు ఖాతాలో పింఛన్ డబ్బులు జమ చేస్తారని తెలిపారు. లబ్ధిదారులు ఎవరూ సచివాలయాల వద్దకు రావల్సిన అవసరం లేదన్నారు. ప్రతి పంచాయతీలో లబ్ధిదారులకు ఈ విషయం తెలియజేయాలని సూచించారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఎపిఎం గోవిందరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని, మున్సిపాలిటీ పరిధిలోని పింఛనుదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతాయని ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. మండలంలో 6,412 పింఛన్లు ఉండగా, 1709 మంది లబ్ధిదారులు, మున్సిపాలిటీ పరిధిలో 6,252 మంది పింఛన్లు ఉండగా, 1704 మంది లబ్ధిదారులకు నేరుగా వారి ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలో కొత్త సబ్‌స్టేషన్ కోసం రాజపురం నుంచి వేస్తున్న 33 కెవి పనుల నిమిత్తం బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి కవిటి టౌన్ లైన్ మైంటెనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో కవిటి, రాజపురం, భైరిపురం, డి.జి.పుట్టుగ, నెలవంక, కపాసుకుద్ది పంచాయతీ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్రానికి బిజెపి తీరని ద్రోహం

వంశధార, ఆఫ్‌షోర్, నారాయణపురం వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమయ్యాయని తెలిపారు. టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా, సాగునీటి కాలువ మరమ్మతులు, షట్టర్లు ఏర్పాటుకు నిధులు ఇవ్వకుండా రైతాంగానికి తీరని ద్రోహం చేశాయన్నారు. ఉద్దానం ప్రాంతంలో జీడి రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని పోరాడుతున్నా పట్టించుకునే వారు లేరన్నారు. కొబ్బరి సాగు జిల్లాలో కళావిహీనంగా మారిందన్నారు. రైతాంగాన్ని టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ఆదుకోవడంలో విఫలమయ్యాన్నారు. మరోవైపు ఉద్దానం నుంచి పెద్దఎత్తున ఇతర ప్రాంతాలకు వెళ్లి వలస కూలీలుగా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మరోవైపు ఉద్దానంలో కిడ్నీ వ్యాధులపై నిర్లక్ష్యంగా వ్యహరించారన్నారు. కిడ్నీ పరిశోధనా కేంద్రమని నమ్మించిన వైసిపి ప్రభుత్వం, అక్కడ ఏం పరిశోధనలు చేస్తున్నారో చెప్పాలన్నారు. డయాలసిస్ కేంద్రాల్లో వైద్యులు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 183 కిలోమీటర్ల పొడవు విస్తీర్ణం గల సముద్రతీర ప్రాంతంలో 204 పంచాయతీల్లో మత్స్యకారులు జీవిస్తున్నారని, వారి కోసం ఇంతవరకు కోల్డ్ స్టోరేజ్‌ను ఏర్పాటు చేయలేదన్నారు. కార్పొరేట్ వ్యాపార అవసరాల కోసం మూలపేటలో పోర్టు నిర్మిస్తున్నారని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా మత్స్యకారులు డిమాండ్ చేస్తున్న హార్బర్‌ను మాత్రం నిర్మించలేదన్నారు. సమస్యలు పరిష్కారం కావాలన్నా, అభివృద్ధి జరగాలన్నా ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించి ప్రజా ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సనపల అన్నాజీరావు, అంబటి కృష్ణారావు, యువజన కాంగ్రెస్ నాయకులు రెల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లోపాలకు తావీయొద్దు

స్లిప్‌లను భద్రపరచుకోవాలని సూచించారు. అనంతరం క్లోజ్ రిజల్ట్ క్లియర్ (సిఆర్‌సి) చేసిన తర్వాతనే సాధారణ పోలింగ్ మొదలు పెట్టాలన్నారు. పోలింగ్ నిర్వహించే సమయంలో ఇవిఎంలు మొరాయిస్తే ఏం చేయాలన్న ఒత్తిడి అవసరం లేకుండా ముందే అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇవిఎంల్లో ఒక ఓటు పడిన తర్వాత సాంకేతిక సమస్య తలెత్తితే రెండో ఇవిఎంను వినియోగించాలని పోలింగ్ పూర్తయిన తర్వాత మొదటి ఇవిఎంతో పాటు రెండో ఇవిఎంను కూడా రిసెప్షన్ కేంద్రంలో అప్పగించాల్సిన బాధ్యత పిఒపై ఉందన్నారు. పోలింగ్ జరిగే సమయంలో అనుకోని సంఘటనలు ఎదురైతే తక్షణమే సంబంధిత సెక్టోరల్ అధికారికి, ఎఆర్‌ఒకు, రిటర్నింగ్ అధికారికి తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. శిక్షణా తరగతుల్లో శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు సిహెచ్.రంగయ్య, లక్ష్మణరావు, ఎఆర్‌ఒలు, సెక్టోరల్ అధికారులు, పిఒలు, ఎపిఒలు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయంపై ప్రత్యేక దృష్టి

గురుతరమైన బాధ్యత ఉందన్నారు. ఖర్చులను అభ్యర్థుల ఖాతాలకు చూపడంలో నిష్పక్షపాతంగా ఎన్నికల సిబ్బంది వ్యవహరించాలని తెలిపారు. అభ్యర్థులు చేస్తున్న ప్రచార ఖర్చులు, బహుమతుల పంపిణీ, ఇతర ఖర్చులపై సమగ్ర దృష్టిసారించాలని సూచించారు. బ్యాంకుల నుంచి జరిగే అనుమానాస్పద నగదు లావాదేవీలు, భారీ మొత్తంలో జరిగే లావాదేవీలు, నగదు డిపాజిట్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. మద్యం అమ్మకాలు, స్టాక్ షాపులకు వెళ్లే సరుకు రవాణాపై నిరంతర నిఘా ఉంచాలన్నారు.

పత్రికలు, ఛానళ్లు, సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ఫిర్యాదులపై టోల్‌ఫ్రీ నంబర్ల ప్రచురణ, ప్రసారం చేసేలా చూడాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాల ద్వారా ఇంటెన్సివ్ వాహనాల తనిఖీలు నిర్వహించడం, జిల్లా ఎక్సైజ్ శాఖలు ఎన్నికల సమయంలో ఇంటెన్సివ్ తనిఖీల ద్వారా మద్యం చెలామణిని నిరోధించడం, నగదు, ఉచితాలు, మద్యం పంపిణీని నిరోధించడానికి గట్టి నిఘా ఉంచాలన్నారు. జిఎస్‌టి సిబ్బంది పన్ను సంబంధిత ప్రయోజనం కోసం మాత్రమే తనిఖీ చేయొద్దని, ఓటర్లకు పంపిణీ చేయడానికి వస్తువులను పెద్దమొత్తంలో కొనుగోలు చేయడానికి జరిగే లావాదేవీలనూ తనిఖీ చేయాలని సూచించారు. సమావేశంలో సిపిఒ ప్రసన్నలక్ష్మి, జిల్లా ఆడిట్ అధికారి సుల్తానా, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ రాణిమోహన్, డిటిసి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్, ఎస్ఐబి ఎఎస్‌పి డి.గంగాధరం, ఎక్సైజ్ ఇఎస్ సుబ్బారావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.P: 3/2024

Between:- **Tankala Venkata Subbarao** ...Petitioner
And:- **Gembali Anand and others** ...Respondents
To

GENERAL NOTICE

R-1) Gembalai Ananda Rao, S/o late Vaikunta Rao, aged 60 years, Sweets Business, Resident of Maruti Nagar 1st line. Narasannapeta Town and Mandalam, Srikakulam District.
R-2) Kosttu Ramana, S/o late Vannari, aged 45 years, Business, Resident of Boddavalasa Street, Narasannapeta Town and Mandalam, Srikakulam District.
R-3) Pilaka Yerrayya, S/o late Buchhayya, aged 55 years, Finance Business, Resident of Vajrampeta Street, Narasannapeta Town and Mandalam, Srikakulam District.
R-4) Muddada Srinu, S/o late S/o Simmayya, aged 35 years, Working in Gas Company, Resident Sivanagar Colony. Narasannapeta Town and Mandalam, Srikakulam District.
R-5) Bora Narsinga Rao, S/o late Appalaswamy, aged 50 years, Finance Business, Resident of Edulavalasa Village, Polaki Mandalam, Srikakulam District.
R-6) Nimmada Tulasi, S/o Nimmada Krishna, aged 35 years, Finance Business, Resident of Kovela Street, Narasannapeta Town and Mandalam, Srikakulam District.
R-7) Kinjarapu Venkataramana, S/o late Buchhayya, aged 35 years, Rama Tredars, Pesticide Business, Laxmi Takies Side, Narasannapeta Town and Mandalam, Srikakulam District.

Please take notice that the above matter is posted to dt: 03-05-2024 for your appearance and publice You are hereby directed to appear before the above Hon'ble Court on dt: **03-05-2024 at 10-30 A.M.,** either in person or through advocate without fail. Otherwise the matter will be decided in your absence. Hence this notice.

// BY ORDER //

T. KHAGENDRA NATH,
ADVOCATE FOR THE PETITIONER,
SRIKAKULAM, CELL: 9440105533.

మొదటి పేజీ తరువాయి

వడదెబ్బకు ఇద్దరు వృద్ధులు మృతి

పడిపోయాడు. దీంతో స్థానికులు హుటాహుటిన టెక్కలిలోని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అప్పటికే రామారావు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్య తులసమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పలాస మండలం బ్రాహ్మణతర్లాకు చెందిన పొందర బలరాంకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమారుడు దామోదర్ ఇంటి నుంచి అదే గ్రామంలో శివారున ఉంటున్న పెద్ద కుమారుడు సుభాష్ ఇంటికి ఆదివారం బయలుదేరి వెళ్లాడు. సుభాష్ ఇంటికి నేరుగా వెళ్లకుండా పొలాని వెళ్లడంతో ఎండ తీవ్రతకు వడదెబ్బకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. రెండు రోజులు గడుస్తున్నా అన్న ఇంట్లో ఉన్నాడని తమ్ముడు, తమ్ముడు ఇంట్లో ఉన్నాడని అన్న అనుకున్నారు. మంగళవారం కేదారిపురం రైతులు తమ పొలాలు వైపు వెళ్తుండగా బలరాంను విగతజీవిగా పడి ఉండడాన్ని చూశారు. ఆ ఫొటోను సోషల్ మీడియాలో పెట్టగా మృతుల కుటుంబసభ్యులకు తెలియడంతో, పొలానికి వెళ్లి బలరాం మృతదేహాన్ని తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

లొద్దపుట్టి, లండారిపుట్టుగ, మాణిక్యపురం, పెద్ద శ్రీరామపురం, కళింగపుట్టుగ, పలాసపురం, మామిడిపల్లిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత, మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎన్నికల రోజున ఎటువంటి ఘటనలు జరగకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ పోలింగ్ కేంద్రాలను సంబంధిత అధికారులు సందర్శించి, భద్రతా ఏర్పాట్లపై సమీక్షించాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వర రెడ్డి, సిఐలు టి.ఇమ్మన్యుయల్ రాజు, పి.మల్లేశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఎన్నికల వేళ విస్తృత తనిఖీలు

తయారీకి వినియోగించే 77 వేల లీటర్ల భారీ బెల్లపు ఊట నిల్వలను ధ్వంసం చేశారు. వీటన్నింటి విలువ రూ.74 లక్షలుగా ఉంది. 124.05 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోగా, దాని విలువ రూ.5.36 లక్షలుగా నిర్ధారించారు.

459 మంది అరెస్టు

నగదు, మద్యం, గంజాయి వంటి అక్రమ రవాణా కేసుల్లో ఇప్పటివరకు 459 మందిని అరెస్టు చేశారు. 716 కేసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో భాగంగా 36 మోటార్ సైకిళ్లు, 13 కార్లు, ఒక వ్యాను, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.87 లక్షలుగా ఉంది. సరైన పత్రాలు లేని కారణంగా 13 మొబైల్ ఫోన్లు, 10 చేతి గడియారాలు, 14 చీరలు, పదివేల టీ షర్టులు, 2500 కరపత్రాలు సీజ్ చేశారు. వీటి విలువ రూ.7.5 లక్షలుగా ఉంది.

93 ఎన్నికల నియమావళి ఉల్లంఘన ఘటనలు

ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎం.సి.సి-మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ఉల్లంఘించిన ఘటనలు 93 చోటుచేసుకోగా వాటిలో 34 కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. 67 మంది ప్రభుత్వ ఉద్యోగులకు నోటీసులు జారీ చేయగా, 39 మందిని సర్వీస్ నుంచి తొలగించారు. 17 మందిపై ఇంకా చర్యలు తీసుకోవాల్సి ఉంది. 7,812 మంది గ్రామ, వార్డు వాలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు. ఇంకా ఎంసిసి నిబంధనలు ఉల్లంఘించిన 26 మంది రాజకీయ నాయకులపై 17 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వీటిలో వైసిపిపై 10, టిడిపిపై ఏడు నమోదయ్యాయి.

నిరంతర పర్యవేక్షణ

జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో 24 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పనిచేస్తున్నాయి. నియోజకవర్గానికి మూడు చొప్పున ఒక్కో బృందంలో ఆరుగురు వరకు సిబ్బంది 24 గంటలూ పనిచేస్తున్నారు. వీరితో పాటు ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, సరిహద్దుల్లో నిఘా బృందాలు పనిచేస్తున్నాయి. సరైన పత్రాలు లేకుండా ప్రజలు రూ.50 వేలు కంటే నగదును తమతో తీసుకెళ్లవద్దు. ఎన్నికల ప్రక్రియ ముగిసే జూన్ ఆరో తేదీ వరకు నిరంతర నిఘా కొనసాగుతుంది.

- రాఘవేంద్ర మీనా,
అసిస్టెంట్ కలెక్టర్

FORMAT C-1
DECLARATION ABOUT CRIMINAL CASES

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)
Name and address of candidate : **APPALARAJU SEEDIRI**
Name of political party: **YUVAJANA SRAMIKA RYTHU CONGRESS PARTY**
Name of Election: **GENERAL ELECTIONS HOP/APLA – 2024**
Name of Constituency: **02 - PALASA ASSEMBLY CONSTITUENCY**
I, **APPALARAJU SEEDIRI :** (name of candidate), a candidate for the Above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

Sl. No	Pending Criminal Cases		Details about cases of conviction for criminal offences		
	Name of Court	Case No. and Status of case	Section(s) acts concerned and brief description of offence(s)	Name of court & date(s) of order(s)	Description of offence(s) & punishment imposed
1	Not Applicable	33/2018 of Kasibugga PS -Pending-	143, 283, 341, 149 IPC	Not applicable	Doki Hareesh Issue Not Applicable
2	Not Applicable	133/2020 of Meliaputti -Pending-	188, 271, IPC	Not applicable Not applicable	Epidemic disease Act (Covid-19)
3	Not Applicable	115/2020 of RPF/Palasa -Pending-	145(b), 147, Railway Act	Not applicable Not applicable	Mob Trespassing Railway premise Not applicable

*In the case of election to Council of States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of constituency.
Note: **(i) Details should be given separately for each case in separate rows.**
(ii) The matter in newspapers should be in font size of at least 12.

APPALARAJU SEEDIRI
YSRCP CONTESTING CANDIDATE,
NO.02, PALASA ASSEMBLY CONSTITUENCY

రెడ్డి శాంతి ప్రచారానికి స్పందన

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని పెద్దలోగిడి, కొంచాలపేట, సింగుపురం, లాబరా తదితర గ్రామాల్లో వైసిపి ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం నిర్వహించిన ఎన్నిక ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగుగడునా ప్రజలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సిఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్ సిఎం కావాలన్నారు. మరోసారి గెలిపిస్తే గ్రామాలను అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. అర్హులందరికీ సామాజిక పింఛన్లు, ఆసరా, రైతు భరోసా వంటి పథకాలు ప్రవేశపెట్టామని అన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశామని తెలిపారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న రెడ్డి శాంతి

ప్రచారం నిర్వహిస్తున్న గొండు శంకర్

గెలిపిస్తే అభివృద్ధి చూపిస్తా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగర పరిధిలో 21వ డివిజన్‌లో టిడిపి ఆధ్వర్యాన ప్రజాగళం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం చేపట్టిన కార్యక్రమానికి వార్డు ఇన్‌ఛార్జి పట్నాల పార్వతీశం, పార్టీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, కూటమి అభ్యర్థి గొండు శంకర్ పాల్గొన్నారు. నగరంలోని కర్రావీధి, న్యూ కాలనీ, భాకర్ సాహెబ్ పేట ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై వివరిస్తూ పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఒక్కసారి అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. నగర ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ వాటిని నెరవేర్చలేదన్నారు. కనీసం నగర ప్రజలకు పాలక వర్గం లేకుండా చేసిన ఘనత ధర్మానకే దక్కుతుందన్నారు. నగరంలో ఎక్కడ చూసినా రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉన్నాయని, అండర్ గ్రౌండ్ డ్రేనేజిని గతంలో లక్ష్మీదేవి నాయకత్వాన టిడిపి ప్రభుత్వం మంజూరు చేస్తే పనులు చేపట్టకుండా తర్వాత అధికారంలోకి వచ్చిన ధర్మాన అడ్డుకున్నారన్నారు. ముగురునీటి శుద్ధి కేంద్రాన్ని సగం పనులు పూర్తయిన తర్వాత రద్దు చేశారన్నారు. వర్షం పడితే నగర వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మురుగునీరు రోడ్లపైన, కాలనీల్లో ఇళ్లలోకి చేరుతోందన్నారు. ఈ పరిస్థితిని మార్చడంలో ధర్మాన వైఫల్యం చెందారన్నారు. కార్యక్రమంలో బాసిన వెంకటేష్, లొట్టి సూరిబాబు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

గౌతు శిరీష విస్తృత ప్రచారం

మందస: ఒక్క ఆడపిల్లగా అడుగుతున్న ఒక్క అవకాశం ఇచ్చి చూడండి తాను అభివృద్ధి చేసి చూపిస్తానని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష హామీనిచ్చారు. మండలంలోని వీరగున్నమ్మపురం, బాహడపల్లి గ్రామాల్లో మంగళవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, దాసరి తాతారావు పాల్గొన్నారు.

పలువురు చేరిక

మండలంలోని బంజువసాయి గ్రామం నుంచి 15 మంది యువకులు, మందస టౌన్ నుంచి పలువురు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వారికి గౌతు శిరీష టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో స్వర సుభద్ర, సవర రోహిత్, సవర సుందరి, సవర లక్ష్మి, సవర దీపిక, సవర మంగళి, సవర నరేష్, సవర చూడామణి, తెలుకుల సంతు, సిందిరి వాళ్లబ్బారావు, కోరాడ జయరాం ఉన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, డొంకూరు తిరుపతి, జి.కె.నాయుడు, లబ్బ రుద్రయ్య, రాజాన మహేష్, గువ్వాడ లక్ష్మీనారాయణ, శిష్టు ప్రసాద్, గార కృష్ణ పాల్గొన్నారు.

టెక్కలి పీఠం ఎవరికి దక్కేనో?

హోరాహోరీగా ప్రచారం

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకతని చాటుకున్న టెక్కలి నియోజకవర్గ రాజకీయం రసవత్తరంగా మారుతుంది. టెక్కలి నియోజకవర్గంలో ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు చెందిన జాతీయ పార్టీ కాంగ్రెస్ పార్టీ నుంచి కేంద్ర సహాయ మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, అధికార వైసిపి నుంచి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, టిడిపి నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, సిటింగ్ ఎమ్మెల్యే కింజరాపు ఆచ్చెన్నాయుడులు, బిఎస్‌పి నుంచి చింతాడ శ్రీనివాసరావు, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి పైపల్లి పరమేశ్వరరావు, స్వతంత్రులు గెడ్డవలస రాము, అట్టాడ రాజేష్‌లు తలపడుతున్నారు. అయితే వీరిలో స్వతంత్ర అభ్యర్థి రాజేష్‌కు గాజు గ్లాసు గుర్తు కేటాయించడంపై వివాదస్పందంగా మారింది. ప్రధానంగా కాంగ్రెస్, వైసిపి, టిడిపి అభ్యర్థుల మధ్యే పోటీ నెలకుందని పలువురు భావిస్తున్నారు. అచ్చెన్నాయుడుని ఎలాగైన ఓడించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కళ్లల్లో ఆనందం చూడాలనే పంతంతో వైసిపి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఈ సారీ హ్యాట్రిక్ సాధించాలనే లక్ష్యంతో అచ్చెన్నాయుడు ప్రతిష్టగా తీసుకున్నారు. వైసిపిలో అవమానాల భారాన్ని మోయలేకనే తన తల్లి పార్టీ అయిన కాంగ్రెస్‌లో చేరానని కృపారాణి గతంలో చెప్పారు. వైసిపి ఓటమే తన లక్ష్యం ఎంచుకున్న కృపారాణి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓట్ల శాతాన్ని పెంచుకునేందుకు ఆరాటపడుతున్నారు. 2019 ఎన్నికల్లో అచ్చెన్నాయుడు 8 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అయితే ఇప్పుడు ఆ మెజార్టీ కాదని, 50 వేల ఓట్ల మెజార్టీతో తన విజయం ఖాయమని అచ్చెన్న ధీమా వ్యక్తం చేస్తున్నా... ఆదంత సులువు కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే 1994 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అధినేత కీర్తిశేషులు నందమూరి తారకరామారావే 40 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అటువంటిది ఇప్పుడు అచ్చెన్నాయుడు 50 వేల మెజార్టీ అనేది సాధ్యం కాదని పలువురు నమ్మకం. కాగా, ప్రతిపక్ష వైసిపి అభ్యర్థి శ్రీనివాస్ తన ప్రత్యర్థి కాదని కింజరాపు ప్రచారం చేస్తున్నా... ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై ప్రజలకున్న నమ్మకం దువ్వాడకు బలాన్ని చేకూర్చుతుందని పలువురు భావిస్తున్నారు. వైసిపిలో ఉన్న అసమ్మతి, అసంతృప్తి వాదులు వల్ల తన విజయం, మెజార్టీ పెరుగుతుందని టిడిపి అభ్యర్థి అచ్చెన్న భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే వైసిపి చాపకిందనీరులా ప్రచారం చేపట్టి ఓటర్లను ఆకర్షిస్తుంది. కాగా, గడచిన ఎన్నికల్లో వైసిపిలోని అసమ్మతి, అసంతృప్తి వాదులు పరోక్షంగా అచ్చెన్న విజయానికి అప్పట్లో బంధుత్వం, సామాజిక తరగతులు ఇలా పలు విధాలుగా సహకరించారు. వైసిపిలో ఉంటూ కింజరాపుకు గతంలో సహకరించిన వారే ఇప్పుడు ప్రత్యర్థులుగా రంగంలో ఉన్నారు. అంటే వారు తమ విజయానికి కృషి చేసుకుంటారే కానీ, ఈ ఎన్నికల్లో అచ్చెన్న కోసం ఎందుకు సహకరిస్తారనే వాదన బలంగా వినిపిస్తుంది.



అచ్చెన్నాయుడు (టిడిపి)

శ్రీనివాస్ (వైసిపి)

కృపారాణి (కాంగ్రెస్)

కాగా, అచ్చెన్న ప్రత్యర్థిగా ఉన్న దువ్వాడ శ్రీనివాస్ సోదరులు పలాసలో టిడిపిలో చేరడంతో అక్కడ వైసిపి అభ్యర్థిగా ఉన్న మంత్రి సీదిరి అప్పలరాజుకు నష్టం కలిగించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ప్రచారం జరుగుతుంది. దీంతో మంత్రి తన స్వగ్రామమైన సంతబొమ్మాళి మండలంలోని తన సామాజిక తరగతికి చెందిన వారిని టిడిపికి మద్దతు ఇవ్వాలని చెబుతారని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. అదే జరిగితే వైసిపి ఎంపీ ఆభ్యర్థి పేరాడ తిలక్ నష్టపోయే పరిస్థితులు ఉండడంతో టిడిపి లాభించే పరిస్థితులు లేవని పలువురు భావిస్తున్నారు. ఏదేమైనా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరి అంచనా వారు వేసుకుంటున్నారు.

వైసిపి అభ్యర్థి దువ్వాడ నామినేషన్ వేసిన సందర్భంగా పాల్గొన్న జనాలు, సిఎం జగన్ సభకు హాజరైన జనాలను పరిశీలిస్తే టిడిపి అభ్యర్థికి చమటలు పట్టాయని విశ్లేషకులు అంచనా వేశారు. దీనిని ఎదుర్కోవాలని అచ్చెన్న భావించి తన నామినేషన్ కార్యక్రమానికి జనాలను అధికంగానే హాజరయ్యేటట్టు చూసుకున్నారు.

టెక్కలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు కాళింగ, వెలమ సామాజిక తరగతి చెందిన వారే పదవులు చేపట్టారు. అధిక శాతం మంది ఓటర్లు కాళింగ సామాజిక తరగతికి చెందిన వారు కాగా, సుమారు 20 వేల మంది వరకు వెలమ సామాజిక తరగతి చెందిన వారు ఉన్నారు. నియోజకవర్గంలో సుమారు 70 వేల మంది ఉన్న కాళింగ సామాజిక తరగతికి చెందిన వారు ఉన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో రసవత్తర ముగ్గురు పోటీలో ఒక్క అచ్చెన్నాయుడు మినహా, మిగిలిన ఇద్దరు అభ్యర్థులూ కాళింగ సామాజిక తరగతి చెందిన వారే.

మహిళా ఓటర్లు అధికం

టెక్కలి నియోజకవర్గంలోని టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలు ఉన్నాయి. తాజా ఓటర్ల జాబితా సవరణల మేరకు సుమారు 15 వేల మంది మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. పోలింగ్‌లో పాల్గొనేదీ మహిళా ఓటర్లే అధికం కావడంతో వారి మద్దత్ ఎవ్వరికి లభిస్తుందో వేచిచూడాలి. ఈ క్రమంలో టెక్కలి నియోజకవర్గం పీఠం ఎవ్వరికి దక్కుతుందో వేచిచూడాలి.

ఓట్లు అడిగే అర్హత టిడిపికి లేదు

మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జిల్లా నుంచి రెండు సార్లు ఎంపీగా ఎన్నికైన కింజరాపు రామ్మోహన్ నాయుడుకి ఓట్లు అడిగితే అర్హత లేదని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని పూండి, గోవిందపురం, ఉద్దానం గోపినాథపురం, కంబాలరాయుడుపేట, పి.ఎం.పురం గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌తో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల ఎంపీ పదవీ కాలంలో చేసింది ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అత్యంత అసమర్ధ ఎంపీ రామ్మోహన్ నాయుడే అని ధ్వజమెత్తారు. రామ్మోహన్ అంటే ఒక అద్దె మైక్ అని ఎద్దేవా చేశారు. రైల్వేస్టేషన్‌లో ఇనుము కుర్చీలు వేయడానికి మాత్రమే పని చేశారని దుయ్యబట్టారు. ఓట్లు అని గ్రామాలకు వస్తే ఏదీ నీ అభివృద్ధి అంటూ నిగ్గతీసి నిలదీయాలని కోరారు.

తాత, తండ్రల పేర్లు చెప్పుకొని రాజకీయాలు చేయడం కాదు, 60 ఏళ్ల గౌతు పాలనకు, 60 నెలల వైసిపి పాలనపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఉద్దానంలో కిడ్నీ మహమ్మారితో పిట్టల్లా రాలిపోతుంటే టిడిపి పాలనలో బాధ్యత తీసుకున్నారా అని ప్రశ్నించారు. గౌతు కుటుంబం తమ పాలనా కాలంలో సొంత ఆస్తులు పెంచుకోవడమే తప్ప ప్రజలకు చేసిన మంచి ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను, తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు హనుమంతు వెంకటరావుదొర, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాస్, జడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, ఎంపిపి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు పాల్గొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న అప్పలరాజు, తిలక్

జగన్మోహన్ రెడ్డితోనే సంక్షేమం

స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- బూర్జ

పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర సిఎం జగన్మోహన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అందజేస్తున్నారని స్పీకర్, స్థానిక వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం అన్నారు. మంగళవారం మండలం సుంకరి పేట, కాళపర్తి, గుత్తావల్లి, లాభం, నారాయణపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను తెలియజేస్తూ ఓటును అభ్యర్థించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రస్తుత ప్రభుత్వంలో పారదర్శకంగా కొనసాగుతున్నాయన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం ప్రభుత్వానికి నాలుగు మూల స్తంభాల వంటివన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నెన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, రాష్ట్ర టిట్కో డైరెక్టర్ కండపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బి.సూర్యారావు, కె.కృష్ణం నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, మాజీ మార్కెట్ చైర్మన్ గుమ్మడి రాంబాబు, స్థానిక నాయకులు గోపాలరావు, ఆనందరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస: రాష్ట్ర అభివద్ధి జగన్‌తోనే సాధ్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని చింతలపేట, దండేవలస, బొబ్బిలిపేట గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, బెండి గోవిందరావు, గురుగుబెల్లి శ్రీనివాసరావు, చలపతిరావు, పేడాడ వెంకటరమణ, గురుగుబెల్లి నీలారావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : ప్రచారం చేస్తున్న సీతారాం

జగన్ హయాంలో ప్రజలపై భారాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

జగన్మోహన్ రెడ్డి హయాంలో ప్రజలపై అధిక భారాలు వేసి బాదుడే బాదుడు కొనసాగించారని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పొన్నాంపేట, రామచంద్రాపురం, చిట్టివలస, కుమ్మరిపేట, సైలాడ, చిన్నజొన్నవలస, పెద్ద జొన్నవలస, గాజుల కొల్లివలస, ఆర్ఆర్ కాలనీ, రాధాకృష్ణాపురం, శ్రీహరిపురం గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనుడు, ఒక చేత్తో రూ.పది ఇచ్చి మరో చేత్తో రూ.వంద వసూలు చేసిన ఘనుడు జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. టిడిపి హయాంలో ట్రాక్టర్ ఇసుక ధర రూ.700 ఉండేదని నేడు వైసిపి హయాంలో రూ.5వేలు వసూలు చేస్తున్నారని, ప్రజలు దీనిని గమనించాలని కోరారు. రేషన్ దుకాణాల ద్వారా టిడిపి హయాంలో ఐదు రకాల నిత్యవసర సరుకులు అందించే వారమని, వైసిపి అధికారంలోకి వచ్చాక రేషన్ దుకాణాలను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక రూ.4 వేలు పింఛన్‌ను పెంచనున్నామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. శాసనసభ్యుడిగా పోటీ చేస్తున్న తనకు, ఎంపీగా పోటీ చేస్తున్న కింజరాపు రామ్మోహన్ నాయుడుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకుడు పేడాడ సూరప్పు నాయుడు, టిడిపి నాయకులు మెట్ట సుజాత, నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్, బొడ్డేపల్లి గౌరీపతి, అన్నెపు భాస్కరరావు, గొండు రమణ, సనపల చెల్లం నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కూన రవికుమార్

టిడిపి విజయానికి తోడ్పాటు అందించాలి

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న స్వాతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు భరోసా కల్పిస్తున్నారని ఆయనను సిఎం చేయడానికి నియోజకవర్గ ప్రజలు కూటమి అభ్యర్థులుగా బరిలో ఉన్న రామ్మోహన్ నాయుడు, గొండు శంకర్‌లకు అండగా నిలవాలని నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతి కోరారు. గార మండలంలో మంగళవారం పేట చెరువులు, రామకృష్ణాపురం, అంపోలు చెరువులను మాజీ సర్పంచ్, మాజీ మండలాధ్యక్షుడు గుండ వెంకటరమణ మూర్తి, ఎంపిటిసిలు గుజ్జల హిమగిరి, గొండు అచ్యుత, వెలమల శ్రీనివాసరావు, రుప్ప ముసలి నాయుడు, ముద్దాడ సత్యం, ముద్దాడ గున్నేశ్వరరావులతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో ఆమె మాట్లాడుతూ బాబు సూపర్ సిక్స్ పథకాలల్లో మహా శక్తి ద్వారా మహిళలకు ఆర్థిక భరోసానిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గార మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రాన్ని వైసిపి ప్రభుత్వం పూర్తిగా నాశినం చేసిందని కాంగ్రెస్ అభ్యర్థి మజ్జి త్రినాథ్‌బాబు ఆరోపించారు. పలాస లేబర్ కాలనీ, సాయిబ్ కాలనీలో మంగళవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇస్తే పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో పారిశుధ్యం అధ్వానంగా తయారైందన్నారు. వారానికి ఒకసారి నీరు సరఫరా చేయలేని పరిస్థితుల్లో వైసిపి ప్రభుత్వం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు ఎమ్మెల్యేగా గెలిపిస్తే పట్టణంలో నీరు సరఫరా చేస్తామన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రైల్వే వంతెన పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కొర్ల హేమారావుచౌదరి, బద్రి సీతమ్మ యాదవ్, మజ్జి బాబూరావు, చలపతి, రఫికుల్లా మహమ్మద్, ఫరూక్ మహమ్మద్, పోలాకి అప్పారావు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న త్రినాథ్‌బాబు

పేదల పక్షపాతి కాంగ్రెస్

ఉపాధి హామీ కూలీలకు పథకాలను వివరిస్తున్న అన్నాజీరావు

ఆమదాలవలస : పేదల పక్షపాతి కాంగ్రెస్ అని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సనపల అన్నాజీరావు అన్నారు. మంగళవారం మండలంలోని హనుమంతుపురం, వెదుళ్లవలస, కొరపాం, జికె వలస గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అలాగే ఉపాధి హామీ పనులు జరుగుతున్న కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పథకాలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోలో ఇచ్చిన తొమ్మిది హామీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి దానికి అనుకూలంగా ఉన్న తోక పార్టీలను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లఖినేని నారాయణ రావు, బొచ్చ వెంకట రమణ, సీపాన శ్రీరాములు, లఖినేని సునీల్, సనపల వాసుదేవరావు, అప్పారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల రోడ్ షో

కొత్తూరు: కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎంపీ అభ్యర్థి పేరాడ పరమేశ్వరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి బి.వెంకటరావులు అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మంగళవారం స్థానిక నాలుగు రోడ్లు కూడలిలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎప్పుడూ పేదల పార్టీ అని అన్నారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తుందని తెలిపారు. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. సిపిఎం నాయకులు సిర్ల ప్రసాద్, నారాయణరావు, ఆనందరావు, ధర్మారావు పాల్గొన్నారు.

రోడ్ షో నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులు

అవినీతిపరులను తరిమికొట్టాలి

ప్రజాశక్తి- పొందూరు

నియోజకవర్గంలో ప్రతి పనిలో కమీషన్ తీసుకుంటున్న అవినీతిపరులను తరిమి కొట్టాలని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. మండలం కింతలిలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి తనకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానన్నారు. ఎన్నికల్లో గ్యాస్‌స్టవ్ గుర్తుపై ఓటువేసి తనను అఖండా మెజార్టీని అందజేయాలని ఓటర్లును కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సువ్వారి దివ్య, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సువ్వారి సువర్ణ, కోరుకొండ సాయికుమార్, పిన్నింటి అప్పల నాయుడు, పోతురాజు సూర్యారావు, చంద్రశేఖర్, శివ, అప్పన్న మాష్టర్, ప్రభాకరరావు పాల్గొన్నారు.

కింతలిలో ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి గాంధీ

మే డే వేడుకలకు సిద్ధమైన శ్రామికవర్గం

ప్రజాశక్తి- రణస్థలం

శ్రామికుల పండుగ అయిన ప్రపంచ కార్మిక దినోత్సవ (మే డే) వేడుకలను జరుపుకునేందుకు జిల్లాలో కార్మిక లోకం సన్నద్ధమైంది. బుధవారం జరిగే 139వ మేడేకు కార్మిక సంఘాల నేతలు ఏర్పాట్లు సిద్ధం చేశారు. 'నేడే మేడేనోయ్.. ఈనాడే మేడేనోయ్..' అంటూ కార్మిక శక్తిని తెలియజేసే గీతాలు వాడవాడలా వినిపించనున్నాయి. 'బడిలో.. గుడిలో.. సాగు భూమిలో.. కొండలు పిండిచేసే క్వారీల్లో.. ఇటుకబట్టీల్లో.. మైనింగ్ క్వారీల్లో.. నిప్పుల కొలిమిలో.. కరకు కారానాల్లో అంతటా నువ్వే.. అన్నింటా నువ్వే.. వెలకట్టలేని త్యాగానికి అర్థం నీవు.. శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీక నీవు.. శ్వేదం విలువకు నిలువెత్తు నిదర్శనం నీవు.. శ్రమశక్తిని చాటిచెప్పే కార్మికుడా జోహార్..' అంటూ కార్మికుల శ్రమ విలువను తెలియజెప్పే గీతాలు శామికవర్గానికి చైతన్యం కలిగించనున్నాయి.

కార్మిక దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పైడిభీమవరం పారిశ్రామిక వాడ, ఆర్‌టిసి, విద్యుత్, భవన నిర్మాణం, సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఉన్న కార్మికులు మేడేను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మేడే రోజున ఉదయాన్నే కార్మిక జెండాలను ఆవిష్కరించి పండుగ వాతావరణంలో వేడుకలను నిర్వహిస్తారు.

నాడు చికాగోలో ఎగిరిన పోరు జెండా

'ప్రపంచ కార్మికులారా ఏకంకండి.. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప.' అని మార్క్సిస్టు నేత కార్ల్‌మార్క్స్ ఇచ్చిన నినాదం ప్రపంచ కార్మికులను ఉత్తేజపరిచి పోరాటంలోకి మరింత ముందుకు నడిపించింది. 1886కు ముందు ప్రపంచ వ్యాప్తంగా 18 గంటలు, 16 గంటల పని విధానాలు అమల్లో ఉండేవి. యజమానులు కార్మికుల శ్రమను దోచుకునేవారు. ఈ దోపిడీ విధానం పోవాలంటూ ప్రపంచ కార్మికులు అన్ని దేశాల్లో పోరాటాలు మొదలుపెట్టారు. అమెరికా దేశంలో చికాగో నగరంలోని గడీలలో, కారానాల్లో పనిచేసే కార్మికులు తమకు పనికి తగ్గ వేతనం కావాలంటూ ధర్నా మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో అక్కడి యాజమానులు, భూస్వాములు కలిసి కార్మికులకు పనికి తగిన వేతనం

ఇవ్వకుండా వారిని పొట్టున పెట్టుకున్నారు. వందలాది మంది కార్మికులను అక్కడి భూస్వాములు చంపివేశారు. ఆ రక్తపు మడుగులోంచి కార్మికుల్లో ఒకరు రక్తంతో తడిసిన తన చేతి రుమాలును తీసి కార్మిక జెండాగా పైకి ఎగురవేశారు. ఆనాటి నుంచి మే 1ని ప్రపంచ కార్మిక దినోత్సవంగా జరుపుకుంటున్నారు. అనేకమంది తమ ప్రాణాలను తృణపాయంగా అర్పించి శ్రమదోపిడీపై విజయం సాధించారు. 1886 మే 1 నుంచి 8 గంటల పని విధానం అమల్లోకి వచ్చింది.

సంఘాల ఆధ్వర్యంలో సన్నాహాలు

మేడే రోజంటేనే కార్మికుల పండుగ. అన్ని వర్గాల కార్మికులు ఎంతో ఆనందంగా, సంతోషంగా మేడే ఉత్సవాలను జరుపుకుంటారు. ఈ మేరకు ఎన్నికలు సమీపిస్తున్నందున జిల్లాలోని అనేక రాజకీయ పార్టీల అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను పెద్దఎత్తున నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆయా నిర్వహణ కమిటీలు ఆయా పనుల్లో నిమగ్నమయ్యాయి. సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్ పార్టీ, టిడిపి, జనసేన, బిజెపి తదితర పార్టీల అనుబంధ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున మేడే వేడుకలను జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఆయా అడ్డాల వద్ద జెండాలను ఎగురవేసేందుకు కార్మిక సంఘాల దిమ్మెలకు రంగులు వేస్తున్నారు. తోరణాలు కట్టి జెండాలను ఎగురవేస్తారు. కార్మిక ఉద్యమంలో కార్మికుల హక్కులను నెరవేర్చే క్రమంలో ప్రాణాలను కోల్పోయిన వీరులను తలుచుకొని వారి జ్ఞాపకాలను పంచుకుంటారు.

శ్రీరంగులు దంపతులను సన్మానిస్తున్న ఎస్‌పి తదితరులు

శ్రీరంగులు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సుదీర్ఘకాలం పోలీసు శాఖకు ఎస్.శ్రీరంగులు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎస్‌పి జి.ఆర్.రాధిక కొనియాడారు. జిల్లా పోలీస్ శాఖ స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులు నిర్వహిస్తూ మంగళవారం పదవీ విరమణ పొందిన ఎస్ఐ ఎస్.శ్రీరంగులును జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించి, దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేసారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా పోలీస్‌శాఖలో సుమారు 41 ఏళ్ల అంకితభావంతో సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వర్తించి, విధి నిర్వహణలో ఎన్నో సమస్యలు ఎదురైనప్పటికీ ఎక్కడ రాజీ పడకుండా ఉద్యోగ బాధ్యతలు చక్కగా నిర్వర్తించారని అభినందించారు. ఆరోగ్యంగా, ఆనందంగా పదవీ విరమణ చెందటం అదృష్టమని, ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో శేష జీవితం గడపాలని ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి డా.ప్రేమ కాజల్, ఎస్‌బి డిఎస్‌పి ఎ.త్రినాథరావు, ఎఒ సిహెచ్ గోపీనాథ్, సిఐ సత్యనారాయణ రెడ్డి, సోమశేఖర్, ఆర్ఐ నర్సింగరావు, పోలీస్ అసోసియేషన్ సభ్యులు కిల్లి అప్పన్న, కృష్ణం నాయుడు, భుజంగరావు, అరుణ కుమారి, జగదాంబ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టరేట్ తీసుకుంటున్న అశ్విని లావణ్య

అశ్విని లావణ్యకు డాక్టరేట్

శ్రీకాకుళం అర్బన్: ఔషధ రంగంలో ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ విభాగంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పూడి అశ్విని లావణ్యకు డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ డా.పి. శైలజ పరివేక్షణలో ట్రికగ్రిలోర్ లోడెడ్‌పెక్యులేటెడ్ సాలిడ్, లిపిడ్ నానో ప్రాక్టికల్స్ అనే అంశంపై ఆమె పరిశోధన పత్రాన్ని అందజేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ పివిజిడి ప్రసాద్ రెడ్డి చేతులమీదగా డాక్టరేట్ పట్టాను ఆమె స్వీకరించారు. టికగ్రిలోర్ అనేది గుండె జబ్బులకి సంబంధించిన ఒక ముఖ్యమైన ఔషధం. ఇవి కన్వెన్షనల్ టాబ్లెట్స్ రూపంలో మాత్రమే లభ్యం అవుతున్నాయని, వీటి వాడకం వల్ల శరీరంలో కొన్ని లోపాలను సరిచేస్తూ డెలివరీ సామర్థ్యాన్ని మెరుగు పరుస్తుందని ఆమె తెలిపారు. టెకగ్రిలోర్‌ని సాలిడ్ లిపిడ్ నానో పార్టికల్స్ అనే సూక్ష్మ కణం పొందుపరచడం ద్వారా శరీరంలో మందు మరింత ప్రభావితంగా తక్కువ మోతాదులో ఎక్కువ కాలం పని చేసేందుకు ఈప్రయోగం ఉపకరిస్తుందని ఆమె తెలిపారు. పరిశోధనకు ప్రోత్సహిం చిన డా. పి శైలజకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఆమె తండ్రి పూడి తిరుపతిరావు, భర్త అట్టాడ విశ్వప్రసాద్, కుటుంబ సభ్యులు వెంకటేశ్వరరావు, బాలాదిత్యలు ఆమెను అభినందించారు.

టిడిపిలోకి 30 కుటుంబాలు

నరసన్నపేట: మండలంలోని తామరపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు టిడిపిలోకి చేరారు. వీరికి స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కోల రాజు, సుందరరావు, భాస్కరరావు, రాంబాబు, గోవింద రావు, రాజుతో పాటు 30 కుటుంబాలు చేరాయి. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అడపా చంద్రశేఖర్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, గ్రామ నాయకులు, యూనిట్ ఇన్‌ఛార్జి రెడ్డి సతీష్, కోల రాము, మాజీ సర్పంచ్ గెంబలి ప్రభాకర్, బాబు, కోల సింహాచలం పాల్గొన్నారు.

వైసిపి నాయకుల ప్రచారం

ప్రచారం చేస్తున్న కృష్ణచైతన్య

నరసన్నపేట: వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని బిసిసెల్ సెల్ జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య ఓటర్లను కోరారు. మండలంలోని దూకులపాడు, బాలసీమలి పంచాయతీల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, పొందర కార్పొరేషన్ చైర్మన్ రాజాపు అప్పన్న, టిడిపి మండల ఉపాధ్యక్షులు బగ్గు రమణయ్య, సర్పంచ్ అల్లు అసిరినాయుడు, ఆరంగి శ్రీనివాసరావు, యువజన విభాగం అధ్యక్షుడు పాగోటి గోవిందరావు పాల్గొన్నారు.

అలాగే పోలాకి పంచాయతీ వెదుళ్లవలస, పోలాకి, గంటపేట, కొత్తపేట, ఇందిరానగర్ తదితర గ్రామాల్లోనూ ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ మజ్జి రమణమ్మ, లక్ష్మీనారాయణ, ఎస్.ఎల్.పురం ప్రతినిధి యారబాటి వెంకట రమణ, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్ పాల్గొన్నారు.

వైసిపితోనే సామాజిక న్యాయం

పలాస: వైసిపితోనే అన్ని సామాజిక తరగతులకు చెందిన నాయకులకు రాజ్యాధికారం అందించిన ఘనత సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని మత్స్యకార సంఘం రాష్ట్ర నాయకులు మూగి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని అన్ని సామాజిక తరగతులకు చెందిన నాయకులకే జగన్ టిక్కెట్లు కేటాయించారని అన్నారు. వైసిపి హయాంలో మత్స్యకారులకు అగ్రభాగాన నిలిపారని, అందుకు సీదిరి అప్పలరాజుకు మంత్రి పదవి ఇచ్చి గౌరవించారని అన్నారు. అప్పలరాజు పలాస నియోజకవర్గానికి అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. జనసైనికులకు పవన్ మూడు జెండాలు మోసే పని అప్పగించారే తప్ప ఎక్కడా టిక్కెట్లు కేటాయించలేదని వ్యాఖ్యానించారు. అందుకే జనసైనికులంతా వైసిపిలో చేరుతున్నారని అన్నారు. కూటమి నాయకులు పొత్తుధర్మం ఎక్కడైనా కనిపించిందా? అని ప్రశ్నించారు. కూడమి మూడు పార్టీల పొత్తని, వైసిపి ప్రజలతోనే పొత్తు పెట్టుకుందని అన్నారు. అందుకే ఇక్కడ అప్పలరాజును గెలిపించి, అక్కడ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

12 బైక్‌లు స్వాధీనం

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహణకు పోలీస్ అధికారులు గట్టి చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా దశల వారీగా గ్రామాలు, వార్డుల్లో తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. పట్టణంలో బెల్లుపడా కాలనీలో మంగళవారం కార్డాన సెర్చ్ చేపట్టారు. సిఐ ఇమ్మాన్యుల్ రాజు ఆధ్వర్యాన పట్టణ ఎస్ఐ సత్యనారాయణ, కవిటి ఎస్ఐ రాము పోలీసు బలగాలతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. కాలనీలో ఎటువంటి పత్రాలు లేకుండా ఉన్న 12 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

టిడిపిలో పలువురు చేరిక

పలాస: పలాస టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష సమక్షంలో మందస మండలం మూలి పాడుకు 30 మంది యువకులు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వారికి గౌతు శిరీష పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కె.నరేష్, టి.సతీష్, టి.పరమేష్, శేఖర్, అభి, దేవ, కేశవరావు, బుజ్జి, మహేష్, రమేష్, సంతోష్, వినయ్, ధర్మ, దిలీప్, నవిన్ ఉన్నారు. మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, లింగరాజు, నారాయణ రావు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు

కోటబొమ్మాళి: ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓట్ల కోసం కోటబొమ్మాళి మేజరు పంచాయతీ పరిధిలోని ఉప్పరపేటకు స్థానిక టిడిపి నాయకులు కృష్ణస్వామి ఎన్నికల కోడును ఉల్లఘించి తాగునీటి ట్యాంకరు ద్వారా నీరు అందించారని స్థానిక సర్పంచ్ కాళ్ల సంజీవరావు తెలిపారు. ఈ మేరకు ఎంపిడిఒ ఎ.పద్మజను మంగళ వారం కలిసి ఫిర్యాదు చేశారు. గడిచిన ఐదేళ్లలో ఎప్పుడూ ఆ గ్రామం వైపు కన్నెత్తి చూడని టిడిపి నాయ కులు ప్రస్తుతం ఎన్నికలు తరుణంలో ఆ గ్రామ ప్రజలు ట్యాంకు ద్వారా నీరు అందించి ఓట్లు పొందాలని చూస్తు న్నారన్నారు. ఆయనతో పాటు గ్రామస్తులు ఉన్నారు.

టిడిపి మాటలు నమ్మొద్దు

కోటబొమ్మాళి: అధికారం దక్కించుకోవడానికి ప్రజలను మోసం చేస్తూ మాయమాటలు చెప్పే తెలుగుదేశం పార్టీని నమ్మి మోసపోవద్దని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరావు, మండల పార్టీ అద్యక్షుడు నూక సత్యరాజులు అన్నారు. మండలంలోని యలమంచిలి పంచాయతీలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు.

ప్రచారంలో మాట్లాడుతున్న ఎన్ఇఆర్

కూటమి అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి- లావేరు

అవినీతిపరులైన ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌కు ఈ ఎన్నికల్లో ఇంకో ఛాన్స్ ఇవ్వొద్దని బిజెపి నాయకుడు లుకలాపు అప్పలనాయుడు కోరారు. మంగళవారం కూటమి ఎచ్చెర్ల ఎమ్మెల్యే అభ్యర్థి నడుకుదుటి ఈశ్వరరావుకు మద్దతుగా మురపాక, చిన్నమురపాక, లోపెంట, కేసవరాయపాళెం పంచాయతీల్లో ఎన్ఇఆర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాటడుతూ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అవినీతి హెచ్చిమిరిందని, వందలాది కోట్లు అక్రమంగా సంపాదించారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఇఆర్ మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి పథం వైపు నడిపిస్తానన్నారు. అసంపూర్తిగా ఉన్న తోటపల్లి, మడ్డువలస సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. యువతకు ఉద్యోగులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్య దొర, ఆర్.ప్రకాశరావు, జిల్లేపల్లి జనార్దన్, కొన్ని హేమసుందర్, అలుపాన సూర్యం ఉన్నారు.

రెడ్డి శాంతిని గెలిపించాలి

మెళియాపుట్టి: అభివృద్ధి, సంక్షేమమే సిఎం జగన్ ధ్యేయమని జెడ్‌పిటిసి గూడ ఎండయ్య అన్నారు. మండలంలో గొట్టిపల్లి పంచాయతీలో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధులు పెద్ద బొంతు అప్పారావు, జనార్ధన, ఎంపిటిసి ఎస్.నాగేష్, సంజీవ్ పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ప్రచారం

మెళియాపుట్టి: మండలంలోని ముక్తపురంలో టిడిపి మండల మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యాన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు, ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మాజీ మండల వైస్ ఎంపిపి బమ్మిడి జగన్నాథం, హనుమంతు హేమలత, విష్ణుప్రసాద్‌పండా, కామరాజు, గుర్రాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలు కుటుంబాలు చేరిక

బూర్జ : కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న స్పీకర్ తమ్మినేని

ప్రజాశక్తి- బూర్జ

మండలం అయ్యవారిపేట కాశపర్తి, లాభం గ్రామాలకు చెందిన 40 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైసిపిలో చేరారు. మంగళవారం స్పీకర్ తమ్మినేని సీతారాం పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం, ఎంపి అభ్యర్థి పేడాడ తిలక్ గెలుపునకు తాము శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో ఇప్పిలి తిరుపతిరావు, పీరుకట్ల సూరిబాబు, గేదెల చిన్నమ్మ, గేదెల కిషోర్, మామిడి మణికంఠ, చింతనిప్పుల దుర్గారావు, మామిడి మహేష్ తదితరులు చేరారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నెన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర టిట్కో డైరెక్టర్ కండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు సూర్యారావు, కృష్ణం నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, మాజీ మార్కెట్ చైర్మన్ గుమ్మడి రాంబాబు, స్థానిక నాయకులు గోపాలరావు, ఆనందరావు, ఎస్.గోవిందరావు, మాధవరావు పాల్గొన్నారు.

పొందూరు: మండలం కింతలిలో స్పీకర్, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం, ఎంపి అభ్యర్థి పేడాడ తిలక్ సమక్షంలో సోమవారం రాత్రి గ్రామానికి చెందిన పైడి నాగభూషణం ఆధ్వర్యంలో టిడిపి, కాంగ్రెస్‌కు చెందిన సుమారు 100 కుటుంబాలు వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా వారికి వైసిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర కళింగ కార్పోరేషన్ చైర్మన్ దుంపల రామారావు, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణ మూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, స్థానిక నాయకులు బొమ్మాళి గిరి, సూర్యనారాయణ, లోకనాథం, తేజేశ్వరరావు, ఆనందరావు పాల్గొన్నారు.

బెల్లం ఊటలు, నాటుసారాను ధ్వంసం చేసిన ఎక్సైజ్ సిబ్బంది

బెల్లం ఊటలు ధ్వంసం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఆంధ్ర, ఒడిశా ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా మంగళవారం గ్రామాల్లో దాడులు నిర్వహించి 17వేల లీటర్ల బెల్లం ఊటను, 370 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఆంధ్రాలోని మెళియాపుట్టి మండలంలోని మర, బాలేరు ప్రాంతంలో 5, 300 లీటర్ల బెల్లం ఊటను, 130 లీటర్ల నాటు సారా ధ్వంసం చేశారు. ఎక్సైజ్ జాయింట్ డైరెక్టర్ డి.గంగాధర్ ఆదేశాల మేరకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ టి.తిరుపతి నాయుడు, పలాస ఎఇఎస్ ఐఎ బేగం, పాతపట్నం సిఐ నల్లి సాయి, మెళియాపుట్టి ఎస్ఐ టి. రాజేష్, ఆర్‌పిఎఫ్ సిబ్బందితో పాటు ఒడిశా ఎక్సైజ్ డిఎస్‌సిఐ, సిబ్బందితో దాడులు నిర్వహించారు. వీరితో పాటు టెక్కలి సెబ్ సిఐ జిఎస్ రాజశేఖర్ నాయుడు, పలాస డిటిఎఫ్ సిఐ పి.రామచంద్ర కుమార్, పాతపట్నం, కోటబొమ్మాళి, నరసన్నపేట, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు భోజన వితరణ చేస్తున్న సభ్యులు

వృద్ధులకు భోజనం వితరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి మనిషి అనాథలు, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులను ఆదుకునేందుకు మానవత్వంతో ముందుకు రావాలని వాకర్స్ ఇంటర్నేషనల్ 102 ఎలక్ట్ గవర్నర్, కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొంక్యాన మురళీధర్ అన్నారు. కొంక్యాన రాజేశ్వరి తృతీయ వర్ధంతి సందర్భంగా నగరంలోని మదర్ థెరిస్సా హోంలో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు మంగళవారం భోజన వితరణ చేపట్టారు. తమ సోదరి రాజేశ్వరి జీవించినంత కాలంలో మదర్ థెరిస్సా హోంలో సేవా కార్యక్రమాలకు సహకారం అందించేవారని, ఆమె మరణించినా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కోట సావిత్రమ్మ, కొన్న నరసింహామూర్తి, కొంక్యాన రాధాకృష్ణ, కొంక్యాన వేణుగోపాల్, మంగమ్మ, సరోజ, చైతన్య, ఫల్గుణరావు, శివశంకర్, మదర్ థెరిస్సా హోమ్ సిస్టర్స్ పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'పై ప్రచారం

శ్రీకాకుళం రూరల్: నియోజకవర్గంలో వైసిపి నేతలు ఓటమి భయంతో చేస్తున్న తప్పుడు ప్రచారం, బూటకపు శంకు స్థాపనలను నమ్మొద్దని మాజీ ఎంపిపి గొండు జగన్నాధరావు అన్నారు. మండలం కరజాడలో చెరువు పనులను గొండు సింహాచలం, బలగ చిన్నవాడు, బలగ మురళి, ముద్దాడ ఆసిరినాయుడు, శిమ్మ నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేగా గొండు శంకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిని గెలిపించాలి

లావేరు: ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని, ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా గొర్లె కిరణ్ కుమార్‌లకు మరో అవకాశం ఇచ్చి గెలిపించాలని ఎచ్చెర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి గొర్లె కిరణ్ కుమార్ భార్య గొర్లె పరిమళ కోరారు. మంగళవారం మండలంలోని బెజ్జిపురం, బొంతుపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి పనులు జరుగుతున్న కూలీల వద్దకు వెళ్లి ఓట్లును కూలీలతో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు వైసిపి ప్రభుత్వం వస్తేనే కొనసాగుతాయన్నారు. ఎమ్మెల్యేగా కిరణ్ కుమార్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతం నాయుడు, మాజీ ఎంపిపి డి.రాజానాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనివాస రావు, సూర్యనారాయణ, కుమారి, విజయలక్ష్మి ఉన్నారు.

ఉపాధి కూలీలను ఓట్లు అభ్యర్థిస్తున్న పరిమళ

వైసిపి పాలనలో దళితులకు అన్యాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో ఐదేళ్ల వైసిపి పాలనలో హరిజన, గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసిన దళిత ద్రోహి సీఎం జగన్మోహన్ రెడ్డిని ఓటు అనే వజ్రాయుధంతో బుద్ధి చెప్పాలని ఉమ్మడి కూటమి అభ్యర్థి కూన రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణ శివారున ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో నియోజకవర్గ ఎస్‌సి, ఎస్‌టి సమావేశాన్ని నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు గుర్రాల చినబాబు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి రవికుమార్, నియోజకవర్గ దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ టిడిపి పాలనలో హరిజన, గిరిజనులకు ఎన్నో సంక్షేమ పథకాల చేపట్టి వారి శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించిన మహోన్నత వ్యక్తి చంద్రబాబు నాయుడని అన్నారు. రాష్ట్ర బిసి సెల్ నాయకులు, టిడిపి పరిశీలకులు ఎల్.చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల కోసం నిరంతరం పరితపించే రవి కుమార్‌ను సైకిల్‌పై అమరావతికి పంపిస్తే ఆయన రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నియోజకవర్గ రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. బిజెపి కన్వీనర్ పేడాడ సూరపు నాయుడు, దళిత నాయకులు బోనెల అప్పారావు, కాద అప్పలనాయుడు, తుద్దలి కృష్ణ, గొల్లపల్లి ఎర్రయ్య, తోట రాము మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటు ఎంతో అవసరమని, హరిజన, గిరిజన ఓటర్లందరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎస్‌సి సెల్ అధ్యక్షులు కె.వి.రమణ, భోజరాజు ప్రభాకరరావు, అప్పలసూరి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

జగన్‌తోనే యాదవులకు గుర్తింపు

ప్రజాశక్తి- రణస్థలం

యాదవులకు గుర్తింపు తెచ్చింది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వాలు యాదవులకు ఎటువంటి గుర్తింపు, ఎటువంటి పదవులు ఇవ్వలేదని, జగన్ మోహన్ రెడ్డి సిఎం అయిన తరువాత రాష్ట్రంలో యాదవులకు ఎన్నోపదవులు ఇచ్చి యాదవులకు గుర్తింపు తెచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి పట్టం కట్టాలని పిలుపు నిచ్చారు. జగన్ మోహన్ రెడ్డి పేదలకు ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టి ఆదుకున్నారన్నారు. చంద్రబాబుకు 2014లో తెలివైన వాడని అధికారం ఇస్తే రాష్ట్రాన్ని అథోగతి పాలు చేశారని అన్నారు. జగన్ పరిపాలనలో ప్రతి ఒక్కరికీ మేలు జరిగిందని, మేలు జరిగిన ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక ఓట్లు మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గద్దిబోయిన కృష్ణ యాదవ్, ఇడదాసుల తిరుపతి రాజు యాదవ్, కరగాన వల్లభరావు యాదవ్, వెనగల శ్యామ్ యాదవ్, ముద్దాడ రాజశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

కళింగవైశ్యులకు అండగా ఉంటా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న గొండు శంకర్

సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తాను ఎల్లప్పుడూ పేదల పక్షాన నిలబడి చేతనైనంత సాయపడుతున్నానని, అందువల్లే టిడిపి కూటమి అభ్యర్థిగా టిక్కెట్టు ఇచ్చారని గొండు శంకర్ పేర్కొన్నారు. నగరంలోని గ్రాండ్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన కళింగ వైశ్యుల ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కళింగ కోమట్లలో ఎక్కువ కుటుంబాలు చిన్న, పెద్ద వ్యాపారాలు చేసుకుని తమ జీవనాన్ని సాగిస్తున్నారని, గతంలో రౌడీయిజాన్ని ప్రోత్సహించిన వైసిపి నాయకులు అనేక మంది వ్యాపారులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. కొంతమంది తమ వ్యాపారాలు వదులు కోవాల్సిన పరిస్థితి కల్పించారన్నారు. పుట్టినప్పటి నుంచి ఇక్కడే ఉన్న తనకు వ్యాపారుల సాధక బాధకాలు తెలుసన్నారు. అయితే ప్రస్తుతం వైసిపి నాయకత్వం వహిస్తున్న మంత్రి ధర్మాన అనుచరులు తనపై బురదజల్లి లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు. కళింగ కోమట్లకు తాను ఎల్లప్పుడు అండగా నిలుస్తానన్నారు. కళింగ వైశ్యులను గతంలో బిసిల జాబితాలో చేర్చింది చంద్రబాబేనన్నారు. ప్రస్తుతం ఒబిసి జాబితాలో చేర్చడంలో ఎంపి రామ్మోహన్ నాయుడు కృషి ఉందన్నారు. సామాజిక వర్గానికి చెందిన స్వర్గీయ వరం కుటుంబం టిడిపిలో చేరికతో పార్టీ మరింత బలపడిందన్నారు. కూటమి అభ్యర్థులను బలపరిచి రానున్న ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. సమావేశంలో కళింగ వైశ్య సంఘం నాయకులు బోయిన గోవిందరాజులు, పైడిశెట్టి జయంతి, జామి భీమశంకర్, కోరాడ హరగోపాల్, కొరాడ రమేష్, జనసేన నాయకులు కోరాడ సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : కండువాలు వేసి ఆహ్వానిస్తున్న రవికుమార్

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని సైలాడ కుమ్మరిపేటకు చెందిన వైసిపికి చెందిన 40 కుటుంబాలు మాజీ సర్పంచ్ జోగి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పొన్నాడ సింహాచలం, రుప్ప రమణ, కోలా త్రినాధ్, చెంచు రాధమ్మ, జోగి రమణమ్మ తదితరులు టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ సమక్షంలో టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి రవికుమార్ టిడిపి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో గ్రామ అభివృద్ధి జరగలేదని, టిడిపి మేనిఫెస్టో విధి విధానాలు నచ్చి పార్టీలో చేరామని తెలిపారు.

శ్రీకాకుళం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో వైసిపి నాయకులు స్థానిక విశాఖ ఎ కాలనీలో నియోజకవర్గ అభ్యర్థి జి. శంకర్ ఆధ్వర్యంలో పెదపాడు, సింగుపురంకు చెందిన సుమారు 100 మంది యువకులు టిడిపిలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి శంకర్ పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

ప్రజాశక్తి- పోలాకి

కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి నరసింహామూర్తి అన్నారు. నరసన్నపేట మండలంలో, జలుమూరు మండలం కోనబానిపేట, అమ్మాయిపేట, ఊడికలపాడు గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ శివారున పనిచేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలను, రైతులను కలిసి హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి కూలికి రోజుకి రూ.400 ఇస్తుందని, రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ వర్తిస్తుందని అన్నారు.

ప్రచారం చేస్తున్న నరసింహామూర్తి

ఓటు హక్కు వినియోగంపై నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఓటు వినియోగంపై ఫ్లాష్ మాబ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్యపరచడానికి జిల్లా అధికారులు స్వీప్ (క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం) పేరుతో పెద్దఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా వినూత్న తరహాలో జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద పలువురు విద్యార్థులతో మంగళవారం సాయంత్రం ఫ్లాష్ మాబ్ కార్యక్రమం చేపట్టి ఓటర్లను చైతన్య పర్చారు. వివిధ రకాల నృత్యాల ద్వారా ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేశారు. విద్యార్థులు నిర్వహించిన ఈ ఫ్లాష్ మాబ్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఫ్లాష్ మాబ్ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యత వివరించేలా ఇసిఐ రూపొందించిన పాటకు నృత్యం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఓటు వేయడానికి ఎన్నికల సంఘం విస్తృత స్థాయిలో ఏర్పాటు చేస్తోందని, అందరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకుందామన్నారు. జిల్లా స్వీప్ నోడల్ అధికారి, డిఆర్‌డిఎ పిడి కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ సూచనల ప్రకారం స్వీప్ ద్వారా ప్రజలను చైతన్యం చేస్తూ ఓటు వేసేందుకు ముందుకు వచ్చేలా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఓటర్లను చైతన్యం చేయడానికి విద్యార్థుల ద్వారా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం ఆర్‌టిసి బస్టాండ్‌తో పాటు సూర్యమహల్ జంక్షన్, పాత బస్టాండ్, మిల్ జంక్షన్‌లో ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

క్రీ'డల్' మైదానం

- వృథాగా భవనాలు
- వినియోగం లేక శిథిలావస్థకు
- తుప్పు పడుతున్న సామగ్రి

ఎన్‌టిఆర్ క్రీడా వికాస కేంద్రం

ప్రజాశక్తి- టెక్కలి

క్రీడల పరంగా టెక్కలి నియోజకవర్గాన్ని తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో అప్పటి క్రీడాశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హయాంలో ప్రారంభమైన మినీ స్టేడియం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నిర్మించిన భవనాలు వినియోగం లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన కొన్ని పరికరాలు, వస్తువులు తుప్పుపడుతున్నాయి. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్‌టిఆర్ క్రీడా వికాస కేంద్రం పేరుతో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో ఇండోర్ స్టేడియం ఆరున్నరేళ్ల క్రితం నిర్మాణం చేపట్టారు. అనంతరం భవనాలు వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న రన్నింగ్ ట్రాక్‌ని 400 మీటర్ల స్థాయికి విస్తరించాలనే ఉద్దేశంతో పనులు ప్రారంబించారు. అయితే విస్తీర్ణం చాలకపోవడంతో డిగ్రీ కళాశాల మైదానానికి ఆనుకుని ఉన్న ఆలయ స్థలంలో కొంత భాగం సేకరించి నిర్మాణం చేపట్టాలని అప్పట్లో మంత్రి అచ్చెన్నాయుడు ఆలోచించారు. ఆలోచన కార్యరూపం దాల్చకపోవడమతో డిగ్రీ కళాశాల మైదానానికి సరిహద్దులు సూచించే ప్రహరీ కూల్చివేసి వదిలేశారు.

ఆక్రమణకు గురవుతున్న ప్రహరీ

ప్రస్తుతం కళాశాల మైదానానికి ఆనుకుని ఉన్న స్థలం ఆక్రమణకు గురవుతుంది. రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాల్లో ఒక్క షటిల్ కోర్టు భవనం మాత్రమే వినియోగంలోకి ఉంది. లక్షలాది రూపాయలు వెచ్చించి జిమ్ పరికరాలు కొనుగోళ్లు చేశారు. అవి కొన్ని నెలల పాటు వినియోగంలోకి తీసుకొచ్చారు. అయితే వాటిని నిర్వహించడానికి సరైన కోచ్ లేక అది మూతపడింది. దీంతో జిమ్ పరికరాలు వినియోగం లేక తుప్పు పడుతున్నాయి. క్రీడారంగాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో చదరంగం, క్యారమ్స్, వంటి క్రీడలను తీసుకొచ్చారు. కానీ, అవి ప్రారంభానికి నోచుకోలేదు. భవనాలు వినియోగించక పోవడం, నిర్వహణ లేక పోవడంతో గదులు అపరిశుభ్రత వాతావరణం మధ్య ఉన్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టిన భవనాలు వినియోగంలోకి రాకపోవడంతో నియో జకవర్గం క్రీడాపరంగా వెనుకబడి ఉందనే చెప్పాలి. ఇప్పటికైనా అధికారులు వీటి వినియోగంపై ఏ రీతిన స్పందించి భవనాలు వినియోగంలోకి తీసుకువస్తారో వేచి చూడాలి.

వినియోగంలోకి రాని క్రీడాకారుల గదులు

మాట్లాడుతున్న ఎంపిపి ఉమ

నీటిఎద్దడి నివారణకు చర్యలు

కోటబొమ్మాళి: మండలంలో అన్ని గ్రామాల్లో నీటిఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపిపి రోణంకి ఉమ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ ఎచ్చెర్ల పద్మజ అధ్వర్యాన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ కావ్యశ్రీకు తమ తమ గ్రామాల్లో తాగునీరు బోర్లు, బావులు మరమ్మతులు గురించి వివరించారు. ఎంపిపి మాట్లాడుతూ ప్రతి గ్రామానికీ తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆయా గ్రామాలకు తాగునీటి ట్యాంకులు పెట్టి ఎనీరు అందించాలని ఎఇకి సూచించారు. కార్యక్రమంలో సభ్యులు బొడ్డు అప్పన్న, నూక సత్యరాజు, సంపతిరావు హేమసుందరరాజు, మెట్ట ధనలక్ష్మి సింహాచలం, పేడాడ జోత్స్న, వెంకటరావు, బోనేల ఎల్లయ్య, దుక్క రోజా తదితరులు పాల్గొన్నారు.





ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

జగనన్నతోనే సంక్షేమం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

సంక్షేమ పథకాలు సిఎం జగన్‌తోనే సాధ్యమని వైసిపి జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు చింతాడ మంజు అన్నారు. టెక్కలిలో కోదండరామ వీధి, బిసి కాలనీలో తెలికలవీధి మంగళవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. వైసిపితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైసిపి ప్రభుత్వం రావాలన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌లు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు కిల్లి అజయ్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, టౌన్ పార్టీ అధ్యక్షులు తమన్నగారి కిరణ్, సర్పంచ్ గొండెలి సుజాత, శిగిలిపల్లి మోహనరావు, ఎంపిటిసి కూన పార్వతి, పీత హేమలత పాల్గొన్నారు.

ప్రజాశక్తి
మేడే
ప్రత్యేక అనుబంధం
12 పేజీలు
శ్రీకాకుళం జిల్లా
బుధవారం 1-5-2024
Advt. Feature



శ్రమజీవుల ఆశాజ్యోతి మేడే

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మానవ జాతి చరిత్రలో 18వ శతాబ్దం అంతకు పూర్వం కంటే అత్యంత అభివృద్ధి చెందిన శతాబ్దంగా వినుతికెక్కింది. ఆ శతాబ్దంలోనే ఇంగ్లండ్ మరికొన్ని యూరోపియన్ దేశాల్లో ఉత్పత్తి రంగంలో ఆవిరి యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా పారిశ్రామికీకరణ ప్రారంభమైంది. 1776 మార్చిలో వాట్ సన్ ఆవిరి యంత్రాన్ని కనిపెట్టాడు. దాన్ని ఇంగ్లండ్‌లోని ఓ బొగ్గు గనిలో మొదటిసారిగా ఉపయోగించారు. ఈ క్రమం అమెరికాకు కూడా పాకింది. బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం వల్ల 1820 సంవత్సరంలో ఉన్న చేనేత కార్మికుల సంఖ్య 2,40,000 నుంచి 1844 సంవత్సరానికి 60 వేలకు తగ్గింది (1860 నాటికి ఇది 8 వేలకు తగ్గిపోయింది). అదేకాలంలో మరమగ్గాల ఆపరేటర్లు 10 వేల నుంచి లక్షన్నరకు పెరిగారు. యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ 19వ శతాబ్దంలో సైన్సు, టెక్నాలజీ బాగా అభివృద్ధి అయ్యాయి. దానితో భారీ పరిశ్రమలు ఏర్పడ్డాయి. వేల సంఖ్యలో కార్మికులు తలెత్తారు.

రైల్వేలు, మోటారు కార్లు, టెలిఫోన్, టెలిగ్రాఫ్, విద్యుచ్ఛక్తి కూడా వాడుకలోకి వచ్చాయి. ఆ శతాబ్దంలో జర్మనీ, ఫ్రాన్స్ దేశాల్లో పారిశ్రామికరంగ అభివృద్ధి విశేషంగా జరిగింది. యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల సంఖ్య ఒక కోటికి పెరిగింది. దానితో ఉత్పత్తి రంగంలో పెట్టుబడిదారీవర్గం, కార్మికవర్గం అనే రెండు ప్రత్యర్థి వర్గాలు తలెత్తాయి. పెట్టుబడిదారులు శ్రామిక ప్రజల శ్రమశక్తిని క్రూరంగా



దోచుకుంటున్నారు. దీంతో పెట్టుబడిదారీ, కార్మికవర్గాల మధ్య సంఘర్షణ అనివార్యమైంది.

పారిశ్రామిక విప్లవం ప్రారంభ దినాల్లో శ్రామికలు బానిసల మాదిరిగా శ్రమిస్తుండేవారు. పారిశ్రామివేత్తలు అధిక లాభాలను పిండుకోవడానికి ఆరేడేళ్ల పిల్లలతోనూ, మహిళలతో కూడా ఫ్యాక్టరీల్లో, గనుల్లో పని చేయించారు. బాల కార్మికులు గనుల్లోని చీకటి సొరంగాల్లో.. బొగ్గు బళ్లను మోచేతులపైన, మోకాళ్లపైన పాకుతూ లాగేవారు. ఆఖరికి పొగగొట్టాల పైకెక్కి వాటిని శుభ్రపర్చేవారు. ఇంగ్లండ్‌లోని అనాథ శరణాలయాల్లో పిల్లలను అక్కడి అధికారులు పారిశ్రామికవేత్తలకు పశువుల మాదిరిగా విక్రయించేవారు. బాల కార్మికులు ఉదయం నుంచీ రాత్రి వరకూ యంత్రాల వద్ద నిలబడి పనిచేసేవారు. క్షణం సేపు కన్ను మూస్తే ఆ చిన్నారుల వీపులు కొరడా దెబ్బలతో చిట్లిపోయేవి. ఇక శ్రమజీవులతో రోజూ 16 గంటలు పనిచేయించేవారు. మరికొందరు పెట్టుబడిదారులు 20 గంటలు కూడా పనిచేయించారు. 1806లో అమెరికాలోని ఫిలడెల్ఫియాలో చెప్పులు కుట్టే కార్మికులు సమ్మె చేసిన సందర్భంగా జరిగిన విచారణలో కార్మికులతో యజమానులు రోజుకు 20 గంటలు పనిచేయించుకుంటున్నట్లు లోకానికి వెల్లడైంది. కార్మికులకు అతి తక్కువ జీతాలిచ్చేవారు. పని భద్రత, సౌకర్యాలుండేవి కావు. ఫ్యాక్టరీల్లో గాలీ వెలుతురు మృగ్యం. యంత్రాల వద్ద రక్షణ లేక కార్మికులు అనేక రకాలుగా ప్రమాదాల బారిన పడి మరణిస్తుండేవారు. కార్మికులు అమానుష శిక్షలకు కూడా గురవుతుండేవారు.

కార్మికులు తాము అనుభవించే పీడనకూ.. దోపిడీకీ కారణం (మిగతా...2లో)

ఉప్పు పండేనా..? ఉపాధి చూపేనా..?

- ఉపాధి లేని కార్మికులు
- ప్రస్తావన లేని భూములు లీజు రెన్యువల్
- పెట్టుబడి సొమ్ము దక్కని పరిస్థితి
- కలగానే గోదాముల ఏర్పాటు

ప్రజాశక్తి - నౌపడ

రెండు దశాబ్దాల కిందట ఓ వెలుగు వెలిగిన నౌపడ ఉప్పు పరిశ్రమ ఇప్పుడు వెలవెలబోతోంది. తీసుకున్న భూములకు లీజు గడువు ముగిసిన నేపథ్యంలో ఉప్పు ఉత్పత్తి సగానికిపైగా పడిపోయింది. పండించిన ఆకాస్త పంట కూడా మద్దతుధర లేక రైతులు నష్టపోతున్నారు. పనుల్లేక కార్మికులు అవస్థలు పడుతున్నారు. దీంతో ఉప్పు పండించి బతికే రైతన్నలు, పనిచేసే కార్మికులకు వలసలే శరణ్యంగా మారాయి. ఉప్పు పరిశ్రమ నుంచి వందలాది మంది కార్మికులు భవన నిర్మాణరంగంలోకి చేరిపోయారు. చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం, బళ్లారి, ఒడిశా ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్నారు. సరైన ఉపాధి మార్గాలులేక ఈ ప్రాంతంలోని యువత విదేశాల్లో పలు నిర్మాణరంగాల్లో పనులు చేసుకోవడానికి మొగ్గు చూపుతున్నారు. ఉప్పు పంటపై ఆధారపడి జీవిస్తున్న సుమారు రెండు వేల మంది కుటుంబాలకు ప్రభుత్వాలు ఊతం అందించే పరిస్థితి కనబడటం లేదు. నౌపడ పరిసర ప్రాంతంలో 3వేలకు పైగా ఎకరాలు భూములు వృథాగా ఉన్నా ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి దాపురించింది. అంతే కాకుండా భావనపాడు పోర్టు పేరుతో ప్రభుత్వం భూములు తీసుకుంటుందని ప్రచారం సాగుతోంది. ఇకపై భూములు ఉంటాయో పోతాయో తెలియక ఇక్కడి రైతులు, కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

ప్రస్తావన లేని ఉప్పు భూముల రెన్యువల్

కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో స్వతంత్రం వచ్చిన తరువాత 1948 నుంచి ఈ భూములు లీజుకు ఇస్తూ వచ్చింది. ప్రతి 20ఏళ్లకు వీటి లీజు గడువును రెన్యువల్ చేస్తూ వస్తోంది. నౌపడ, యామలపేట, మర్రిపాడు, భావనపాడు ప్రాంతంలో సుమారు 2600 ఎకరాలు లీజుకు ఇచ్చింది. దీంతో రైతులు తాతలు, తండ్రులుగా ఆ ప్రాంతంలో ఉప్పు పండించుకున్నారు. ఈ నేపథ్యంలో 2018లో ప్రభుత్వం వీటి లీజు రద్దు చేసింది. దీనిపై రైతులు హైకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వ తీరుకు హైకోర్టు సమర్ధిస్తూ తీర్పు వెలువరించింది. దీంతో చిన్న సన్నకారు, సన్నకారు రైతులను ఖాళీ చేయించి 549 ఎకరాల భూములను ఉప్పు శాఖ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఇక్కడ ఉప్పు పంటలు వేయరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ముమ్మరంగా పండించే సీజన్ ఉన్నా రైతులు భయపడి ముందుకు రావడం లేదు. మిగిలిన భూములకు 2027 వరకు లీజు కాల పరిమితి ఉంది. మరికొందరు కోర్టును ఆశ్రయించడంతో వారి జోలికి అధికారులు పోవడం లేదు. లీజులు ఇవ్వక, పంటలు పండక వందలాది ఎకరాలు వృథాగా పడి ఉన్నాయి.

కానరాని మద్దతు ధర

ఆరుగాలం కష్టించి.. శ్రమనే పెట్టుబడిగా పెట్టి ఉప్పు పండించే రైతుకు మధ్యవర్తులు, దళారులు చేష్టలతో ధరల నియంత్రణ లేక గిట్టుబాటు రావడం లేదు. వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారి ధరలు నిర్ణయించే పరిస్థితి దాపురించింది. నెల రోజుల పాటు ధరలు పెంచడం, తర్వాత అమాంతం తగ్గించడంతో రైతులు మోసపోతున్నారు. ఇక్కడ దళారులు తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసుకుంటున్నారు. రెండు నెలల క్రితం రూ.210 నుంచి 280 వరకు ఉన్న 50 కేజీల బస్తా ప్రస్తుతం 120 నుంచి 180కి పడిపోయింది. పంట పెట్టుబడి కింద కూలీలకు వచ్చే కార్మికులకు పూటకు రూ.150 కూలి, పెరిగిన డీజిల్ ధరలతో ఇంజిన్‌తో నీరు తోడి గల్లీల్లో నింపడం, మోత, తీత, చదును చేయడం, కుప్పలుగా పేర్చడం, బస్తాలు ఎక్కించడం వంటి పనులకు పెట్టుబడి పెట్టాల్సి ఉంది. ఒక ఎకరాకు పండించే రైతుకు ప్రస్తుత లెక్కల ప్రకారం ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. అయితే ధరల నియంత్రణ లేకపోవడంతో కాయకష్టమే రైతన్నలకు మిగులుతోందని పలువురు రైతులు వాపోతున్నారు. డీజిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో కనీసం గల్లీలకు విద్యుత్ సౌకర్యమైనా కల్పించాలని వేడుకుంటున్నారు.

కలగానే గోదాముల ఏర్పాటు

ఎన్నికల హామీలుగా గోదాములు ఏర్పాటు మిగిలిపోయింది. ఇన్ని వేల ఎకరాలలో పంట జరుగుతున్న ప్రభుత్వం పంట గుర్తించడంలో వైఫల్యం చెందింది. కనీసం మార్కెటింగ్, రవాణా సదుపాయం అంటే అదీ లేదు. ముఖ్యంగా గోదాములు నిర్మిస్తే ఉప్పు పెద్ద ఎత్తున నిల్వ చేసుకోవచ్చు. ధర పెరిగినప్పుడు విక్రయించుకోవచ్చు కానీ కనీసం అలాంటి సదుపాయాలు కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదు. శిథిలమైన గోదాములను పట్టించుకునే పరిస్థితి లేదు. దీంతో చేసేదేమీ లేక వర్షం, తుపానుల నుండి కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. పండించిన పంటను బస్తాలోకి ఎత్తి పరదాలు, కొబ్బరి చాపలుతో కప్పేసి నిల్వ చేసుకుంటున్నామని పలువురు రైతులు చెబుతున్నారు. మరికొందరు చేసేదేమీ లేక తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. గోదాములను ఏర్పాటు చేసినా, రవాణా సౌకర్యం కల్పించినా కనీసం కార్మికులకైనా ఉపాధి దొరుకుతుందని వారు చెబుతున్నారు. ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచించి ఆదుకోవాలని కోరుతున్నారు.

శ్రమజీవుల ఆశాజ్యోతి మేడే

తాము పనిచేసే యంత్రాలేనని భ్రమించారు. తెగించి వాటిని ధ్వంసం చేయడం ప్రారంభించారు. ఈ విధ్వంసకాండ మొదట బ్రిటన్‌లో ప్రారంభమైంది. దీంతో పారిశ్రామికవేత్తలు సాయం కోసం ప్రభుత్వం వద్దకు పరిగెత్తారు. నికృష్టంగా.. దోపిడీకి గురవుతున్న కార్మికుల ప్రాణ రక్షణకు చలించని ప్రభుత్వం.. వెంటనే యజమానులు ఆస్తి రక్షణకు పార్లమెంటును ఉపయోగించింది. యంత్రాలను ధ్వంసం చేసేవారికి మరణశిక్ష విధిస్తూ చట్టం చేసింది. తర్వాత కార్మికులు.. యంత్రాలను ధ్వంసం చేయడంలో అర్థం లేదనీ.. తమ దుస్థితికి కారణం ఫ్యాక్టరీ యజమానులే అని గ్రహించారు. ఆ దుస్థితి నుంచి బయట పడటానికి పోరాటం చేయడమొక్కటే మార్గమని అర్థం చేసుకున్నారు. దానితో పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా శ్రామికవర్గం పోరాటం ప్రారంభించింది.

ట్రేడ్ యూనియన్ల మహత్తర సామాజిక శక్తిని చూసి పాలకులు, పెట్టుబడిదారులు హడలెత్తిపోయారు. ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో కార్మికులు అధిక జీతాలు డిమాండ్ చేయడానికి ట్రేడ్ యూనియన్లు నిర్మించుకోవడం చట్ట విరుద్ధంగా ప్రకటించారు. ఏర్పాటైన ట్రేడ్ యూనియన్లను నిషేధించారు. దోపిడీదారులైన పెట్టుబడిదారులు, వారికి అండదండలిచ్చే పాలకులు అనేక మంది కార్మిక నాయకులనూ, ట్రేడ్ యూనియన్ సభ్యులనూ జైళ్లలో కుక్కారు. హత్యలు చేశారు. వారికున్న కొద్దిపాటి సొత్తును సయితం కాజేశారు. ట్రేడ్ యూనియన్లను నిరంకుశంగా నిషేధించారు. సమ్మె హక్కునూ, పికెటింగ్ హక్కునూ లాగేశారు.

బూర్జువా పాలకులు ట్రేడ్ యూనియన్లను నిషేధించినా, పశుబలంతో కార్మికవర్గ పోరాటాలను రక్తపుటేరుల్లో ముంచినా.. కార్మికవర్గం వెనుకంజవేయలేదు. పనిగంటల తగ్గింపు, న్యాయమైన వేతనాలు, ట్రేడ్ యూనియన్ల గుర్తింపుకోసం ప్రభుత్వం నుంచి హక్కులు సాధించడానికి కార్మికవర్గం వర్గ చైతన్యంతో పోరాటాలను కొనసాగించింది. ఈ పోరాట జ్వాలలు 19వ శతాబ్ద ప్రథమార్ధ భాగంలో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికాల్లో దోపిడీ శక్తులను చుట్టుముట్టాయి. ఇంగ్లండ్‌లో 1818లో స్టాక్‌పోర్టు పట్టణంలోని బట్టల ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు సమ్మె బావుటాను ఎగురవేశారు. ఈ సమ్మె పోరాటం కార్మికవర్గ చరిత్రలో ప్రథమ సమ్మె పోరాటంగా చెప్పబడింది. ఫ్రాన్స్ దేశం లయాన్స్ పట్టణంలోని సిల్కు పరిశ్రమల్లో 1831లోనూ, 1834లోనూ కార్మికులు తిరుగుబాటు జరిపారు. ప్యారిస్ నగరంలో 1848 జూన్ 23-26 మధ్య సమ్మె పోరాటాలు జరిగాయి. జర్మనీలోని సైలీషియాలో 1844లో నేత పనివారు తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటు ద్వారా శ్రామికవర్గ నిర్మాణాత్మక పటిమ, బూర్జువావర్గంతో దానికిగల శత్రుత్వం స్పష్టంగా వెల్లడయింది. నైరుతీ జర్మనీలో 1848లో విప్లవోద్యమం రగుల్కొంది. అదేఏడు ఆస్ట్రియా వియన్నాలో తిరుగుబాటు వచ్చింది. కార్మికులు విజయం సాధించారు. బెర్లిన్‌లో కార్మికులు, సైనికులకూ మధ్య సంఘర్షణలు జరిగాయి. చివరికి శ్రామికులు విజయం సాధించారు. ఈ కాలంలోనే అమెరికాలో పెక్కు నగరాల్లో కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహించారు.

యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ కార్మికవర్గ బలమైన పోరాటాలు జరపడం వల్ల ప్రభుత్వాలు దిగివచ్చి కార్మికవర్గానికి అనుకూలంగా కొన్ని చట్టాలు చేశాయి. వాటిలో ముఖ్యమైనవి పనిగంటలకూ, బాల కార్మికులకూ సంబంధించినవి. బ్రిటన్‌లో 13 సంవత్సరాల లోపు పిల్లలతో రోజుకు 9 గంటలకు మించి పని చేయించరాదనీ 1834లో ఒక ఫ్యాక్టరీ చట్టం చేయబడింది. శ్రామిక ప్రజలు జరిపిన పోరాటాల వల్ల కొన్ని చట్టాలు చేసినా నిరంకుశాధికారులు వాటిని అమలు చేయలేదు. ఏడాదికేడాది ఫ్యాక్టరీల నిర్మాణం పెరిగిపోతోంది. గనులు, రవాణా రంగాల్లో పనిచేసే కార్మికుల సంఖ్య లక్షల్లో పెరిగింది. కార్మికుల్లో వర్గ చైతన్యం వెల్లివిరిసింది. బలమైన ట్రేడ్ యూనియన్ల నిర్మాణం జరిగింది. కార్మికవర్గ పోరాటాలు బూర్జువా వర్గాలను చుట్టుముట్టాయి.

10 గంటల పని దినం నిర్ణయించాలన్న కోరిక మీద 19వ శతాబ్దం ప్రారంభంలో అమెరికాలో ప్రతి పారిశ్రామిక కేంద్రంలోనూ సమ్మెలు జరిగాయి. ఫిలడెల్ఫియాలోని మెకానిక్ యూనియన్ ఈ 10 గంటల పనిదినం సాధించే పోరాటాన్ని 1827లో ప్రారంభించింది. ఈ పోరాటోధృతిని తట్టుకోలేక అమెరికా ప్రభుత్వం 10 గంటల పనిదినం నిర్ణయిస్తూ శాసనం చేసింది. తర్వాత ఈ 10 గంటల పనిదినం ఉద్యమం అట్లాంటిక్ మహాసముద్రం దాటి యూరప్ ఖండంలో ప్రవేశించి అక్కడి కార్మికవర్గాన్ని ఉత్తేజపరిచింది. యూరప్ ఖండంలో కార్మికులు జరిపిన పోరాటాల ఫలితంగా అనేక దేశాలు 10 గంటల పని దినం అంగీకరిస్తూ చట్టాలు చేశాయి.

1870 నాటికి పారిశ్రామిక, వాణిజ్య, బ్యాంకింగ్ రంగాల్లో గుత్తాధిపత్యం రూపుదాల్చి బలపడింది. పెట్టుబడిదారీ వర్గం కొన్ని ఒడిదుడుకులకు గురయినప్పటికీ అధికలాభాలు పోగేసుకోవడానికి ఆ వర్గాలకు మంచి అవకాశాలు ఏర్పడ్డాయి. కానీ కార్మికవర్గం జీవితాల్లో అభివృద్ధి మాత్రం మృగ్యం. దానితో కార్మికవర్గం పనిగంటల తగ్గింపుకోసం ఉద్యమించింది. 1881 చికాగో నగరంలో వివిధ కార్మిక సంఘాలు కలిసి ఒక సమాఖ్యను నూతనంగా ఏర్పాటు చేసుకున్నాయి. దానికి

మొదటి పేజీ తరువాయి

'అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్' అని పేరు పెట్టారు. ఈ సమాఖ్య 1884 అక్టోబరు 7న తన 4వ సమావేశంలో 8 గంటల పనిదినం ప్రవేశపెట్టాలని చారిత్రాత్మకమైన తీర్మానం చేసింది. 1886 మే 1న దేశమంతా కార్మికవర్గం 8 గంటల పని హక్కు సాధనకు సమ్మె పోరాటాలను నిర్వహించాలని కూడా నిర్ణయించింది. 8 గంటల పనిదినం ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవలసిన అవసరాన్ని కార్మికవర్గం అత్యంత ముఖ్యమైన డిమాండుగా గుర్తించింది. ట్రేడ్ యూనియన్ల సభ్యత్వం లక్షల్లో పెరిగింది. ఈ విధంగా 8 గంటల పనికోసం అనేకచోట్ల కార్మిక పోరాటాలు ప్రారంభమయ్యాయి.

చికాగో నగరంలోని కార్మికవర్గం అమెరికన్ కార్మికవర్గంలో ఒక భాగమే అయినా అక్కడి కార్మికవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. సమస్యల పరిష్కారానికి వారు పటిష్టమైన విప్లవ దృక్పథం అవలంబించేవారు. ఆ నగరంలోని కార్మిక నాయకులు ఎప్పుడూ కార్మికవర్గాన్ని విప్లవ మార్గాన నడిపిస్తూ ఉండేవారు. సమ్మెకు అనేక రోజులకు పూర్వమే "8 గంటల పని దినం సంఘం" ఒకటి అనేక రాజకీయ దృక్పథాలు గలవారితో ఏర్పడి పనిచేస్తోంది. ఆ సంఘం నాయకత్వంలో ఏప్రిల్ 30న (మేడేకి ఒకరోజు ముందు) 25 వేల మంది కార్మికులతో బ్రహ్మాండమైన ప్రదర్శన జరిగింది. మే 1న చికాగో నగరంలో కార్మికవర్గం చైతన్యం వెల్లివిరిసింది. నగరవీధులన్నీ ఉత్సాహవంతులైన కార్మికులతో నిండిపోయాయి. నగరంలో బ్రహ్మాండమైన సార్వత్రిక సమ్మె జరిగింది. కార్మాగారాలన్నీ మూతపడ్డాయి. అదివరకెన్నడూ కనీవినీ ఎరుగనంతటి ఐకమత్యంతో మూడున్నర లక్షల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. నగర వీధులన్నీ కార్మిక సందోహంతో నిండిపోయాయి. 8గంటల పనిదినాన్ని సాధించి తీర్తామనే దృఢ విశ్వాసం వారందరిలోనూ కనిపించింది. సమ్మెను విజయవంతం చేయడానికి వారు సర్వ శక్తులనూ ఒడ్డటానికి సిద్ధమయ్యారు. కార్మికవర్గ శత్రువులు కూడా విజృంభిస్తున్న ఈ కార్మికవర్గ ఉద్యమాన్ని ఏ విధంగానైనా నాశనం చేయాలని నిర్ణయించుకున్నారు. పెట్టుబడిదారీ వర్గానికి అండగా ప్రభుత్వం కూడా రంగ ప్రవేశం చేసింది.

మే 3న శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మిక జనసమూహంపై అమెరికన్ పోలీసులు కాల్పులు జరిపారు. ఆరుగురు కార్మికులను బలి తీసుకున్నారు. ఈ దారుణ హత్యాకాండ పట్ల అసమ్మతి తెలిపేందుకు మే 4న నగరం మధ్యలో ఉన్న హే మార్కెట్‌లో కార్మికులు పెద్ద ఎత్తున నిరసన సభ జరిపారు. ప్రశాంతంగా సాగుతున్న ఆ సభ మీద పోలీసులు విరుచుకుపడ్డారు. మధ్యలో బాంబు ప్రయోగం జరిగింది. ఒక పోలీసు సార్జెంట్ చనిపోయాడు. అది సాకుగా తీసుకొని పోలీసులు నిరాయుధులైన ప్రజలపై తుపాకులతో.. సన్నీలతో స్వైరవిహారం చేశారు. అయినప్పటికీ నిరాయుధులైన కార్మికులు సంఘటితంగా చైతన్యదీప్తితో పోలీసులతో బాహాబాహిగా తలపడ్డారు. ఈ సంఘర్షణలో ఏడుగురు పోలీసులు చనిపోగా.. నలుగురు కార్మికులు నేలకొరిగారు. పాలకులు అదనపు బలగాలను రంగంలోకి దించారు. హే మార్కెట్ ప్రాంతం కార్మికుల రక్తంతో తడిసిపోయింది. అక్కడే ఆవిర్భవించింది ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది శ్రమజీవుల స్వేచ్ఛా సంకేతమైన "అరుణపతాకం".

హే మార్కెట్ ఉదంతాన్ని పురస్కరించుకొని బూర్జువా ప్రభుత్వం కార్మికోద్యమ నాయకులను చుట్టివేసే కార్యక్రమం ప్రారంభించింది. న్యాయస్థానం ముందు విచారణా తతంగం జరిపి సార్సన్, స్పిన్, పిషర్, ఏంగెల్ అనే కార్మిక నాయకులను ఉరి తీయించింది. మరికొందరిని దీర్ఘకారాగార శిక్షలకు గురిచేసింది. తనను ఉరితీసే ముందు స్పిన్ ఇలా అన్నారు. "మమ్మల్ని ఉరితీస్తే మంటలు ఆరిపోతాయను కుంటున్నారా? ఇదిగో అక్కడ, ఇక్కడ, ఆమూలు, ఈమూల, మీ వెనుక, మీ ముందు అన్నిచోట్లా జ్వాలలు చెలరేగుతాయి. అది అంతర్వాహిని. దాన్ని ఆర్పడం మీ తరంకాదు". దేశమంతా ఇతర కేంద్రాల్లో కూడా ఈ దమనకాండ కొనసాగింది. అయినప్పటికీ అమెరికన్ కార్మికుల్లో మాత్రం మే1న విప్లవ చైతన్యం వెల్లివిరిసింది. ప్రతి కార్మికుడూ వర్గ చైతన్యాన్ని ప్రదర్శించడానికి వీధుల్లోకి వచ్చాడు.

ఆ విధంగా 1886 మే 1న ప్రపంచ కార్మిక వర్గ విప్లవ చరిత్రలో రక్తాక్షరాలతో లిఖించదగిన తేదీగా మారిపోయింది. ఆనాటి పోరాటోద్యమానికి చికాగో నగరమే కేంద్రమయినప్పటికీ దేశంలోని అనేక ముఖ్య నగరాలకు ఆ ఉద్యమం వ్యాపించింది. న్యూయార్క్, బాల్టిమోర్, వాషింగ్టన్, పిట్స్‌బర్గ్, డిట్రాయిడ్ మొదలైన పెద్ద నగరాల్లోని శ్రామికులు కూడా మహోత్తేజంగా పోరాటంలోకి దూకారు. ప్రపంచవ్యాప్తంగా శ్రమజీవులను ఉత్తేజపరిచి వారిలో ఆశాజ్యోతిని వెలిగించింది మే దినోత్సవం.

జీడి కార్మికులకు భద్రత కరువు

పలాస మండలంలోని పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలు తెల్ల బంగారంగా పేరుగాంచిన జీడిపప్పును ఉత్పత్తి చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. జిల్లాలో సుమారు 350 జీడి పరిశ్రమలుండగా పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లోనే 250కు పైగా పరిశ్రమలున్నాయి. ఈ పరిశ్రమలపై ప్రత్యక్షంగా 7500 మంది, పరోక్షంగా 5 వేల మంది ఉపాధి పొందుతున్నారు. కాగా జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏళ్ల తరబడి కార్మిక చట్టాలు అమలుకాకపోడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

- ప్రజాశక్తి, పలాస

◆ పరిశ్రమల్లో అమలు కాని కార్మిక చట్టాలు

◆ పట్టించుకోని ప్రభుత్వాలు

ప్రస్తుతం జీడి కార్మికుల బతుకులు దుర్భరంగా ఉన్నాయి. పనిచేసిన చోట కనీస వసతుల్లేవు. మహిళా కార్మికులకు కనీసం మరుగుదొడ్డి సదుపాయం కూడా కల్పించడం లేదు. కార్మిక చట్టాలు అమలుకావడం లేదు. జీడి పరిశ్రమల్లో చెమటోడ్చి పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. కార్మిక శాఖాధికారులు సైతం కార్మిక చట్టాలు అమలులో తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు కేవలం ఎన్నికల సమయంలోనే కార్మికుల సమస్యలను గుర్తుకు తెచ్చుకుని, ఆ తరువాత విస్మరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసలు పట్టించుకోవడమే మానేశాయి. మొత్తమ్మీద జీడిపరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు.

కార్మికులకు అందని కార్మిక చట్టాలు

జీడి పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికునికి సంబంధిత యజమాని రూ.350 వెల్ఫేర్ ఫండ్ చెల్లించాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. కార్మికుల సౌకర్యార్థం ఇఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటుచేయలేదు. ప్రావిడెంట్ ఫండ్‌ను యాజమాన్యం కార్మికుల నుంచి తీసుకుంటున్నప్పటకీ చెల్లింపులు జరపడం లేదు. కొందరు చెల్లిస్తున్నప్పటికీ రశీదులివ్వని పరిస్థితి నెలకొంది. చేతిగొడుగులు ఇవ్వకపోవడంతో జీడిపిక్కను ఒలిచే సమయంలో వచ్చే యాసిడ్‌తో మహిళల చేతులకు వాపులు, ఇతర చర్మవ్యాధులు వస్తున్నాయి. పర్యావసానం పింఛను పొందుతున్న జీడి కార్మికులు పింఛన్లు అందించే సమయంలో వేలిముద్రలు నమోదుకాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది కార్మికులకు బయోమెట్రిక్ విధానంతో పింఛను అందని పరిస్థితి నెలకొంది. మొత్తమ్మీద జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు కార్మిక చట్టాలత ోపాటు కనీస సదుపాయాలకు నోచుకోలేకపోతున్నారు.

జీడి పరిశ్రమలు ఏర్పాటిలా...

16వ శతాబ్ధంలో తీర ప్రాంతం కోతకు గురికాకుండా ఉండేందుకు పోర్చుగ్రీసు వారు వేసిన జీడి మొక్కలతో ఉత్పత్తి అయిన జీడి గింజలు ఒకానొకదశలో పసుపక్ష్యాదులకు ఆహారంగా ఉండేవి. ఆ తరువాత జీడి గింజలను కాల్చి అందులోని పప్పు రుచి చూసిన ప్రజలు జీడి పంటలపై ఆసక్తి చూపించారు. 50 ఏళ్ల క్రితమే పలాసలో జీడి పరిశ్రమకు అంకురార్పణం జరిగింది. 1945 నుంచి పలాసలోని పలువురు జీడి వ్యాపారులు జీడి పిక్కలను కొనుగోలు చేయడం ప్రారంభించారు. అప్పటివరకు అక్కడి రైతులకు జీడి పిక్కల విలువేంటో తెలియని పరిస్థితి. రాష్ట్రంలో జీడి ఉత్పత్తికి కేంద్రమైన 'మోరి' ప్రాంతం నుంచి పలువురు వ్యాపారులు పలాసకు వచ్చి ఉద్దానం జీడి పిక్కలపై దృష్టిసారించారు. ఆ తరువాత వేటపాలెం ప్రాంతానికి చెందిన రాధాకృష్ణ అనే వ్యాపారి పలాస వచ్చి జీడిపరిశ్రమను ఏర్పాటుచేశారు. అప్పటికే పలాసకు చెందిన మల్లా జనార్ధన అనే వ్యాపారి పెనంపై జీడిగింజలను కాల్చి పప్పును తీసి మార్కెట్‌లో విక్రయించేవారు. ఈ విధంగా ప్రారంభమైన జీడి పరిశ్రమ అంచెలంచెలుగా ఎదిగింది. 1986 నాటికి పలాసలో రోస్టింగ్ విధానంతో 30 జీడిపరిశ్రమలుండగా, నేడు పలాసతోపాటు పరిసర ప్రాంతాల్లో మొత్తం 250 పరిశ్రమలున్నాయి. ఈ పరిశ్రమలు ద్వారా వచ్చిన జీడిపప్పును ప్రస్తుతం దేశంలోని పెద్ద నగరాలైన ముంబై, కోల్‌కతా, చెన్నయ్, ఢిల్లీ, అహ్మదాబాద్ తదితర ప్రాంతాలకు పప్పు ఎగుమతి అవుతుంది. ప్రస్తుతం జీడి పరిశ్రమలకు కావాల్సిన ముడిసరుకు జిల్లా నుంచి అందకపోవడంతో ఇతర దేశాల పిక్కలపై ఆధారపడి నడుస్తున్నాయి. పలాసకు శ్రీకాకుళం జిల్లా నుంచే కాకుండా ప్రపంచంలో భూమధ్యరేఖకు సమీపంలో ఉన్న ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని 35 దేశాల నుంచి జీడిపిక్కలు దిగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా నైజీరియా, గనా, ఐవిరికోస్టు, బెనిన్, గెనిబిసావ్, టాంజానియా, ఇండోనేషియా, కెన్యా తదితర దేశాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, కేరళలోని కొచ్చిన్, కర్నాటకలోని మంగుళూరు, తమిళనాడులోని తూటికోర్ని, పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా తదితర పోర్టులకు పిక్కలు దిగుమతి అవుతున్నాయి. అక్కడ నుంచి పలాసకు జీడిపిక్కలను తీసుకువచ్చి జీడిపరిశ్రమల్లో ముడిసరుకుగా వినియోగిస్తున్నారు. 80 కిలోలు పిక్కల బస్తా నుంచి 20-22 కిలోలు వరకు జీడిపప్పు దిగుబడి వస్తుంది. పప్పు గ్రేడింగ్ బట్టి పలాసలో 16 రకాలుండగా ఇతర దేశాలకు 32 రకాల జీడిపప్పు ఎగుమతి అవుతున్నాయి. ఈ జీడిపప్పుతో మన దేశానికి విదేశీ కరెన్సీ ద్వారా కోట్లాది రూపాయలు రావడమే కాకుండా లక్షలాది మంది కార్మికులకు జీవనోపాధి లభిస్తోంది. ప్రభుత్వం మాత్రం పరిశ్రమల అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాష్ట్రం విడిపోయిన తరువాత పరిశ్రమలు తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. విజయవాడ దాటి హైదరాబాద్ వెళ్లాలంటే పన్ను పోటు పెరిగింది. పలాస నుంచి తిరుపతి, ఇతర దేవస్థానాలకు జీడిపప్పు కొనుగోలు చేయాలనే డిమాండ్ గత కొన్నేళ్లుగా ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇతర రాష్ట్రాల నుంచి జీడిపప్పును కొనుగోలు చేస్తుంది తప్ప ఇక్కడ ఉత్పత్తి అవుతున్న పప్పును కొనుగోలు చేయడం లేదు. మరోవైపు పరిశ్రమలకు రాయితీలు కల్పించకపోవడం, పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు మెరుగైన సదుపాయాలు కల్పించకపోవడం, కనీస వేతనాలు అమలు చేయకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాదికి పరిశ్రమలకు అవసరమైన 10.80 లక్షల టన్నులు ముడసరుకులు మన రాష్ట్రం నుంచి ఉత్పత్తి కావడంలేదని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీడి పంట సాగు విస్తీర్ణాన్ని పెంచడంతోపాటు జీడిపరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం రాయితీలు కల్పించాలని, ఈ ప్రాంతంలోని వేలాది మంది కార్మికుల జీవనోపాధికి ఆటంకాలు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు



పలాసలోని జీడి పరిశ్రమ

జీడి పంట సాగు వివరాలు

జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో జీడిపంట సాగవుతుంది. పలాస నియోజకవర్గంలో 21,300 ఎకరాల్లో, కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో 17 వేల ఎకరాల్లో జీడిపంట సాగవుతుంది. 74 గ్రామాల్లో సాగవుతున్న ఈ పంటతో సుమారు 5 లక్షల క్వింటాళ్ల జీడిపిక్కలు దిగుబడి అవుతుంటాయి. ఏటా ఆశించిన స్థాయిలో జీడిపంట దిగుబడి రాకపోతుండడంతో నైజీరియా, టాంజానియా, మలేషియా, న్యూజిలాండ్ దేశాలతోపాటు మనదేశంలోని కేరళ, తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు జీడిపిక్కలను దిగుమతి చేసుకుని గోదాములలో నిల్వ చేసుకుంటుంటారు. వీటిని ఏడాది పొడవునా వినియోగిస్తుంటారు. ప్రస్తుతం జీడిపిక్కల బస్తా (80 కిలోలు) రూ.7 వేలు వరకు ధర పలుకుతుంది. ఈ పంటే జీవనాధారంగా వేలాది మంది రైతులు బతుకుతున్నారు. ఉద్దానంలో పండించిన జీడిపిక్కలనే పలాసలోని జీడి పరిశ్రమలకు అందిస్తుంటారు. తిత్లీ తుపాను ప్రభావంతో ఉద్దాన ప్రాంతంలో జీడి పంట పూర్తిగా నాశనం కావడంతో ఈ ఏడాది ఉద్దాన ప్రాంత రైతులు, జీడి కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర దేశాల నుంచి జీడిపిక్కలను వ్యాపారులు దిగుమతి చేస్తేనే ఉపాధి లభించే అవకాశం ఉందని, లేకుంటే కుటుంబమంతా పస్తులు ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'ఫెర్రో ఎల్లాయిస్' కార్మికుల ఆకలి కేకలు

మూతపడిన ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

వందలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించే పరిశ్రమ మూతపడడంతో కార్మికులు రోడ్డున పడ్డారు. పరిశ్రమనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న కార్మిక కుటుంబాలు అర్ధాకలితో జీవితాలను సాగిస్తున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డితో సహా మంత్రులు, నాయకులు కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో జీవనోపాధి లేక కార్మికులు ఎదురు చూస్తున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. వివరాల్లోకి వెళ్తే...

టెక్కలి మండలం రావివలసలోని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ గత టిడిపి ప్రభుత్వ హయాంలో లాకౌట్ అయ్యింది. ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన పాదయాత్ర సమయంలో అటుగా వచ్చిన సందర్భంగా కార్మికులు పరిశ్రమను తెరిపించాలని వినతిపత్రం అందించారు. అయితే అధికారంలోకి వచ్చిన వెంటనే పరిశ్రమను తెరిపించి స్థానికులకు ఉపాధి కల్పిస్తామని ప్రతిపక్ష నేత హోదాలో జగన్ కార్మికులకు హామీనిచ్చారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన రెండేళ్ల అనంతరం పరిశ్రమ తెరిచారు. పరిశ్రమ తెరుచుకున్న కొద్ది రోజులు నుంచే ఇక్కడ వివాదాలు మొదలయ్యాయి. పరిశ్రమలో గతంలో పని చేసిన రెగ్యులర్ కార్మికులకు రావాల్సిన బకాయిలు, ఇతర ఆర్థికపరమైన అంశాలపై తేల్చాలని, అదేవిధంగా స్థానికులకు పరిశ్రమలో ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు, నిరసనలు చేరారు. కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో కొద్ది నెలల పాటు పరిశ్రమను ఒక సంస్థ నడిపింది. అయినా యాజమాన్యం పట్టించుకోలేదు. దీంతో పరిశ్రమలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు, రోజుకూలీలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

పరిశ్రమలో ఉపాధి కల్పన, బకాయిలు, వేతనాలు ఇతర అంశాలపై పలుమార్లు వివిధ శాఖల అధికారులు, పరిశ్రమ యాజమాన్యం, కార్మిక సంఘ నాయకులతో చర్చలు జరిపారు. అయితే ఇలా జరుగుతున్న నేపథ్యంలో గత ఏడాది ఫిబ్రవరిలో పరిశ్రమకు ఉన్న ఫలంగా యాజమాన్యం లాకౌట్ నోటీసులు అతికించి, ప్రొడక్షన్ తయారీను నిలుపుదల చేసింది. దీంతో కార్మికుల సమస్యల మళ్లీ మొదటికి వచ్చింది. ఎనిమిదేళ్ల నిరీక్షణ అనంతరం తెరుచుకున్న పరిశ్రమ ఏడాదిన్నర కాలంలోనే మళ్లీ మూతబడడంతో కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. పరిశ్రమను మరలా తెరిపించి కార్మికులకు, స్థానికులకు ఉపాధి కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వం విఫలం

మండలంలోని రావివలస ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ తెరుపించడంలో ప్రభుత్వం విఫలమైంది. జిఎంఆర్ నిర్మాణం చేపట్టిన ఈ పరిశ్రమ కొంతమంది కార్పొరేట్ కంపెనీలకు లీజులు ఇచ్చి మూతపడేటట్లు చేస్తున్నారు. కార్మికులకు వేతనాలు చెల్లించకుండా మూత వేయడం దారుణం. కార్మికులకు వేతనాలు చెల్లించి మూత వేస్తే మరొక పనిచూసుకుంటారు. అలా కాకుండా కార్మికులకు తెలియజేయకుండా రాత్రికి రాత్రే లాకౌట్ చేయడం దారుణం.

- నంబూరు షణ్ముఖరావు, సిఐటియు నాయకులు

పనికి తగిన ప్రతిఫలం ఇవ్వాలి

పారిశుధ్య కార్మికులు నిరంతరాయంగా చెత్తతోనే సహవాసం చేస్తున్నారు. వారికి ఎంత ఇచ్చినా తక్కువే అని ఎన్నికల ముందు చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మూడేళ్లయినా వారి శ్రమను గుర్తించలేదు. వారికి అనేక సమస్యలున్నా పట్టించుకునేవారు కరవయ్యారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వందల సంఖ్యలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయడం లేదు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేస్తామని నమ్మించి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. వారికి పనిసమయంలో ఇవ్వాల్సిన సౌకర్యాలను పక్కన పెట్టేశారు. నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. సమాన పనికి సమాన వేతనం అన్నది కూడా అమలు చేయడం చేయడం లేదు. దీనిపై ఆలోచించాలి. అలాగే కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ రూ.వేల కోట్లు రుణమాఫీ చేసి కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులపై మాత్రం భారం మోపుతోంది. అసంఘటిత రంగ కార్మికులు ఉపాధి లేదు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ కార్పొరేటు కంపెనీలకు కారు చౌకగా అమ్మేస్తున్నారు. కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం లభిచడం లేదు.

– సిహెచ్.అమ్మన్నాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్షులు



కనీస వేతనం కోసం పోరాటం

రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయడం లేదు. జగనన్న గోరు ముద్దకు మెనూ ఛార్జీల పెంచకుండా అదనపు భారం పడుతోంది. మధ్యాహ్న భోజన కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. జగనన్న గోరుముద్ద పెరిగిన ధరలకు అనుగుణంగా పిల్లవాడికి ఒక్కింటికీ రూ.20 రీఛార్జ్ పెంచాలి. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని పోరాటాలు చేస్తున్నాం. కార్మికులకు సామాజిక భద్రత పెన్షన్లు, పనిలో అగ్ని ప్రమాదాలకు గురయ్యే బాధితులకు బీమా సౌకర్యం ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. 18 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారికి పనిభద్రత కల్పించాలి.

– అల్లు మహాలక్ష్మి, జిల్లా అధ్యక్షులు, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం



పోరాటాల్లో మహిళలు ముందుండాలి

కార్మికులు, అసంఘటిత రంగంలో ఉన్న మహిళలు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు హక్కులను సాధించుకునేందు కు సమిష్టి పోరాటాలకు ముందు నిలవా లి. పనికి తగ్గవేతనాలు సాధించ డంతో పాటు మహిళలకు అవసమైన ప్రసూతి సెలవులు, ఇతర సౌకర్యాలు సాధించుకోవాలి. మహిళలపై పనిచేసే చోట భౌతిక దాడులు, మానసిక ఒత్తిళ్లు, వేధింపులు జరుగుతున్నాయి. రాజకీయ పార్టీలనుంచి ఒత్తిడికి గురై మానసికం గా కుంగిపోతున్నారు. అటువంటి సమ యంలోనే మనోధైర్యాన్ని కోల్పోకుండా ఎదురు తిరిగి పోరాడాల్సిన అవసరం ఉంది. తద్వారా మెరుగైన మహిళా సమాజాన్ని నిర్మించుకునేందుకు వీలుంది. మేడే స్ఫూర్తితో మహిళలు పోరాటాల వైపు అడుగులు వేయాలి.

- కె.నాగమణి, జిల్లా కన్వీనర్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ

అంగన్వాడీలను ఉద్యోగులుగా గుర్తించాలి

అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి. ఫేస్ యాప్, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలి. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి. అంగన్వాడీలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి. కేంద్రాలకు విద్యుత్ బిల్లులు సైతం కార్యకర్తలే చెల్లించాల్సి వస్తోంది. ఐదేళ్లుగా టిఎ, డిఎలు చెల్లించడం లేదు. గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇప్పటికే ఐసిడిఎస్ అధికారులు పీడీ, సిడిపిఒ, సూపర్ వైజర్లు పర్యవేక్షిస్తున్నారు.

- డి.సుధ, ప్రధాన కార్యదర్శి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

పారిశ్రామికాభివృద్ధి జాడ ఏదీ..?

- పట్టాలెక్కని కొత్త యూనిట్లు
- సంక్షోభంలో జ్యూట్
- ఒక్కొక్కటిగా మూతపడుతున్న పరిశ్రమలు
- రోడ్డున పడుతున్న కార్మికులు

జిల్లాలో గతేడాది పారిశ్రామికంగా పెద్దగా పురోగతి కనిపించలేదు. అడపాదడపా పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చినా పట్టాలెక్కలేదు. పరిశ్రమలు, పెట్టుబడులు అంటూ ప్రభుత్వం చెప్తున్నా, జిల్లాకు పెద్దగా వచ్చిన పరిశ్రమలు గానీ కార్మికులకు అదనంగా ఉపాధి కల్పించిన దాఖలాలు గానీ లేవు. పరిశ్రమలకు కావాల్సిన అనుమతులు పలు స్థాయిల్లో పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. భూసేకరణ, ఇతర సమస్యలూ లేకపోలేదు. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయని ఆశించిన యువతకు నిరాశే మిగులుతోంది. మరోవైపు ముడిసరుకులు, విద్యుత్ నిర్వహణ భారంతో ఒక్కొక్కటిగా పరిశ్రమలు మూతపడ్డాయి. కొత్త పరిశ్రమలు జిల్లాకు రాకపోవడం, ఉన్నవి మూతపడడంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం ఇథనాల్, పేపర్, ఫార్మాస్యూటికల్స్ పవర్ జనరేషన్, గ్రానైట్ వంటి భారీ, మెగా పరిశ్రమలు 40 వరకు ఉన్నాయి. వీటి ద్వారా 63,070 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు ప్రభుత్వం లెక్కలు చెప్తోంది. వీటితోపాటు రైస్ మిల్లులు, జీడిపప్పు పరిశ్రమలు, పేపర్ ప్లేట్ ఉత్పత్తులు, పాలిథిన్ క్యారీ బ్యాగులు, ఇత్తడి వంటి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు 4,083 పరిశ్రమలు ఉన్నాయి. జిల్లాకు పెట్టుబడులు, పరిశ్రమలు వస్తాయని ప్రభుత్వం చెప్పినా అవి కాగితాల్లోనే కనిపిస్తున్నాయి. రణస్థలం మండలం సంచాంలో ఏడాదికి 9 వేల మెట్రిక్ టన్నుల మందుల ఉత్పత్తితో రూ.350 కోట్లతో బల్క్ డ్రగ్ ఉత్పత్తులను ప్రారంభించేందుకు హైయాసింథాస్ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. పరిశ్రమకు కావాల్సిన 11.41 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పగించాల్సి ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేయనున్న ప్రాంతం అనువైనదేనని అధికారులు తనిఖీ చేసి నిర్ధారించారు. ఇప్పటికీ భూమి అప్పగింతతో ఆలస్యమవుతోంది. రణస్థలం మండలం చిట్టివలసలో రూ.720 కోట్లతో ఏడాదికి 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ఔషధాలు ఉత్పత్తి చేసేందుకు సంబంధిత యాజమాన్యం ముందుకొచ్చింది.

పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా వెయ్యి మందికి ఉపాధి కల్పించేందుకు అంగీకరించింది. పరిశ్రమకు 13.91 ఎకరాల భూమి కావాల్సి ఉంది. అందుకు సంబంధించిన ఫైల్ ప్రస్తుతం భూ పరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతం అనువైనదేనని అధికారులు నిర్ధారించారు. ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతులు రాలేదు. ఎచ్చెర్ల మండలం అల్లినగరంలో రూ.65 కోట్లతో రసాయనిక పరిశ్రమ ఏర్పాటుకు ఎన్‌ఎసిఎల్ ముందుకొచ్చింది. పరిశ్రమలో 200 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి.

సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలదీ అదే పరిస్థితి

శ్రీకాకుళం మండలం సింగుపురం గ్రామంలో అపో్ప అథంటిక్ రాక్స్ రూ.5.56 కోట్ల పెట్టుబడితో పరిశ్రమను నెలకొల్పి 20 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. కోటబొమ్మాళి మండలం జర్జంగిలో రూ.27.25 లక్షలతో మారుతీ సామిల్లు టింబర్ డిపో ఏర్పాటు చేసి ఆరుగురికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. ఈ రెండు ప్రతిపాదనలు ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయి.

ఖాయిలాకు సాయం... మాటలకే పరిమితం

జిల్లాలో ఖాయిలా పడిన పరిశ్రమలపై పాలకులు సర్వేలతోనే సరిపెడుతున్నారు. పరిశ్రమలకు ఊతం ఇచ్చేలా ఆర్థిక భరోసా కల్పించడం లేదు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది అక్టోబరులో పరిశ్రమలపై సమగ్ర సర్వే ప్రారంభించింది. ఎగుమతులు, దిగుమతుల వివరాలు, రుణ అవసరాలు, మార్కెటింగ్, ఆర్థిక కార్యకలాపాలపై పరిశ్రమలశాఖ సిబ్బంది, వార్డు గ్రామ సచివాలయాల సిబ్బంది సర్వే నిర్వహించారు. సర్వే కూడా అసంపూర్ణంగానే సాగింది. 2,516 పరిశ్రమలను సర్వే చేయాల్సి ఉండగా 1919 పరిశ్రమలను సర్వే చేశారు. ఇంకా 597 పరిశ్రమలకు సంబంధించిన సర్వే ఇప్పటికీ పెండింగ్‌లో ఉంది. టిడిపి ప్రభుత్వ హయాంలో 2018లో ఒక పర్యాయం సర్వే చేశారు. సర్వే చేపట్టేందుకు పరిశ్రమల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ), పట్టణ ప్రాంతాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సిబ్బందితో సర్వే నిర్వహించారు. అదీ అర్ధాంతరంగానే నిలిచిపోయింది.

ఒడిదుడుకుల్లో జీడి, గ్రానైట్

జిల్లాలో 300 పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో 10 నుంచి 12 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. రోజుకు 125 టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని 5 శాతం నుంచి 2.5 శాతానికి తగ్గించిన తర్వాత జీడిపప్పు ఉత్పత్తి, అమ్మకాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పరిశ్రమలను నిర్వహించలేక వంద వరకు మూతపడ్డాయి.

జిల్లాలో మొత్తం 249 కలర్ గ్రానైట్ పరిశ్రమలు ఉన్నాయి. ప్రస్తుతం వీటిలో 188 పనిచేస్తున్నాయి. క్వారీల నిర్వహణ పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. కరోనా ప్రభావం నిర్మాణ రంగం, ప్రభుత్వ అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతోంది. దీంతో కంకర, చిప్స్ వంటి మెటీరియల్‌కు డిమాండ్ తగ్గింది. ఫలితంగా క్వారీల్లో తవ్వకాలు నిలిచిపోతున్నాయి. జిల్లాలో 141 క్వారీలు ఉండగా ప్రస్తుతం 15 పరిశ్రమలు మూతపడడంతో వందలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు.

సంక్షోభంలో జ్యూట్ పరిశ్రమలు

జిల్లాలో 12 జ్యూట్ మిల్లులున్నాయి. వాటిలో ప్రస్తుతం ఏడు నడుస్తుండగా, ఐదు చోట్ల మూతపడ్డాయి. జ్యూట్ ముడిసరుకు ధరలు, ఇతర మెటీరియల్ ఊహించని రీతిలో పెరుగుతున్నాయి. బంగ్లాదేశ్, నేపాల్ నుంచి పెద్దఎత్తున గోనె సంచులు, జ్యూట్ పురితాళ్లు దిగుమతి కావడం జ్యూట్ ఉత్పత్తుల కొనుగోళ్లు రోజురోజుకీ పడిపోతుండడం, ప్లాస్టిక్ సంచుల వినియోగం పెరగడం మరో కారణంగా ప్రస్తావించారు. బంగ్లాదేశ్, నేపాల్ దేశాలు జ్యూట్ ఉత్పత్తులకు ఎగుమతి పన్ను మినహాయింపు ఇవ్వడంతో పాటు సబ్సిడీలు ఇస్తుండడంతో వారు తక్కువ ధరలకే ఉత్పత్తులను అమ్మగలగడంతో ఇక్కడి ఉత్పత్తులు పోటీ పడలేకపోతున్నాయి. బెంగాల్, బీహార్, అస్సాంల నుంచి దిగుమతి చేసుకునే ముడిసరకుల రవాణకు సబ్సిడీ, జ్యూట్ పురితాళ్లు, జ్యూట్ దారాలపై జిఎస్‌టి తగ్గింపు వంటి సిఫార్సులతో 2019 నవంబర్‌లో అప్పటి కలెక్టర్ పంపిన నివేదికలు బుట్టదాఖలయ్యాయి.

విశాఖ స్టీల్ పోరాటం ప్రభుత్వరంగ రక్షణలో భాగమే

దేశంలోని అన్ని స్టీల్‌ప్లాంట్లకు ఇనుప ఖనిజం లభిస్తున్నది. అందరి కంటే ఎక్కువ ధరకు మార్కెట్‌లో కొనుక్కొనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం ముడి ఖనిజం అందుబాటులో ఎందుకు లేదు? అన్ని స్టీల్‌ప్లాంట్లకు ముడి ఖనిజం, బొగ్గు సప్లయ్ చేసే రైల్వే ర్యాక్‌లు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు లభ్యం కావు? గత 30 సంవత్సరాల నుంచి ఉత్పత్తికి కావలసిన పెట్టుబడులకు ఎన్నడూ కొదవలేదు. కానీ గత సంవత్సరంలో రూ.945 కోట్లు లాభాలు వచ్చినా ముడిసరుకు కొనడానికి పెట్టుబడులు లేవనే వంకతో నేడు యాజమాన్యం ఎక్స్ ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఐఒపి)ని ఏకపక్షంగా ప్రకటించింది. ప్రైవేటు వారిని ఏదో రూపంలో దూర్చడానికి బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని అధికారులు, కార్మికులు భావిస్తున్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం దుర్మార్గంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలని కుట్ర చేస్తున్నా రాష్ట్రం లోని అధికార వైఎస్‌ఆర్ కాంగ్రెస్, ప్రతిపక్ష తెలుగుదేశం తగినట్లుగా స్పందించడం లేదు. ఈ పార్టీల ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ప్రశ్నలు వేస్తున్నారు. కేంద్ర బిజెపి తప్పుడు సమాచారంతో వీరి నోరు మూయిస్తున్నది. రాష్ట్ర ప్రజలను బిజెపి పక్కదారి పట్టించి గందరగోళ పరుస్తున్నది. విశాఖ స్టీల్‌ప్లాంట్ లోని 4 వేల ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలని వైసిపి డిమాండ్ చేస్తోంది. పోస్కో, అదానీలకు విశాఖ స్టీల్‌ప్లాంట్, అందులోని మిగిలిన భూములను రాష్ట్ర ప్రభుత్వం దొంగలు దొంగ లు ఊళ్ళు పంచుకున్న ట్లుగా పంచుకోవాలని పన్నాగాలు పన్నుతున్నారు. వాస్తవ రాజకీయ పరిస్థితిని ప్రజలు అర్థం చేసుకొని ఏప్రిల్ 1న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియజేయాలని కోరుతున్నాం.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం అమ్మాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం 27.1.2021న నిర్ణయించింది. అప్పటి నుండి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 26 నెలల నుంచి నిరవధిక పోరాటం సాగుతున్నది. విశాఖ నగరంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన దీక్షలు ప్రారంభించి ఏప్రిల్ 1వ తేదీకి 700 రోజు లు కావస్తున్నది. ఆ రోజున విశాఖలో భారీ మానవ హారం జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలపాలని రాష్ట్ర కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు పిలుపు నిచ్చాయి. ఈ పోరాట ఫలితంగానే నేటికీ ఒక్క శాతం కూడా విశాఖ స్టీల్‌ప్లాంట్ వాటాలు అమ్ముకుండా అడ్డుకోగ లిగింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం పూర్తియ్యే నాటికి సరళీకరణ విధానాలు దేశంలో ప్రారంభమైనాయి. అప్పటి నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పెట్టుబడులు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వాలు నిరాకరించాయి. కేవలం రూ.5 వేల కోట్లు పెట్టుబడులతో కేంద్ర ప్రభుత్వం నిధులు అపేసింది. కానీ విశాఖ స్టీల్ తమ సొంత లాభాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను ఒక మిలియన్ టన్నుల నుంచి 7.2 మిలియన్ టన్నుల సామర్థ్యానికి విస్తరించింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ సుమారుగా రూ.50 వేల కోట్ల పన్నులు, డివిడెండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించింది. 2000 సంవత్సరంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌కు అమ్మాలన్న నాటి వాజ్‌పేయి ప్రభుత్వ ప్రయత్నాలను స్టీల్ కార్మికులు పోరాటాలతో వమ్ము చేశారు.

భారతదేశంలో స్వాతంత్ర్యం అనంతరం సోషలిస్ట్ దేశాల సహాయంతో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల స్థాపనతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాం. భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి ప్రభుత్వ రంగ పరిశ్రమలు ముందు పీఠిన నిలబడ్డాయి. దేశంలో అత్యంత వెనుకబడిన ప్రాంతాలు పారిశ్రామిక ప్రాంతాలుగా ఎదిగి నేడు అభివృద్ధి ప్రాంతాలుగా మారాయి. ఉపాధి భారీగా పెరిగింది. ఎస్‌టి, ఎస్‌సి, బిసి లకు ఉపాధి లభించింది. అభివృద్ధి చెందిన ప్రభుత్వ రంగాన్ని అమాంతంగా మింగేయడానికి పాలకవర్గం 1991 నుంచి సరళీకరణ విధానాలను ప్రవేశపెట్టింది. గతంలో కాంగ్రెస్, నేడు బిజెపి పోటీ పడి మరీ ఈ విధానాలను అమలు చేస్తున్నాయి. దేశ సంపదైన భూములు, గనులు, భారీ పరిశ్రమలు, సముద్ర తీరాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. "పరిశ్రమలను నడపం. భారీ పరిశ్రమలన్నింటిని అమ్మేస్తాం లేదా మూసివేస్తాం" అనే తప్పుడు విధానాన్ని బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లోనే ప్రకటించింది. ఈ విధానాలను అమలు చేయడానికి నిస్సిగ్గుగా ప్రయత్నిస్తున్నది. భారీ పరిశ్రమలను స్వదేశీ, విదేశీ కంపెనీలకు కారుచౌకగా అమ్మడం దేశద్రోహం. రాష్ట్రంలోకెల్లా భారీ పరిశ్రమలకు మణిహారమైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దక్షిణ కొరియా పోస్కోకు, అదానీకి అమ్మేపనిలో బిజెపి కేంద్ర ప్రభుత్వం నేడు తలమునకలుగా వున్నది.

దేశంలో అన్ని ప్రైవేట్, ప్రభుత్వ రంగ స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులున్నాయి. కానీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎన్ని పోరాటాలు చేసినా సొంత గనులను కేంద్ర ప్రభుత్వాలు ఇవ్వడానికి నిరాకరించాయి. సొంత గనులున్న స్టీల్ ఆథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో కలపడానికి కేంద్ర ప్రభుత్వం మోకాలు అడ్డుతున్నది. పార్లమెంట్‌లో నిరాకరిస్తూ సమాధానం చెప్పింది. దీనివలన సొంత గనులున్న స్టీల్‌ప్లాంట్‌కు ఒక్క టన్ను ఇనుప ఖనిజం రూ. 700 అయితే...విశాఖ స్టీల్‌ప్లాంట్ మార్కెట్‌లో టన్ను రూ. 5 వేల నుంచి రూ. 7 వేలకు కొనవలసి వస్తున్నది. దేశంలో ఏ స్టీల్‌ప్లాంట్‌కు పక్కనే సముద్రం లేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పోర్టు నిర్మించడానికి తీసుకున్న భూములతో సహా ఉచితంగా గంగవరం పోర్టును ప్రైవేట్ వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అప్పగించాయి. పక్కనే సముద్రం వున్నా ఆ ఆదాయాలు అదానీకి సొంతమయ్యాయి. నేడు సాలీనా 7.2 మిలియన్ల సామర్థ్యం వున్నప్పటికీ 4.5 మిలియన్ల టన్నుల సామర్థ్యంతోనే విశాఖ స్టీల్ నడుస్తోంది. కేంద్ర బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ లోని కీలకమైన విభాగాల్లో ఉత్పత్తిని భారీగా తగ్గించి నష్టాల్లోకి నెట్టింది.

దేశవ్యాప్తంగా కిసాన్ మోర్చా, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాలు మనకు ఆదర్శం. విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలి. విశాఖ స్టీల్‌కు సొంత గనులు కేటాయించాలి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలి. ఈ డిమాండ్లను సాధించేవరకు విశాఖ స్టీల్ ప్లాంట్ పోరాటం నిరంతరంగా కొనసాగుతుంది.

- సిహెచ్. నరసింగరావు,
విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్

జాతీయోద్యమంలో భాగమే రైతాంగ ఉద్యమాలు

బాల్యంలో పాఠ్యపుస్తకాలలో రైతు దేశానికి వెన్నెముక, జై జవాన్, జై కిసాన్ అని చదువుతుంటే నా వెన్నుపూస నిటారుగా నిలబడేది, రైతు కొడుకుని అయినందుకు. పుస్తకం మూసేసినాక, వంటపంచకు చేరినా, పంట పొలానికి వెళ్లినా నా తల్లిదండ్రులూ, ఇంటిలోని పెద్దాచిన్నా పిల్లల ఆకలి కడుపులూ, విరుచుకునే ఎముకలూ, కార్చే చెమటలూ కన్పించేవి. ఉన్నత పాఠశాలలో చదువుకున్నపుడు మధ్యాహ్నం భోజనాల కేరేజీలు విప్పినపుడు ఉద్యోగుల పిల్లల కేరేజీల్లోలా కూరలు యెపుడో తప్పా మా రైతు పిల్లల కేరేజీల్లో ఎల్లప్పుడూ పిండొడియమో, ఉల్లిపాయో వుండేవి.

బాల్యంలో నా వెన్నుపూస నిటారుగా నిలబడడానికి కారణమైన నా తండ్రి... చిరిగిన బనీనూ, గావంచాతో, ఎండిన పేగులతో, దిగులు నిండిన కళ్లతో సావుకారి ఇంటి ముందరా, కరణం, నాయుళ్ల కాళ్లకాడ కనబడినపుడూ కారణమేటో తెలిసేది కాదు. వరి, చెరకు, పెసర, మినప, వేరుశనగ, నువ్వులు, కందులు, టమాటా, బీరకాయ, ఆనబకాయ, వంకాయ, మిరపకాయ సమస్త పంటలూ నా తండ్రి కళ్లం నుంచి సావుకారి గోదాముకీ, అక్కడి నుండి యెక్కడెక్కడికో వెళ్లిపోయి మా కంటికి కనిపించేవి కావు, అప్పుడూ ఎరికయ్యేది కాదు. పంటల్ని సరుకుల్ని చేసినోళికి తప్పా నాకే గాదు, నాలాటి నీకూ, అతగానికీ, అందరికీ ఆ మాయ యేటో తెలిసేది కాదు. మనందరికీ కాదు అతగానికి తెలాల! పండించినోడికి తెలాల. పంటలు పోగొట్టుకున్నోడికి తెలాల. తెలస్తాదా... యేనాటికేనా? తెలిసినందునా..? నేడు ఢిల్లీ చుట్టూరా రైతు దండు జమ అయినాది! అటువంటి దండు ఇప్పుడే కాదు అలనాడు రాజులూ, చక్రవర్తులూ, జమీందారులూ, ఇనాందారులూ, మొఖాసాదారుల నుంచీ తెల్లోళ్ల దాకా సాగిన పాలనల మీద ఇలాగే జమయినాది.

తెల్లదొరలు తెలివయినోళ్లు. జాగీర్దారీ, భూస్వామ్య విధానాన్నీ, రైత్వారీ విధానాన్నీ కలిపి రెండు వ్యవసాయ చట్టాలు తెచ్చి రైతుదండు కళ్లు గప్పినారు. అందుకనే మార్క్స్–బ్రిటిష్ అధికారులు ప్రవేశపెట్టిన వ్యవసాయ చట్టాలు ఒకదానికొకటి విరుద్ధమైనవి. ఒకటి బ్రిటిష్ భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థకు సంబంధిస్తే, మరొకటి ఫ్రెంచి రైతుస్వామ్య వ్యవస్థకు సంబంధించిన నమూనాలు – అన్నాడు. రెండూ రైతులకు గానీ, భూయజమానులకు గానీ ప్రయోజనకరమైనవి కావు. భూములపై పన్నులు వేసే బ్రిటిష్ ప్రభుత్వానికి ప్రయోజనకరమైనవని కొద్దికాలంలోనే నిరూపణయినాయి. ఇలాంటి రైతు వ్యతిరేక చట్టాలను ఒకవేపు తెచ్చి మరోవేపు భారతీయ సాంప్రదాయ పంటల స్థానంలో ఆంగ్లేయుల పరిశ్రమలకు అవసరమైన పంటలు పండించాలని తీవ్రంగా ఒత్తిడి చేసారు. దేశంలోకి నీలిమందు, పొగాకు పంటలను ప్రవేశపెట్టేరు. కాంట్రాక్టు వ్యవసాయ పద్ధతులను అవలంభించేరు. ఆ పంటలను పండించడానికి అవసరమైన పెట్టుబడులను అప్పుల కింద ఇచ్చేవారు.

అప్పుల వడ్డీలు, ధరల యెగుడుదిగుడులతో రైతులు అప్పులపాలవగా భూములు గుంజుకునేవారు. పందొమ్మిదో శతాబ్దిలో జరిగిన అనేక రైతాంగ పోరాటాల నేపథ్యమిదే! ఈ దుర్మార్గపు చర్యలకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ తిరుగుబాటులివి! 1855లో సంతాల్ రైతుల తిరుగుబాటు, 1860లో నీలిమందు తోటల (ఆంగ్లేయ) యజమానుల నిర్బంధ సాగు విధానాలకు వ్యతిరేకంగా బెంగాల్, బీహార్ రైతుల తిరుగుబాట్లు, 1875లో మహారాష్ట్ర మలబార్ ప్రాంత మాప్లా రైతాంగ తిరుగుబాటు, తూర్పుగోదావరి (రంప) ఏజన్సీ గిరిజన రైతాంగ తిరుగుబాటు. 1920–22లో ఉత్తరప్రదేశ్ లోని రాయబరేలి, ఫయిజాబాద్, సితాపూర్ జిల్లాల జమీందారీ వ్యతిరేక పోరాటాలు, ఆంధ్ర ప్రాంత పెదనందిపాడు శిస్తు

నిరాకరణోద్యమం, పలనాడు అటవీ రైతుల సత్యాగ్రహం, వర్లీ ఆదివాసీ రైతుల తిరుగుబాటు, వాయలార్ రైతుల పోరాటం గాక తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం దాకా ఉద్యమాలు, పోరాటాలు, ఆందోళనలు ఉధృతంగా సాగినాయి...! ఇవన్నీ భారత జాతీయోద్యమంలో అంతర్భాగమే.

1936 ఏప్రిల్ 11న జరిగిన మొదటి మహాసభలో యేర్పడిన అఖిల భారత కిసాన్ సభ (రైతుసంఘం)... దాని ఆధ్వర్యంలో సాగిన పోరాటాల నుంచీ విశ్లేషించుకోవాలి. చరిత్రాత్మకమైన రైతు రక్షణ యాత్ర (ఇచ్ఛాపురం నుండి మద్రాసు దాకా 130 రోజులు 525 గ్రామాల సందర్శన, 1100 అర్జీల సేకరణతో రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి పెట్టిన డిమాండు పత్రం), జమీందారీ వ్యతిరేక పోరాటాలు సాగాయి. ఆ పోరాటాల ఫలితాలేమిటి? వాటి దిశాదశల్లో మార్పులేమిటో చర్చించుకోవాలి. రైతుసంఘాన్ని చీల్చిన కాంగ్రెస్ రాజకీయాలు, రైతాంగ పోరాట నాయకులను మళ్లించటాలు (మందసా జమీందారీ వ్యతిరేక పోరాట నాయకుల్లో ఒకరు గౌతు లచ్చన్న పాలకవర్గ నాయకుడైనాడు. స్వాతంత్ర్యానంతర పాలనలో భాగమైనాడు), స్వాతంత్ర్య పోరాట కాలాన పోరాటాలకు అలీనంగానో, వ్యతిరేకంగానో వున్నవాళ్లు స్వాతంత్ర్యానంతర పాలనలో లీనం గావటాలు యెందుకు జరిగాయి? రైతాంగ ఉద్యమకారులను కాల్చిచంపిన సంస్థానాధిపతులు స్వతంత్ర దేశంలో పాలకులెలా అవగలిగినారు? అవగలుగుతున్నారు?

కళింగాంధ్రా బొబ్బిలి, విజయనగరం, మందసా, పర్లాకిమిడి, కురుపాం, చీకటి, చెముడు, మేరంగి మొదలైనవి జమీందారీల పాలనలో నలిగిపోయేవి. జమీందారీ వ్యతిరేక పోరాటాలూ కళింగాన బలంగా సాగేయి. 1922లో నిరంకుశ బొబ్బిలి సంస్థానానికి వ్యతిరేకంగా ఆడవరం, లక్ష్మీపురం గ్రామాల రైతులు సింహాద్రి సూర్యనారాయణ నాయకత్వంలో తిరగబడి పెరిగిన శిస్తులను, పన్నులను కట్టలేము అని నిరాకరిస్తే కాల్పులు జరిపేడు సంస్థానాధిపతి. 22 మంది రైతులను అరెస్టు చేసారు. జైలులో ఒక రైతు చనిపోయేడు. కళింగాన మొట్టమొదటి జమిందారీ వ్యతిరేక రైతాంగ పోరాటమిది. మరోవైపు ఆదివాసీ ప్రాంతాన అల్లూరి సీతారామరాజు మన్యం తిరుగుబాటు జరిగింది. మన్య ప్రాంత సమస్యల మీద కూడా రైతుసంఘాలు ఉద్యమాలు నడిపేయి.

1936–37లో జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో జమీందార్లు బలపరచిన అన్నెపు పరశురాం పాత్రో (మాజీ మంత్రి)ని ఓడించి, రైతు నాయకుడు పుల్లెల శ్యామసుందరరావును గెలిపించగలిగింది రైతాంగ ఉద్యమం! ఆ తర్వాత సాగాల్సిన దిశలో రైతాంగ ఉద్యమం సాగలేదు. పుల్లెల శ్యామసుందరరావు అకాల మరణం, గౌతు లచ్చన్న పార్లమెంటరీ రాజకీయాల్లో రైతాంగ లక్ష్యాలను ఎజెండాగా చేయలేకపోవడం, కమ్యూనిస్టుల ప్రభావం లోకి కొందరు వెళ్లాక వర్గపోరాటం లక్ష్యం కావడం, తర్వాత కమ్యూనిస్టు పార్టీల్లో విభేదాలు, చీలికలు...కళింగ ప్రాంత రైతాంగ ఉద్యమ ప్రయాణమవగా దేశవ్యాప్త రైతు సంఘంలో చీలికల్తో, పీలికల్తో బలహీనమయ్యింది. స్వాతంత్ర్యా నంతర కాలంలో కూలిరేట్ల పోరాటాలు, బంజరుభూమి కోసం పోరాటాలు, పంటలకు గిట్టుబాటు ధరల కోసం పోరాటాలు వంటివి తప్పా వ్యవసాయ విధానంలో జరగాల్సిన మౌలిక మార్పుల గురించిన పోరాటాలు దేశవ్యాప్తంగా అంతగా జరగలేదు.

జమీందారీ రద్దు నుంచి బూటకపు భూసంస్కరణల దాకా తెల్లోళ్లను మించిన దగాకోరు రాజకీయ విధానాలు ... పెట్టుబడిదార్ల కడుపులు నింపే బొంబాయి ప్లాను నుండి పంచవర్ష ప్రణాళికల దాకా, పూర్తి కాని సాగునీటి పారుదల ప్రాజెక్టులు, గిట్టుబాటు కాని పంటల ధరలు, పెరిగిన ఉత్పత్తి ఖర్చుల దాకా ఎన్నెన్నో రైతు దు:ఖానికి కారణాలు.

ఔను, నేనిలా రాస్తే... భూములున్న రైతుల గురించి రాస్తున్నాననీ, భూమి లేని రైతుల గురించిగానీ, రైతుకూలీల గురించి గానీ, రైతు చుట్టూ బతికే మేదరి, కుమ్మరి, వడ్రంగి, చాకలి, మంగలి సమస్త కులవృత్తి జీవుల గురించి రాయటం లేదని మీరనొచ్చు. చిక్కల్లా అక్కడే వున్నది. రైతుకి న్యాయం జరిగితే గానీ రైతు చుట్టూ బతికే వృత్తిజీవులకు న్యాయం జరగదు. ఇది సమష్టి సమస్య (రైతు యేటేటా వ్యవసాయ ఆదాయంతో తనచుట్టూ వున్న వృత్తిజీవులకు తగిన రీతిలో వేతనాలు చెల్లించలేనందున, వృత్తిజీవులను యేడాదంతా తనతో నిలుపుకోలేనందున కుమ్మరి, చాకలి, మంగలి, మేదరి, కమ్మరి వంటి వృత్తి జీవులు నగరాలకు వలస పోయినారు, రైతుని, గ్రామాన్నీ విడిచిపెట్టేసారు. నగరాల్లో వీరి బతుకులు యెలా వున్నాయి, గ్రామాలలో వున్నపుడు కంటే బాగున్నాయా? బాగుంటాయా? ఈ ప్రశ్నలకు జవాబులు తెలుసుకోవడం వేరే చర్చ.).

అలాగే భూములున్న రైతు, భూమి లేని కూలీ... ఈ సమస్య కూడా పరిష్కారం కావాల్సివుంది. తొలినాటి కిసాన్ సభ అంచేతనే భూ సంస్కరణలను డిమాండు చేసింది. కమ్యూనిస్టులు కూడా ప్రధానంగా భూ సమస్యను దున్నేవానికే భూమి అన్న విధానంతో పరిష్కరించాలంటున్నారు (దున్నేవానికి భూమి ఇవ్వడమనేది స్వంత ఆస్తి ఇవ్వడం కదా? కమ్యూనిజం స్వంత ఆస్తిని అంగీకరించదు కదా, మార్క్స్ కూడా ఇలా చెప్పలేదు, భారతీయ కమ్యూనిస్టులు తప్పుడు సూత్రీకరణలతో పోరాటాలు నడుపుతున్నారని కొందరు వాదనలు చేస్తున్నారు. దున్నేవానికి భూమి నినాదంతో రైతులను కదలించి కార్మికవర్గ నాయకత్వంలో విప్లవాన్ని జయప్రదం చేసే ప్రయత్నంలో భాగంగా ఈ పోరాటాలని కమ్యూనిస్టులంటున్నారు). భూమీ, దానిమీద బతికే వ్యవసాయ వృత్తిజీవుల చుట్టూ అనే కాంశాలు ఇలా ఇంకా చర్చల్లోనే వున్నాయి. పరిష్కారాల వెదుకులాటలోనే వుండడం విషాదం!

వ్యవసాయ రంగ అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం, పూర్తికాని సాగునీటి ప్రాజెక్టులతో పంటలు పోవటం, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు దొరకక పోవటం, పంటకు పెట్టే మదుపులు (విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, కూలీల వేతనాలూ) పెరిగిపోవటంతో రైతులు అధికశాతం దివాళా తీసేరు. ఇదే సందర్భంలో పెట్టుబడిదారులు బడా, బడా పెట్టుబడిదారులైనారు, కొసకు కార్పొరేట్ సెక్టారుగా ఎదిగినారు.

వ్యవసాయ రంగాన్ని మూడు విభాగాలుగా తీసుకోవచ్చు. ఉత్పత్తి సాధనమైన భూమి, ఆ భూమి మీద శ్రమ చేసే మనుషులూ వొక విభాగం, పంటలకవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు... ఇన్‌పుట్స్ ఒక విభాగం, పంటలు అమ్ముకొనే మార్కెట్ మరొక విభాగం! రైతు చేతిలో గానీ రైతు ఆధీనంలో గానీ భూమీ, దాని మీద శ్రమ చేసే మనుషులు తప్పా మిగిలిన రెండు విభాగాలూ లేవు. మార్కెట్ శక్తుల చేతిలో వున్నాయి. ఆ శక్తుల క్రీడలో రైతులు దివాళా తీసేరు. ఇన్నేళ్లుగా రకరకాలుగా యెదిగిన మార్కెట్ శక్తుల కన్ను ఇపుడు రైతు చేతిలోని భూమి మీద పడింది. విశాల భూఖండాలను కొనగలిగే, లీజుకు పొందగలిగే ఆర్థిక సంపన్నులయిన మార్కెట్ శక్తులిపుడు వ్యవసాయ రంగాన్ని సంపూర్ణంగా ఆక్రమించదలచేయి. ఇంతకు ముందర పాలనలోనున్న రాజకీయ శక్తుల చేత తమ ఆక్రమణను చట్టబద్దం చేయలేకపోయిన మార్కెట్ శక్తులకు బిజెపి ఇపుడు నమ్మినబంటుగా రాజకీయ రంగమ్మీదకు వచ్చింది. ఆ ఫలితమే మూడు వ్యవసాయ చట్టాలు. ఆ చట్టాలే అమ లయితే భవిష్యత్తులో రైతు చేతిలో భూమి మిగలదు.

వ్యవసాయ రంగమిక కార్పొరేట్ల చేతిలోకి వెళ్లాక రైతాంగమే కాక ఆహార దినుసులు కొనుగోలు చేసే వినియోగదారుడు కూడా నష్టపోతాడు. కార్పొరేట్లు తమకు లాభాలనిచ్చే పంటలే పండిస్తారు. అధిక ధరలు లభించే చోటనే అమ్ముతారు...ఈ దేశంలో అమ్ముతారనే గ్యారంటీ కూడా వుండదు. అధిక ధరలు, ఆహార పంటల కొరతలను కూడా భవిష్యత్తులో దేశం ఎదుర్కోవలసి వస్తుంది. గనక కేవలం నేడు రైతాంగ సమస్యగా మాత్రమే గాక సకల ప్రజల సమస్యగా అర్థం చేసుకొని ఆందోళనలు చేయాల్సి వుంది. పోరాడాల్సి వుంది.

రైతాంగం కూడా కేవలం ఆర్థిక సమస్యల పరిష్కారం కోసమే గాక తమ సమస్యకు శాశ్వతమయిన శాస్త్రీయ పరిష్కారాన్ని సాధించే దిశగా రాజకీయ రంగంలో కూడా రైతాంగం తమ భాగస్వామ్యాన్ని సాధించే (అసెంబ్లీ, పార్లమెంటులలో తమ డిమాండ్లను, తమ సమస్యలను తొలి నాటి రైతుసంఘ మహాసభల నుంచీ ప్రకటించుకు వస్తోన్న తమ లక్ష్యాలను రాజకీయ అజెండాను చేసే) దిశగానూ గత ఉద్యమ చరిత్ర లోంచి పాఠాలు తీసుకొని ఉద్యమాలు సాగించాలి! దేశం సంపన్నం కావడమంటే అశేష ప్రజలు సంపన్నులు కావడం. అంతే తప్ప అల్ప సంఖ్య కార్పొరేట్లు సంపన్నులు కావటం కాదు! దేశ సంపన్నత కోసం, సౌభాగ్యం కోసం రైతాంగం పోరాటాల సాలు పోయాలి!

- అట్టాడ అప్పల్నాయుడు,
అధ్యక్షులు,
ఉత్తరాంధ్ర రచయితలు, కళాకారుల వేదిక

మెనూ ఛార్జీలు పెంచాలి

రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయడం లేదు. జగనన్న గోరుముద్దకు మెనూ ఛార్జీలు పెంచకపోవడంతో అదనపు భారం పడుతోంది. మధ్యాహ్న భోజన కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. వంట వంట ఏజెన్సీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీల పెంపుదల చేయాలి. నెలవారి సక్రంగా బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లింపులో తీవ్రమైన జాప్యం చేయడంతో అప్పుల పాలైపోతున్నారు. రోజుకి ఆరేడు గంటల పనిచేస్తున్న కార్మికులకు గౌరవ వేతనం పేరుతో శ్రమ దోపిడీ చేస్తున్నారు. జగనన్న గోరుముద్ద పెరిగిన ధరలకు అనుగుణంగా పిల్లవాడికి ఒక్కింటికి రూ.20 రీఛార్జ్ పెంచాలి. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని పోరాటాలు చేస్తున్నాం. కార్మికులకు సామాజిక భద్రత పెన్షన్లు, పనిలో అగ్నిప్రమాదాలకు గురయ్యే బాధితులకు బీమా సౌకర్యం ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. 18 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారికి పనిభద్రత లేదు.

- బి.ఉత్తర,
ఎండిఎం కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి

కార్మిక హక్కులు కాలరాత

బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికుల ప్రాథమిక హక్కులను హరించేందుకు పూనుకున్న కేంద్రంలో బిజెపి, దానికి వత్తాసు పలుకుతున్న వైసిపి ప్రభుత్వం కార్మిక ద్రోహులుగా మిగిలిపోతారు. ఇందిరాగాంధీ బ్యాంకులు జాతీయం చేస్తే... ప్రధాని మోడీ ప్రభుత్వం ప్రయివేటీకరణ చేస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటీకరణ చేసి చేసి రిజర్వేషన్లు అమలు కాకుండా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుంది. అదాని, అంబానీలకు దేశ సంపదను కారు చౌకగా అమ్మి కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్నారు. పెన్షన్ పొందడం ఉద్యోగి ప్రాథమిక హక్కు అని సుప్రీం కోర్టు 1982లో తీర్పు ఇచ్చింది. సమాన పనికి సమాన వేతనం అందించాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా పాలకులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది. కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య ఉద్యమలే శరణ్యం.

- అనపాన షణ్ముఖరావు,
ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి

కార్మిక హక్కుల పరిరక్షణే లక్ష్యం

కార్మిక, ఉద్యోగుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా భవిష్యత్ పోరాటా లు కొనసాగిస్తాం. జిల్లాలో జ్యూట్, ఫెర్రో ఎల్లాయీస్ వంటి పరిశ్రమలు మూతపడి కార్మికులు రోడ్డున పడినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. జిల్లాలో మూతపడిన జ్యూట్ పరిశ్రమలను తెరిపించేందుకు వాటికి అవసరమైన రాయితీలను కల్పించడం లేదు. ఆమదాలవలస సహకార చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదు. దీనివల్ల వేలాదిమంది కార్మికులకు ఉపాధి లేకుండాపోతోంది. ప్రభుత్వ శాఖల్లో సేవలందిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ చేయకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారు.

- ఎన్.నీలంరాజు,
ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి

మేడే శుభాకాంక్షలు
ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులకు, కర్షకులకు, అధికారులకు, నాయకులకు, మేడే శుభాకాంక్షలు
జ్యోతి నాయక్
22వ వార్డు కౌన్సిలర్
పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ
కృష్ణ నాయక్
మాజీ కార్యదర్శి,
గుప్తేశ్వర తాపీమేస్త్రీల సంఘం, పలాస-కాశీబుగ్గ

మేడే శుభాకాంక్షలు ...
కార్మికులు తమ హక్కుల కోసం రక్తం చిందించి, పోరాడి సాధించిన రోజు ఈ మేడే రోజు కార్మికులందరికీ ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మేడే శుభాకాంక్షలు
కె. గిరీశ్వరరావు
విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్, ప్రెసిడెంట్, పలాస డివిజన్.
గార రాజారావు
విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్, సెక్రటరీ, పలాస డివిజన్.

మేడే శుభాకాంక్షలు
ప్రపంచ కార్మిక పర్వదినం మేడే కార్మిక వర్గ పోరాటాలు, కార్మిక వర్గ చైతన్యంతో నవ సమాజనిర్మాణానికి ఈ మేడే స్ఫూర్తి కావాలని కోరుకుంటూ... కార్మికులకు, కార్యకర్తలకు మిత్రులకు, శ్రేయోభిలాషులకు మేడే శుభాకాంక్షలు.
డా॥ నగిరి మోహన్‌రావు, టీచర్,
M.A., (Telugu), B.Ed., M.A(journalism)
M.A. Social Work., B.L (CL)
జై భీమ్ వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీకాకుళం యూనిట్, ఫోన్: 9951879999

మేడే శుభాకాంక్షలు
రిమ్స్ - జి.జి.హెచ్ కార్మికులకు ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేసే కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సు ఉద్యోగులకు కార్మికులకు, ప్రజలకు, మిత్రులకు, మేడే శుభాకాంక్షలు
రిమ్స్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్
రిమ్స్, శ్రీకాకుళం (సి.ఐ.టి.యు అనుబంధం)
శానిటేషన్ వర్కర్స్ కమిటీ :
కె. క్రిష్ణవేణి అధ్యక్షురాలు
బి. సంతోషి ప్రధాన కార్యదర్శి
ఎ. రవికుమార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ
బి. లక్ష్మి ఉపాధ్యక్షురాలు
మరియు రిమ్స్ శానిటేషన్ సిబ్బంది
సెక్యూరిటీ గార్డ్స్ కమిటీ :
మామిడి సూర్యనారాయణ అధ్యక్షులు
బగాది శ్రీను ఉపాధ్యక్షులు
పప్పల సతీష్ ప్రధాన కార్యదర్శి
జె. వెంకటరమణ కార్యదర్శి
సతివాడ రాజేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ
మరియు రిమ్స్ సెక్యూరిటీ గార్డ్స్ సిబ్బంది
రాకోటి చిన్నారావు, నక్క శ్రీనివాసరావు,
రావిపల్లి శశికళ మరియు APCOS ఔట్ సోర్స్ ఉద్యోగులు
బండారు మురళి రిమ్స్ శానిటేషన్ సెక్యూరిటీ మరియు APCOS గౌరవ అధ్యక్షులు
ఆర్. సురేష్‌బాబు AP కాంట్రాక్ట్ & అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షులు

అంపశయ్యపై బిఎస్ఎన్ఎల్...

బాధ్యులెవరు?

ప్రభుత్వ రంగ సంస్థలు పుట్టిందే చావడానికి అని సాక్షాత్ దేశ ప్రధానే సెలవివ్వడం మనం పత్రికల్లో చూశాం. దీని అర్థం ఏమిటి. 2000లో ఏడాదికి రూ.7,200 కోట్లు ఆదాయాన్ని సంపాదించిపెట్టే కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన టెలికాం రంగాన్ని అప్పటి ప్రధాని వాజ్‌పాయ్ అమెరికా ఒత్తిడికి తలొగ్గి డాట్‌ని బిఎస్ఎన్ఎల్ కార్పొరేషన్‌గా మార్చివేశారు. ఈ చర్యకు వ్యతిరేకంగా టెలికాం రంగంలో ఉన్న ఉద్యోగ సంఘాలు దేశవ్యాప్త సమ్మెకు పూనుకున్నాయి. ఉద్యోగవర్గాలను చల్లబర్చడానికి కొన్ని నిర్థిష్ట హామీలతో బిఎస్ఎన్ఎల్ సంస్థ ఉద్యోగులకు ఊరట కల్పించే ప్రయత్నం చేశారు. బిఎస్ఎన్ఎల్ కార్పొరేషన్‌కు ఆర్థిక పరిపుష్టిత కల్పిస్తామని, ఉద్యోగులకు ఉద్యోగభద్రత, పెన్షనర్లకు పెన్షన్ భద్రత కల్పిస్తామని, గ్రామీణ ప్రాంత ల్యాండ్ లైన్ నిర్వహణ నష్టాలు ప్రభుత్వమే భరిస్తుందని, ప్రయివేట్ కంపెనీలతో సమానంగా పోటీపడడానికి బిఎస్ఎన్ఎల్ సంస్థకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తామని, బిఎస్ఎన్ఎల్ అభివృద్ధికి కావాల్సిన నిధులు బడ్జెట్ ద్వారా కేటాయించి ఆదుకుంటామని వాగ్ధానాలు చేశారు. కాని పెళ్లినాట వాగ్ధానాలు చావునాడు ఉండవని బిఎస్ఎన్ఎల్ విషయంలో రుజువైంది. 2010 వరకు ఏడాదికి 10,000 కోట్లు లాభాలను అర్జించిన బిఎస్ఎన్ఎల్ సంస్థను నేడు అంపశయ్యపై పడుకేనే పరిస్థితికి పాలకవర్గాలే ఏ విధంగా తీసుకొచ్చాయో ప్రజానీకం గమనిస్తున్నారు. 2జి స్పెక్ట్రమ్ బిఎస్ఎన్ఎల్ సంస్థకు ఉచితంగా ఇస్తామని చెప్పి తీరా ప్రయివేట్ మొబైల్ కంపెనీల ఒత్తిడికి తలొగ్గి బిఎస్ఎన్ఎల్ రిజర్వ్ ఫండ్ నుంచి ప్రభుత్వం బలవంతంగా రూ.20వేల కోట్లు గుంజుకుంది. గ్రామీణ సేవల బిఎస్ఎన్ఎల్ నష్టాలు పూడ్చడానికి ఇచ్చే యుఎస్ఒ (యూనివర్సల్ సోషియాకు ఆబ్లిగేషన్ ఫండ్ ఏడాదికి ఇచ్చే రూ.2వేల కోట్ల నిధులు నిలుపుదల చేసింది. ప్రయివేట్ కంపెనీలకు 4జి, 5జి సేవలకు అవకాశాలు కల్పించి బిఎస్ఎన్ఎల్‌కు మాత్రం 4జి సేవలు నేటికీ పూర్తిస్థాయిలో అందించకుండా ప్రభుత్వమే మోకాలడ్డుతుంది. దీని కారణంగా నేడు బిఎస్ఎన్ సంస్థ పూర్తిగా దివాళా అంచున కూరుకుపోయింది. బిఎస్ఎన్ఎల్ పోటీలో ఉంటేనే పేద, మధ్య తరగతి ప్రజలకు మొబైల్ సేవలు చౌకగా అందుతాయి. ప్రభుత్వరంగ సంస్థ అయిన బిఎస్ఎన్ఎల్‌ను రక్షించుకోవడం మన అందరి బాధ్యత.

– ఎం.గోవర్థనరావు,
బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు

మేడే శుభాకాంక్షలు
ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులకు, కర్షకులకు, అధికారులకు, నాయకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మేడే శుభాకాంక్షలు
శ్రీ సూర్య ఎంటర్‌ప్రైజెస్
సూర్యమహల్ ఎదురుగా, జి.టి. రోడ్, శ్రీకాకుళం
ప్రొ॥ గోపి, ఫోన్: 98480 74088
We Also deal with
VIZAG TMT, SIMHADRI TMT
Dealers in
A TO Z BUILDING MATERIALS

మేడే శుభాకాంక్షలు
ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులకు, కర్షకులకు, అధికారులకు, నాయకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మేడే శుభాకాంక్షలు
పొందర చిరంజీవులు
ప్రధాన కార్యదర్శి
భవన నిర్మాణ కార్మిక సంఘం
బారువ, సోంపేట మండలం.

మేడే శుభాకాంక్షలు
HAPPY MAY DAY
ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులకు, కర్షకులకు, శ్రామిక వర్గ ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మేడే శుభాకాంక్షలు తెలుపుతూ...
BSNL EU జిల్లా కమిటీ
శ్రీకాకుళం జిల్లా.

మేడే శుభాకాంక్షలు
ప్రపంచ కార్మిక పర్వదినం మేడు కార్మిక వర్గ పోరాటాలు, కార్మిక వర్గ చైతన్యంతో నవ సమాజనిర్మాణానికి ఈ మేడే స్ఫూర్తి కావాలని కోరుకుంటూ... కార్మికులకు, కార్యకర్తలకు మిత్రులకు, శ్రేయోభిలాషులకు మేడే శుభాకాంక్షలు.
శ్రీకాకుళం జిల్లా కళాసీ కార్మిక సంఘం
(సిఐటియు అనుబంధం) రి.నెం.డి/207/2008
6-21, ఇందిరానగర్ కాలనీ, పి.యస్.యన్.యమ్. హైస్కూల్ ఎదురుగా, శ్రీకాకుళం, శ్రీకాకుళం జిల్లా. ఫోన్ 221779
అధ్యక్షులు బి. చిన్నరావు
కార్యదర్శి కె. సూర్యయ్య
కోశాధికారి కె. లక్ష్మీనారాయణ

మేడే శుభాకాంక్షలు
కార్మికులకు, కర్షకులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలకు, అధికారులకు అందరికి మేడే శుభాకాంక్షలు
నాగార్జున అగ్రికెమ్ స్టాఫ్ & వర్కర్స్ యూనియన్
రి.నెం.డి/2082/09) సి.ఐ.టి.యు.అనుబంధం
అరిణాం అక్కివలస, అల్లినగరం పోస్టు, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం జిల్లా. సెల్: 9959949044, 9441468066

రక్తాక్షరాలతో లిఖించిన దీక్షా దినం

మానవ జాతి చరిత్రలో 18వ శతాబ్దం అంతకు పూర్వం కంటే అత్యంత అభివృద్ధి చెందిన శతాబ్దంగా గణతి కెక్కింది. ఆ శతాబ్దంలోనే ఇంగ్లండ్ మరికొన్ని యూరోపియన్ దేశాల్లో ఉత్పత్తి రంగంలో ఆవిరి యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా పారిశ్రామికీకరణ ప్రారంభమైంది. 1776 మార్చిలో వాట్ సన్ ఆవిరి యంత్రాన్ని కనిపెట్టాడు. దాన్ని ఇంగ్లండ్‌లోని ఓ బొగ్గు గనిలో మొదటిసారిగా ఉపయోగించారు. ఈ క్రమం అమెరికాకు కూడా పాకింది. బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం వల్ల 1820 సంవత్సరంలో ఉన్న చేనేత కార్మికుల సంఖ్య 2,40,000 నుంచి 1844 సంవత్సరానికి 60 వేలకు తగ్గింది (1860నాటికి ఇది 8వేలకు తగ్గిపోయింది). అదేకాలంలో మరమగ్గాల ఆపరేటర్లు 10 వేల నుంచి లక్షన్నరకు పెరిగారు. యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ 19వ శతాబ్దంలో సైన్సు, టెక్నాలజీ బాగా అభివృద్ధి అయ్యాయి. దానితో భారీ పరిశ్రమలు ఏర్పడ్డాయి. వేల సంఖ్యలో కార్మికులు తలెత్తారు. రైల్వేలు, మోటారు కార్లు, టెలిఫోన్, టెలిగ్రాఫ్, విద్యుచ్ఛక్తి కూడా వాడుకలోకి వచ్చాయి. ఆ శతాబ్దంలో జర్మనీ, ఫ్రాన్స్ దేశాల్లో పారిశ్రామిక రంగ అభివృద్ధి విశేషంగా జరిగింది. యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల సంఖ్య ఒక కోటికి పెరిగింది. దానితో ఉత్పత్తి రంగంలో పెట్టుబడిదారీవర్గం, కార్మికవర్గం అనే రెండు ప్రత్యర్థి వర్గాలు తలెత్తాయి. పెట్టుబడిదారులు శ్రామిక ప్రజల శ్రమశక్తిని క్రూరంగా దోచుకుంటున్నారు. దీంతో పెట్టుబడిదారీ, కార్మికవర్గాల మధ్య సంఘర్షణ అనివార్యమైంది.

పారిశ్రామిక విప్లవం ప్రారంభదినాల్లో శ్రామికులు బానిసల మాదిరిగా శ్రమిస్తుండేవారు. పారిశ్రామికవేత్తలు అధిక లాభాలను పిండుకోవడానికి ఆరేడేళ్ల పిల్లలతోనూ, మహిళలతో కూడా ఫ్యాక్టరీల్లో, గనుల్లో పని చేయించారు. బాలకార్మికులు గనుల్లోని చీకటి సొరంగాల్లో.. బొగ్గు బళ్లను మోచేతులపైన, మోకాళ్లపైన పాకుతూ లాగేవారు. ఆఖరికి పొగగొట్టాల పైకెక్కి వాటిని శుభ్రపర్చేవారు. ఇంగ్లండ్‌లోని అనాథ శరణాలయాల్లో పిల్లలను అక్కడి అధికారులు పారిశ్రామికవేత్తలకు పశువుల మాదిరిగా విక్రయించేవారు. బాల కార్మికులు ఉదయం నుంచి రాత్రి వరకూ యంత్రాల వద్ద నిలబడి పనిచేసేవారు. క్షణం సేపు కన్ను మూస్తే ఆ చిన్నారుల వీపులు కొరడా దెబ్బలతో చిట్లిపోయేవి. ఇక శ్రమజీవులతో రోజూ 16 గంటలు పని చేయించేవారు. మరికొందరు పెట్టుబడిదారులు 20 గంటలు కూడా పనిచేయించారు. 1806లో అమెరికాలోని ఫిలడెల్ఫియాలో చెప్పులు కుట్టే కార్మికులు సమ్మె చేసిన సందర్భంగా జరిగిన విచారణలో కార్మికులతో యజమానులు రోజుకు 20 గంటలు పనిచేయించుకుంటున్నట్లు లోకానికి వెల్లడైంది. కార్మికులకు అతి తక్కువ జీతాలిచ్చేవారు. పని భద్రత, సౌకర్యాలుండేవి కావు. ఫ్యాక్టరీల్లో గాలీ వెలుతురు మృగ్యం. యంత్రాల వద్ద రక్షణ లేక కార్మికులు అనేక రకాలుగా ప్రమాదాల బారిన పడి మరణిస్తుండేవారు. కార్మికులు అమానుష శిక్షలకు కూడా గురవుతుండేవారు.

కార్మికులు తాము అనుభవించే పీడనకూ.. దోపిడీకీ కారణం తాము పనిచేసే యంత్రాలేనని భ్రమించారు. తెగించి వాటిని ధ్వంసం చేయడం ప్రారంభించారు. ఈ విధ్వంసకాండ మొదట బ్రిటన్‌లో ప్రారంభమైంది. దీంతో పారిశ్రామికవేత్తలు సాయం కోసం ప్రభుత్వం వద్దకు పరిగెత్తారు. నిక్కచ్చిగా.. దోపిడీకి గురవుతున్న కార్మికుల ప్రాణ రక్షణకు చలించని ప్రభుత్వం.. వెంటనే యజమానులు ఆస్తి రక్షణకు పార్లమెంటును ఉపయోగించింది. యంత్రాలను ధ్వంసం చేసేవారికి మరణశిక్ష విధిస్తూ (1912లో) చట్టం చేసింది. తర్వాత కార్మికులు.. యంత్రాలను ధ్వంసం చేయడంలో అర్థం లేదనీ.. తమ దుస్థితికి కారణం ఫ్యాక్టరీ యజమానులే అని గ్రహించారు. ఆ దుస్థితి నుంచి బయట పడటానికి పోరాటం చేయడమొక్కటే మార్గమని అర్థం చేసుకున్నారు. దానితో పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా శ్రామికవర్గం పోరాటం ప్రారంభించింది. అణగదొక్కబడిన కార్మికవర్గం తమ హక్కుల సాధన కోసం కృత నిశ్చయంతో చైతన్యవంతంగా పోరాటాలు జరపడానికి వీలుగా కార్మిక సంఘాల నిర్మాణానికి పూనుకుంది.

1764-1800 మధ్య గ్రేట్ బ్రిటన్‌లో ట్రేడ్ యూనియన్ల నిర్మాణం జరిగింది. అటు తర్వాత యూరప్ ఖండంలో కార్మికవర్గం చైతన్యవంతంగా ఉన్న దేశాల్లో ట్రేడ్ యూనియన్ల నిర్మాణం ప్రారంభమైంది. అమెరికాలోని ఫిలడెల్ఫియా నగరంలో పోరాట సంప్రదాయం గల కార్మికులు 1806లో "మెకానిక్స్ యూనియన్" పేరుతో కార్మిక సంఘాన్ని ప్రారంభించారు. అదే అమెరికాలో మొట్టమొదటి కార్మిక సంఘం. 1850, 60 నాటికి యూరప్ ఖండంలోని అనేక దేశాల్లోనూ, అమెరికాలోనూ కార్మికులు విప్లవోత్సాహంతో శక్తివంతమైన కార్మిక సంఘాలను నిర్మించుకొని తమ హక్కుల సాధనకోసం క్రియాశీల పోరాటాల్లోకి దూకారు.

ట్రేడ్ యూనియన్ల మహత్తర సామాజిక శక్తిని చూసి పాలకులు, పెట్టుబడిదారులు హడలెత్తిపోయారు. ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో కార్మికులు అధిక జీతాలు డిమాండ్ చేయడానికి ట్రేడ్ యూనియన్లు నిర్మించుకోవడం చట్ట విరుద్ధంగా ప్రకటించారు. ఏర్పాటైన ట్రేడ్ యూనియన్లను నిషేధించారు. దోపిడీదారులైన పెట్టుబడిదారులు, వారికి అండదండలిచ్చే పాలకులు అనేక మంది కార్మిక నాయకులనూ, ట్రేడ్

యూనియన్ సభ్యులనూ జైల్లో కుక్కారు. హత్యలు చేశారు. వారికున్న కొద్దిపాటి సొత్తును సయితం కాజేశారు. ట్రేడ్ యూనియన్లను నిరంకుశంగా నిషేధించారు. సమ్మె హక్కునూ, పికెటింగ్ హక్కునూ లాగేశారు.

బూర్జువా పాలకులు ట్రేడ్ యూనియన్లను నిషేధించినా, పశుబలంతో కార్మికవర్గ పోరాటాలను రక్తపుటేరుల్లో ముంచినా.. కార్మికవర్గం వెనుకంజవేయలేదు. పనిగంటల తగ్గింపు, న్యాయమైన వేతనాలు, ట్రేడ్ యూనియన్ల గుర్తింపుకోసం ప్రభుత్వం నుంచి హక్కులు సాధించడానికి కార్మికవర్గం వర్గ చైతన్యంతో పోరాటాలను కొనసాగించింది. ఈ పోరాట జ్వాలలు 19వ శతాబ్ద ప్రథమార్ధ భాగంలో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికాల్లో దోపిడీ శక్తులను చుట్టుముట్టాయి. ఇంగ్లండ్‌లో 1818లో స్టాక్‌పోర్టు పట్టణంలోని బట్టల ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు సమ్మె బావుటాను ఎగురవేశారు. ఈ సమ్మె పోరాటం కార్మికవర్గ చరిత్రలో ప్రథమ సమ్మె పోరాటంగా చెప్పబడింది. ఫ్రాన్స్ దేశం లయాన్స్ పట్టణంలోని సిల్కు పరిశ్రమల్లో 1831లోనూ, 1834లోనూ కార్మికులు తిరుగుబాటు జరిపారు. ప్యారిస్ నగరంలో 1848 జూన్ 23-26 మధ్య సమ్మె పోరాటాలు జరిగాయి. జర్మనీలోని సైలీషియాలో 1844లో నేత పనివారు తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటు ద్వారా శ్రామికవర్గ నిర్మాణాత్మక పటిమ, బూర్జువావర్గంతో దానికిగల శత్రుత్వం స్పష్టంగా వెల్లడయింది. నైరుతీ జర్మనీలో 1848లో విప్లవోద్యమం రగుల్కొంది. అదేఏడు ఆస్ట్రియా వియన్నాలో తిరుగుబాటు వచ్చింది. కార్మికులు విజయం సాధించారు. బెర్లిన్‌లో కార్మికులు, సైనికులకూ మధ్య సంఘర్షణలు జరిగాయి. చివరికి శ్రామికులు విజయం సాధించారు. ఈ కాలంలోనే అమెరికాలో పెక్కు నగరాల్లో కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహించారు.

యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ కార్మికవర్గ బలమైన పోరాటాలు జరపడం వల్ల ప్రభుత్వాలు దిగివచ్చి కార్మికవర్గానికి అనుకూలంగా కొన్ని చట్టాలు చేశాయి. వాటిలో ముఖ్యమైనవి పనిగంటలకూ, బాల కార్మికులకూ సంబంధించినవి. బ్రిటన్‌లో 13 సంవత్సరాల లోపు పిల్లలతో రోజుకు 9 గంటలకు మించి పని చేయించరాదనీ 1834లో ఒక ఫ్యాక్టరీ చట్టం చేయబడింది. శ్రామిక ప్రజలు జరిపిన పోరాటాల వల్ల కొన్ని చట్టాలు చేసినా నిరంకుశాధికారులు వాటిని అమలు చేయలేదు. ఏడాదికేడాది ఫ్యాక్టరీల నిర్మాణం పెరిగిపోతోంది. గనులు, రవాణా రంగాల్లో పనిచేసే కార్మికుల సంఖ్య లక్షల్లో పెరిగింది. కార్మికుల్లో వర్గ చైతన్యం వెల్లివిరిసింది. బలమైన ట్రేడ్ యూనియన్ల నిర్మాణం జరిగింది. కార్మికవర్గ పోరాటాలు బూర్జువా వర్గాలను చుట్టుముట్టాయి.

10 గంటల పని దినం నిర్ణయించాలన్న కోరిక మీద 19వ శతాబ్దం ప్రారంభంలో అమెరికాలో ప్రతి పారిశ్రామిక కేంద్రంలోనూ సమ్మెలు చెలరేగాయి. ఫిలడెల్ఫియాలోని మెకానిక్ యూనియన్ ఈ 10 గంటల పనిదినం సాధించే పోరాటాన్ని 1827లో ప్రారంభించింది. ఈ పోరాటోధృతిని తట్టుకోలేక అమెరికా ప్రభుత్వం 10 గంటల పనిదినం నిర్ణయిస్తూ శాసనం చేసింది. తర్వాత ఈ 10 గంటల పనిదినం ఉద్యమం అట్లాంటిక్ మహాసముద్రం దాటి యూరప్ ఖండంలో ప్రవేశించి అక్కడి కార్మికవర్గాన్ని ఉత్తేజపరిచింది. యూరప్ ఖండంలో కార్మికులు జరిపిన పోరాటాల ఫలితంగా అనేక దేశాలు 10 గంటల పని దినం అంగీకరిస్తూ చట్టాలు చేశాయి.

1870 నాటికి పారిశ్రామిక, వాణిజ్య, బ్యాంకింగ్ రంగాల్లో గుత్తాధిపత్యం రూపుదాల్చి బలపడింది. పెట్టుబడిదారీ వర్గం కొన్ని ఒడిదుడుకులకు గురయినప్పటికీ అధికలాభాలు పోగేసుకోవడానికి ఆ వర్గాలకు మంచి అవకాశాలు ఏర్పడ్డాయి. కానీ కార్మికవర్గం జీవితాల్లో అభివృద్ధి మాత్రం మృగ్యం. దానితో కార్మికవర్గం పనిగంటల తగ్గింపుకోసం ఉద్యమించింది. 1881 చికాగో నగరంలో వివిధ కార్మిక సంఘాలు కలిసి ఒక సమాఖ్యను నూతనంగా ఏర్పాటు చేసుకున్నాయి. దానికి 'అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్' అని పేరు పెట్టారు. ఈ సమాఖ్య 1884 అక్టోబరు 7న తన 4వ సమావేశంలో 8 గంటల పనిదినం ప్రవేశపెట్టాలని చారిత్రాత్మకమైన తీర్మానం చేసింది. 1886 మే 1న దేశమంతా కార్మికవర్గం 8 గంటల పని హక్కు సాధనకు సమ్మె పోరాటాలను నిర్వహించాలని కూడా నిర్ణయించింది. 8 గంటల పనిదినం ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవలసిన అవసరాన్ని కార్మికవర్గం అత్యంత ముఖ్యమైన డిమాండుగా గుర్తించింది. ట్రేడ్ యూనియన్ల సభ్యత్వం లక్షల్లో పెరిగింది. ఈ విధంగా 8 గంటల పనికోసం అనేకచోట్ల కార్మిక పోరాటాలు ప్రారంభమయ్యాయి.

చికాగో నగరంలోని కార్మికవర్గం అమెరికన్ కార్మికవర్గంలో ఒక భాగమే అయినా అక్కడి కార్మికవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. సమస్యల పరిష్కారానికి వారు పటిష్టమైన విప్లవ దృక్పథం అవలంబించేవారు. ఆ నగరంలోని కార్మిక నాయకులు ఎప్పుడూ కార్మికవర్గాన్ని విప్లవ మార్గాన నడిపిస్తూ ఉండేవారు. సమ్మెకు అనేక రోజులకు పూర్వమే "8 గంటల పని దినం సంఘం" ఒకటి అనేక రాజకీయ దృక్పథాలు గలవారితో ఏర్పడి పనిచేస్తోంది. ఆ సంఘం నాయకత్వంలో ఏప్రిల్ 30న (మేడేకి ఒకరోజు ముందు) 25 వేల మంది కార్మికులతో బ్రహ్మాండమైన ప్రదర్శన జరిగింది. మే 1న చికాగో నగరంలో కార్మికవర్గం చైతన్యం వెల్లివిరిసింది. నగరవీధులన్నీ ఉత్సాహవంతులైన కార్మికులతో నిండిపోయాయి. నగరంలో బ్రహ్మాండమైన సార్వత్రిక సమ్మె జరిగింది. కార్ఖానాలన్నీ మూతపడ్డాయి. అదివరకెన్నడూ కనీవినీ ఎరుగనంతటి ఐకమత్యంతో మూడున్నర లక్షల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. నగర వీధులన్నీ కార్మిక సందోహంతో నిండిపోయాయి. 8గంటల పనిదినాన్ని సాధించి తీర్తామనే దృఢ విశ్వాసం వారందరిలోనూ కనిపించింది. సమ్మెను విజయవంతం చేయడానికి వారు సర్వ శక్తులనూ ఒడ్డటానికి సిద్ధమయ్యారు. కార్మికవర్గ శత్రువులు కూడా విజృంభిస్తున్న ఈ కార్మికవర్గ ఉద్యమాన్ని ఏ విధంగానైనా నాశనం చేయాలని నిర్ణయించుకున్నారు. పెట్టుబడిదారీ వర్గానికి అండగా ప్రభుత్వం కూడా రంగ ప్రవేశం చేసింది.

మే 3న శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మిక జనసమూహంపై అమెరికన్ పోలీసులు కాల్పులు జరిపారు. ఆరుగురు కార్మికులను బలి తీసుకున్నారు. ఈ దారుణ హత్యాకాండ పట్ల అసమ్మతి తెలిపేందుకు మే 4న నగరం మధ్యలో ఉన్న హే మార్కెట్‌లో కార్మికులు పెద్ద ఎత్తున నిరసన సభ జరిపారు. ప్రశాంతంగా సాగుతున్న ఆ సభ మీద పోలీసులు విరుచుకుపడ్డారు. మధ్యలో బాంబు ప్రయోగం జరిగింది. ఒక పోలీసు సార్జెంట్ చనిపోయాడు. అది సాకుగా తీసుకొని పోలీసులు నిరాయుధులైన ప్రజలపై తుపాకులతో.. సన్నీలతో స్వైరవిహారం చేశారు. అయినప్పటికీ నిరాయుధులైన కార్మికులు సంఘటితంగా చైతన్యదీప్తితో పోలీసులతో బాహాబాహీగా తలపడ్డారు. ఈ సంఘర్షణలో ఏడుగురు పోలీసులు చనిపోగా.. నలుగురు కార్మికులు నేలకొరిగారు. పాలకులు అదనపు బలగాలను రంగంలోకి దించారు. హే మార్కెట్ ప్రాంతం కార్మికుల రక్తంతో తడిసిపోయింది. అక్కడే ఆవిర్భవించింది ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది శ్రమజీవుల స్వేచ్ఛా సంకేతమైన "అరుణపతాకం".

హే మార్కెట్ ఉదంతాన్ని పురస్కరించుకొని బూర్జువా ప్రభుత్వం కార్మికోద్యమ నాయకులను చుట్టివేసే కార్యక్రమం ప్రారంభించింది. న్యాయస్థానం ముందు విచారణ తతంగం జరిపి పార్సన్, ఫిషర్, ఎంగెల్ అనే కార్మిక నాయకులను ఉరి తీయించింది. మరికొందరిని దీర్ఘకారాగార శిక్షలకు గురిచేసింది. తనను ఉరితీసే ముందు స్పైస్ ఇలా అన్నారు. "మమ్మల్ని ఉరితీస్తే మంటలు ఆరిపోతాయనుకుంటున్నారా? ఇదిగో అక్కడ, ఇక్కడ, ఆమూలు, ఈమూల, మీ వెనుక, మీ ముందు అన్నిచోట్లా జ్వాలలు చెలరేగుతాయి. అది అంతర్వాహిని. దాన్ని ఆర్పడం మీ తరంకాదు". దేశమంతా ఇతర కేంద్రాల్లో కూడా ఈ దమనకాండ కొనసాగింది. అయినప్పటికీ అమెరికన్ కార్మికుల్లో మాత్రం మే1న విప్లవ చైతన్యం వెల్లివిరిసింది. ప్రతి కార్మికుడూ వర్గ చైతన్యాన్ని ప్రదర్శించడానికి వీధుల్లోకి వచ్చాడు. ఆ విధంగా 1886 మే 1న ప్రపంచ కార్మిక వర్గ విప్లవ చరిత్రలో రక్తాక్షరాలతో లిఖించదగిన తేదీగా మారిపోయింది. ఆనాటి పోరాటోద్యమానికి చికాగో నగరమే కేంద్రమయినప్పటికీ దేశంలోని అనేక ముఖ్య నగరాలకు ఆ ఉద్యమం వ్యాపించింది. న్యూయార్క్, బాల్టిమోర్, వాషింగ్టన్, పిట్స్‌బర్గ్, డిట్రాయిడ్ మొదలైన పెద్ద నగరాల్లోని శ్రామికులు కూడా మహోత్తేజంగా పోరాటంలోకి దూకారు. ప్రపంచవ్యాప్తంగా శ్రమజీవులను ఉత్తేజపరిచి వారిలో ఆశాజ్యోతిని వెలిగించింది మే దినోత్సవం.

- యు.రామకృష్ణ

అరుణతార... కష్టజీవుల ధ్రువతార

(ఆంధ్రలో సీనియర్ కమ్యూనిస్టు, సుందరయ్య గారి సహచరుడు అమరజీవి కంభంపాటి సత్యనారాయణ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఆయన గురించి రాసిన భాగమిది. ఆ పుస్తకం కోసం ఆయన సుందరయ్యగారిని ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేశారు. పుస్తక రచనలో సలహాలు తీసుకున్నారు. కంభంపాటి మృతి అనంతరం సుందరయ్యగారు ఆ పుస్తకాన్ని ఆవిష్కరించిన సంగతి తెలిసిందే)

పుచ్చలపల్లి సుందరయ్య 1913లో జన్మించారు. స్వగ్రామం నెల్లూరుజిల్లా అలగానిపాడు. చిన్నప్పుడే తండ్రిపోవడం వల్ల, బావగారింట్లో ఉండి చదువుకొనేవారు. 1921–30 మధ్య ప్రైవేట్ ట్యూషన్ చెబుతున్న టీచర్ వెంకటరత్నంగారి వల్ల వీరికి తెలుగుభాష మీద అభిమానం పెరిగింది. దానిని అభివృద్ధి చేసుకోవడంతో భోగరాజు నారాయణమూర్తి 'విమలాదేవి' 'రాయచూరు యుద్ధం", 'తిమ్మరుసు' మొదలైన చారిత్రక నవలలు చదవడంతో స్వాతంత్ర్య యోధుల మీద భక్తి శ్రద్ధలు ఏర్పడ్డాయి. వేమన పద్యాలు, సుమతీ శతకం కంఠస్థం చేయడంతో సాంఘిక సమానత్వ భావాలంకురించాయి. నియమబద్ధ జీవితానికి పునాదులేర్పడ్డాయి. రాజమండ్రిలో వీరి బావగారు సెషన్స్ జడ్జిగా ఉన్నప్పుడు 1924–25లో పందిరి మల్లిఖార్జునరావుగారితో పరిచయం ఏర్పడింది. వారి సలహానుసరించి కొమర్రాజు లక్ష్మణరావుగారి భారతదేశ చరిత్ర గ్రంథాలు, చిలుకూరి వీరభద్రరావుగారి ఆంధ్రుల చరిత్ర, వీరేశలింగం, చిలకమూర్తి లక్ష్మీనరసింహంగార్ల గ్రంథాలు చదవడంతో పై భావాలు దృఢపడ్డాయి. 1925లో చిత్తరంజన్‌దాసు మరణించారే వార్త విని, కాంగ్రెస్‌ను గురించీ, అది నడిపే పోరాటాన్ని గురించీ తెలుసుకోవాలని కుతూహలపడ్డారు. రోజూ ఆంధ్ర దినపత్రిక చదవడం ప్రారంభించారు. 1919లో డయ్యరు సేనాని జలియన్‌వాలాబాగ్‌లో జరిపిన మారణహోమాన్ని గురించి కాంగ్రెస్ విచారణ కమిటీ ప్రకటించిన రిపోర్టు తెలుగులో వెలువడింది. అది చదివి బ్రిటిష్ పాలనను ఏవగించుకోసాగారు. 1925 డిసెంబరులో ఒక వ్యక్తిగత విప్లవవాద గ్రూపులో చేరారు. తరువాత గాంధీజీ ఆత్మకథ చదివారు. వారి సంపాదకత్వం కింద వెలువడుతున్న 'యంగ్ ఇండియా' వారపత్రిక కూడా చదవసాగారు. అప్పటి నుంచి ఖద్దరు ధరించడం ప్రారంభించారు. సాధ్యమైన, తక్కువ అవసరాలతో జీవితాన్ని నియబద్ధంగా గడపడానికి కృషి చేశారు. క్రమంగా, ఇతర భావ తరంగాలు వీరి ఆలోచనల్ని పదును పెట్టాయి. 1926లో మద్రాసులో నాల్గవఫారం చదువుతున్నప్పుడు సావర్కార్ జీవితాన్ని గురించి చదివి ఉత్తేజం పొందారు. భారతీయ సంస్కృతిపై పాశ్చాత్య దేశాల్లో అనేక ఉపన్యాసాలిచ్చిన స్వామి వివేకానందం రచనల్ని చదివి, స్వదేశాభిమానాన్ని, స్వయం శిక్షణను అలవరుచుకున్నారు. తిలక్ మాండలేజైల్లో రచించిన 'గీతా రహస్యం' వీరికి కర్తవ్య ప్రబోధం చేసింది. "నేను చదువుకొంటున్న హైస్కూల్లో గీతా రహస్యం మీద నేనిచ్చిన ఉపన్యాసం విని విద్యార్థులూ, ఉపాధ్యాయులూ మెచ్చుకున్నారు" అని ఒక ఇంటర్వ్యూలో అన్నారాయన 1927లో జవహర్‌లాల్‌నెహ్రూ రష్యా నుంచి తిరిగివచ్చి, ఆ దేశంలోని సోషలిస్టు వ్యవస్థను గురించి ధారావాహికంగా రాసిన వ్యాసాలు వీరిలో మొట్టమొదటిసారిగా సోషలిస్టు బీజాలు నాటాయి. 1927లో మద్రాసులో జరిగిన కాంగ్రెస్ మహాసభ సంపూర్ణ స్వాతంత్ర్యం తన ధ్యేయమని తీర్మానించడం, మరుసటి సంవత్సరం మద్రాసులో సైమన్ కమిషన్‌కి వ్యతిరేకంగా జరిగిన హర్తాళ్, బహిరం గసభ, ఇవన్నీ సుందరయ్య గారిలో స్వాతంత్ర్యేచ్ఛ ను ఇనుమడిం పజేశాయి. ఆరోజు వీరి హైస్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులూ హర్తాళ్‌లో పాల్గొన్నారు. మద్రాసులో చదువుకొంటున్న రోజుల్లో సుందరయ్యగారు ప్రతియేడు వేసవి సెలవుల్లో స్వగ్రామం వెళ్లేవారు. అలా వెళ్లినప్పుడల్లా సొంత పొలంలో కూలీలతో కలిసి వ్యవసాయ పనులు చేసేవారు. స్కూల్ ఫైనల్ పాసయ్యాక 1929లో వీరు మద్రాసు లయోలా కాలేజీలో ప్రవేశించారు. ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు కొంతమంది తెలుగు విద్యార్థులతో కలిసి సోదర సమితిగా ఏర్పడి వ్యాయామం, గ్రంథపఠనం, ఖద్దరు విక్రయం మొదలైన కార్యక్రమాల్లో పాల్గొనేవారు. బొంబాయి నుంచి వెలువడే యంగ్ లిబరేటర్ పత్రికకు ఇరుతలతో కలిసి చందాదారుల్ని చేర్పించారు. అప్పుడే 'కమ్యూనిస్టు ప్రణాళిక',, 'కూలిపని– పెట్టుబడి' మొదలైన మార్క్సిస్టు గ్రంథాలు కూడా చదివారు. ఆనాటి నుండి కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేయడానికి నిశ్చయించుకున్నారు.

మీరట్ జైల్లో ప్రారంభమైన కమ్యూనిస్టు కుట్రకేసు విచారణను గురించిన వార్తలు ప్రతిరోజూ పత్రికల్లో వెలువడుతుండేవి. ఆ కేసులో ముద్దాయిలు ప్రాసిక్యూషన్ మీద విసురుతున్న సవాళ్లు, కమ్యూనిజాన్ని గురించి ప్రాసిక్యూషన్ చెప్పే అబద్ధాలకు గూబగుయ్యిమనేటట్లు జవాబులు చెప్పడం, తమ ధ్యేయాన్ని గురించీ, విధానాన్ని గురించీ నిర్మొహమాటంగా బల్లగుద్ది చెప్పడం ఇవన్నీ సుందరయ్యగారి ఆలోచనల్ని పదునుపెట్టాయి. ఒకరోజున విద్యార్థి గాంధీ టోపీతో క్లాసుకు వచ్చి కూర్చున్నాడు. అది చూసి ఒక కాథలిక్ ప్రొఫెసర్ ఆ విద్యార్థిని బయటికి పంపించేశాడు. మరునాడు విద్యార్థులందరూ గాంధీ టోపీలతో క్లాసుకు ప్రత్యక్షం, అది చూసి ప్రొఫెసర్ క్లాసును సస్పెండ్ చేశాడు. వాతావరణం ఉద్రిక్తంగా ఉంది. సోదర సమితి సభ్యులు ఇతర విద్యార్థులతో చేతులు కలిపి, సమ్మెకు పిలుపునిచ్చారు. ఇదంతా గమనిస్తున్న ప్రిన్సిపాల్ తెలివిగా, నోటీసుబోర్డులో ఎవరికి తోచిన టోపీలు వారు ధరించవచ్చునని ప్రకటించాడు. విద్యార్థులకు ఇదొక ఘన విజయం. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా, సుందరయ్య అలగానిపాడు వెళ్లారు. అక్కడ వ్యవసాయ కార్మికులలో పనిచేయడానికి 1930 వేమన జయంతినాడు అవర్ణులకు, సవర్ణులకు కలిపి పంక్తి భోజనం ఏర్పాటు చేశారు. సవర్ణులు సుందరయ్యగారికి దగ్గర బంధువులు దీనిని సహించలేక హరిజనుల్ని



రానియ్యకుండా ఆపుచేశారు. భూస్వాముల ఈ చర్యకు అసమ్మతిగా సుందరయ్య రెండురోజులు నిరాహారవ్రతం చేశారు. అదిపేద ప్రజలలోనూ, హరిజనులలోనూ ప్రత్యేక అభిమానం కలిగించింది. నిరాహారదీక్ష పూర్తికాగానే సోదర సమితి పిలుపు మీద ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనడానికి పశ్చిమగోదావరి జిల్లా వెళ్లారు. భీమవరం తాలూకాలో రెండుచోట్ల చట్టధిక్కారం చేశారు. దిరుసుమర్రు వలంటీర్ శిబిరానికి వచ్చి, అక్కడ వలంటీర్ కెప్టెన్‌గా పనిచేశారు. చట్టధిక్కారానికి పాల్పడినాడని భీమవరం సబ్‌కలెక్టర్ 1930 జూన్ 16న సుందరయ్యగారికి రెండేళ్లు కఠిన శిక్ష విధించారు. వీరికప్పుడు 17 ఏళ్లు మాత్రమే. మైనరు కావడం చేత తంజావూరులో బాల నేరస్థుల్ని నిర్బంధించే బోర్టర్స్ జైలుకు పంపించారు. ఆ జైల్లో పరిస్థితులు అతి నికృష్టంగా వుండడం చూసి మరికొందరితో కలిసి నిరాహార వ్రతం చేశారు. అయిదో రోజున జైలు వార్డన్లు ఇనుప పట్కారుతో నోటిని తెరిచి గొంతులో గంజిపోశారు. తరువాత 24 గంటలూ ఒంటికొట్లో నిర్బంధించారు. రెండు నెలల తరువాత తిరుచినాపల్లి జైలుకి మార్చారు. తిరిగి తంజావూరు బోర్టర్స్ జైలుకి మార్చారు. అక్కడ మళ్లీ నిరాహారదీక్ష ప్రారంభించడం వల్ల రాజమండ్రి జైలుకు మార్చారు. ఆ జైల్లోని ఇతర రాజకీయ ఖైదీలతో రష్యా విప్లవాన్ని గురించి, అలాంటి విప్లవాన్నే మన దేశంలో కూడా నడపడం గురించీ చర్చలు జరిపేవారు. రాజమండ్రి జైలులో లాహోరు కుట్రకేసు ఖైదీలు శివవర్మ, విజయకుమార్ సిన్హాలతో వీరికి పరిచయమైంది. వారిది హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీ, సోషలిజం సాధనకై వ్యక్తిగత విప్లవాద చర్యలను చేపట్టినవారు. అయితే గాఢమైన దేశభక్తి, అపారమైన ధైర్య సాహసాలు గలవారు. అదే సమయంలో తమ ఉద్యమంలో ద్యోతకమైన బలహీనతలు, అజాగ్రత్త వల్ల కలిగిన నష్టాలు కూడా వారు వివరించారు. ఆ సమాచారం సుందరయ్య గారికి ఎంతగానో తోడ్పడింది. శివవర్మ తన విప్లవ జీవితంలో ఎలా రహస్యంగా పనిచేసిందీ, జరిగిన పోరబాట్లు, విప్లవకారుల్లోని ధైర్యసాహసాలు అన్నీ వర్ణించి చెప్పేవారు. శిక్షాకాలం పూర్తి కాకముందే సుందరయ్యగారు గాంధీ – ఇర్విన్ ఒడంబడిక ప్రకారం 1931 మార్చి 20వ తేదీన విడుదలయ్యారు. అప్పుడు వీరి బావగారు బెంగుళూరులో సెషన్స్ జడ్జిగా ఉండేవారు. అక్కడ 'సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరంలో ప్రవేశించారు. అప్పటికి సత్యాగ్రహ పద్ధతిపై వీరికి నమ్మకం పూర్తిగా పోయింది. 'ఒకసారి ఒక హరిజన స్త్రీ నా దగ్గరకొచ్చింది. డాక్టర్లు మాత్రమే చేయగల చికిత్స నన్ను చేయమని ఆమె అమాయకంగా బ్రతిమాలింది. నేను ప్రథమ చికిత్స మాత్రమే చేయగలనన్నాను. వైద్యం నాకు తెలియదన్నాను. ఎంత చెప్పినా ఆమె వినలేదు. నెల్లూరులో ఒక డాక్టరు పేరు చెప్పి, ఆయనకు ఉత్తరం రాసి ఇస్తానన్నాను. రైలు ఖర్చులు కూడా ఇస్తానన్నాను. ఆమె ససేమిరా వినలేదు. ఆమె రొమ్ములో ఒక పెద్ద పుండు వున్నట్లు స్పష్టమైంది. అందులోంచి చీము విపరీతంగా పైకొస్తుంది. నేను వేడినీళ్లు కాచి శుభ్రమైన దూదితో పుండు కడిగేసి, గుడ్డతో కట్టుకట్టాను. ఆమె సంతృప్తి చెంది వెళ్లిపోయింది. మళ్లా నా దగ్గరకు రాలేదు" అని నాతో అన్నారు. సుందరయ్యగారి కార్యకలాపాలను గురించి విని అమీర్ హైదర్‌ఖాన్ 1931లో ఆయనను కలుసుకోవడానికి వెళ్లారు. తనను కమ్యూనిస్టుగా పనిచేయమని సలహా ఇచ్చారు. తాను బి.ఎ పూర్తి చేస్తానని తల్లికి మాట ఇచ్చానని, అది పూర్తికాగానే తన కాలాన్ని కమ్యూనిస్టు ఉద్యమంలో గడుపుతానని చెప్పారు. కానీ బెంగుళూరులో 1931లో ఆరుమాసాలు మాత్రమే చదివి, ఆ చదువు వల్ల ప్రయోజనమేమీ ఉండదనుకొని చదువుకు స్వస్తి చెప్పి తిరిగి అలగానిపాడు వెళ్లారు.

ఒకరోజున నెల్లూరు నుంచి వీరెరిగిన దువ్వూరి బలరామిరెడ్డి, చుండిజగన్నాథం, మరికొందరు అలగానిపాడు వచ్చారు. వీరు స్వాతంత్ర్యోద్యమంలో జైళ్లకు వెళ్లి, విడుదలై వచ్చాక వ్యక్తిగత విప్లవవాదాన్ని చేపట్టినవారు. సుందరయ్యగారిని కూడా తమ వెంట తీసుకుపోవాలనుకొని వచ్చారు. వీరి మధ్య దీర్ఘ చర్చలు జరిగాయి. వ్యక్తిగత విప్లవవాదం సరైనది కాదని ఎంత వాదించినా వారు వినలేదు. చివరకు వారు లాభం లేదని తిరిగి వెళ్లిపోయారు. అంతకు రెండేళ్లు ముందే సుందరయ్యగారికి వ్యక్తిగత విప్లవాదం పట్ల నమ్మకంపోయింది. కార్మిక, కర్షక పోరాటాలను నడపడమొక్కటే స్వాంత్ర్య సాధనకు మార్గమని ఆయన నమ్మారు. కొన్నాళ్ల తరువాత అలగానిపాడు విడిచిపెట్టి ఎక్కడెక్కడ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి అవకాశాలున్నాయో కనుగొనడానికి 1933–34 మధ్య ఆంధ్ర జిల్లాలు పర్యటించారు. తన జైలు మిత్రుల ద్వారా, సోదర సమితి సభ్యుల ద్వారా ఒక్కొక్కరినే కలుసుకొని మాట్లాడసాగారు. వారిలో మల్లికార్జునరావు, పెన్మెత్మ సూర్యనారాయణ, పెన్మెత్మ అనంతరం, పశ్చిమ గోదావరిలో ఉద్దరాజు రామం, అల్లూరి సత్యనారాయణ, తనికరెళ్ల వెంకట చలపతి, కలిదిండి సుబ్రహ్మణ్యం, కృష్ణాజిల్లాలో మద్దుకూరి చంద్రశేఖరరావు, చలసాని వాసుదేరావు, చలసాని జగన్నాథరావు, కొసరాజు శేషయ్య, కాట్రగడ్డ నారాయణరావు, గద్దె లింగయ్య, గుంటూరుజిల్లాలో పోలేపెద్ది నరసింహమూర్తి, జొన్నలగడ్డ రామలింగయ్య, పెండ్యాల లోకనాథం, ప్రతాపరామ సుబ్బయ్య, నెల్లూరు జిల్లాలో బస్వారెడ్డి శంకరయ్య మొదలైనవారు. ఈ కార్యక్రమం కొనసాగిస్తూనే వీరు అలగానిపాడుతో సంబంధం వదులుకోలేదు. 1934లో అక్కడ వ్యవసాయ సంఘాన్ని స్థాపించారు. 1934 సెప్టెంబరులో సుందరయ్యగారు బెజవాడలో ఒక సమావేశం ఏర్పరిచారు. దానికి వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు వచ్చారు. వారందరూ 'కమ్యూనిస్టు ప్రణాళిక' ఏమిచేయాలి? "రాజ్యాంగ యంత్రం – విప్లవం', 'వామపక్ష కమ్యూనిజం' 'కూలిపని – పెట్టుబడి' మొదలైన గ్రంథాలూ, మీరట్ కుట్ర కేసులో కమ్యూనిస్టు నిందితులిచ్చిన సంయుక్త ప్రకటన అధ్యయనం చేసేవారు. ఇవన్నీ అచ్చులో కాక సైక్లోస్టైల్‌లో కొన్ని, రాతలో కొన్ని వుండేవి. వీటిలో సుందరయ్యగారు అనువదించినవి 'కమ్యూనిస్టు ప్రణాళిక' 'రాజ్యాంగ యంత్రం – విప్లవం', 'ఏమి చేయాలి? "వామపక్ష కమ్యూనిజం" చివరి గ్రంథాన్ని నండూరి ప్రసాదరావుగారు కూడా అనువదించారు. మీరట్ ప్రకటనలోని వేర్వేరు భాగాలను వేర్వేరు వ్యక్తులు అనువదించారు. పై సమావేశం ఏడుగురితో ఒక రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీని ఎన్నుకొంది. పోలేపెద్ది నరసింహమూర్తి, కొసరాజు శేషయ్య, మద్దుకూరి చంద్రశేఖరరావు, చలసాని వాసుదేవరావు, అల్లూరి సత్యనారాయణ, తనికెళ్ల వెంటకచలపతి, సుందరయ్య. బెజవాడ సమావేశం, రాష్ట్ర మంతటా కూలి రక్షణ సమితుల్ని ఏర్పరిచి వాటి ద్వారా కార్మికుల్లో పనిచేయాలనీ, తెలుగులో ఉన్న మార్క్సిస్టు గ్రంథాల ద్వారా యువతీయుకుల్లో కమ్యూనిస్టు చైతన్యం కలిగించాలనీ తీర్మానించింది. ◆

మేడే శుభాకాంక్షలు
ప్రపంచ కార్మిక పర్వదినం మేడే...
కార్మిక వర్గ పోరాటాలకు, కార్మిక వర్గ చైతన్యంతో
నవ సమాజనిర్మాణానికి
ఈ మేడే స్ఫూర్తి కావాలని కోరుకుంటూ..
కార్మికులకు, కార్యకర్తలకు, అభిమానులకు,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు
మేడే శుభాకాంక్షలు
NATIONAL FEDERATION OF POSTAL EMPLOYEES
ALL INDIA POSTAL EMPLOYEES UNION - GROUP-C
ALL INDIA POSTAL EMPLOYEES UNION - POSTMAN/MTS
ALL INDIA POSTAL EMPLOYEES UNION - GDS (NFPE)
SRIKAKULAM DIVISION, SRIKAKULAM

లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటం

మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణకు కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లు రద్దు తప్పని సరి. పారిశ్రామికీకరణ తొలిరోజులో కార్మికులు రోజుకు 14 గంటలు పనిచేసేవారు. 8 గంటల పని దినం కోసం పెద్ద ఎత్తున జరిగిన పోరాటాలు ఫలితంగా 8 గంటల పని దినాన్ని సాధించుకున్నాం. కార్మిక వర్గం అశేష త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మికులకు రక్షణగా ఉంటున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి యజమానులకు కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది.

బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు ఐక్యంగా పోరాటం చేసి 8 గంటల పనిదినంతో పాటు సాధించుకున్న హక్కులను కూడా మోడీ ప్రభుత్వం రద్దు చేసింది. బిజెపి ప్రభుత్వం రూ.లక్షల కోట్ల ప్రజా ధనాన్ని అదానీ, అంబానీలకు గుమ్మరించి, ప్రజలపై పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ భారాలను మోపుతోంది. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్లకు కట్టబెడుతోంది. దేశ సంపదైన ప్రకృతి వనరులు, ప్రభుత్వ రంగాన్ని, సంపద సృష్టికర్తలైన కార్మికులు, రైతులను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు తాకట్టు పెడుతోంది. జీవనోపాధిపై, కార్మికులు, శ్రమ జీవులు పోరాడి సాధించుకున్న హక్కులపై పెట్టుబడి దారులు చేస్తున్న దాడికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలి. విభజించే ప్రయత్నాలను ఐక్యంగా ఎదిరించాలి.

– పి.తేజేశ్వరరావు,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మేడే శుభాకాంక్షలు 9133690999
SRUSHTI HYPER STORE
BEST PRICE!
SVC థియేటర్ ఎదురుగా, రామలక్ష్మణ జంక్షన్, శ్రీకాకుళం.
సృష్టి హైపర్ స్టోర్
BEST QUALITY
కార్ పార్కింగ్ కోసం విశాలమైన స్థలం కలిగిన ఏకైక డిపార్ట్‌మెంటల్ స్టోర్
GROCERY & HOME NEEDS
డోర్ డెలివరీ సదుపాయం కలదు
శ్రీ లక్ష్మీ గణపతి మార్కెటింగ్స్

మేడే శుభాకాంక్షలు
సంపదను సృష్టించడంలో విశేష కృషి చేస్తున్న
శామికులకు, వారి అభ్యున్నతికి బాటలు వేస్తున్న
మిత్రులందరికీ హృదయపూర్వక
శామిక దినోత్సవ
సందర్భంగా మేడే శుభాకాంక్షలు
BAYROCK GRANITES PVT LTD
TEKKALI, SRIKAKULAM (DT)

మేడే శుభాకాంక్షలు
HAPPY MAY DAY
ప్రపంచ కార్మిక పర్వదినం మేడే...
కార్మిక వర్గ పోరాటాలకు, కార్మిక వర్గ చైతన్యంతో
నవ సమాజనిర్మాణానికి ఈ మేడే
స్ఫూర్తి కావాలని కోరుకుంటూ.. కార్మికులకు,
కార్యకర్తలకు, అభిమానులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు
మేడే శుభాకాంక్షలు
అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్
(సి.ఐ.టి.యు అనుబంధం)
శ్రీకాకుళం జిల్లా కమిటి

జెమ్స్ హాస్పిటల్
GREAT EASTERN MEDICAL SCHOOL & HOSPITAL
శ్రీకాకుళం
24/7 EMERGENCY SERVICE
WORLD LIVER DAY
జెమ్స్‌హాస్పిటల్ మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం
వరల్డ్ లివర్ డే సందర్భంగా
తేది 17-04-2024 నుండి తేది 30-04-2024 వరకు
Dr. P. SRIHARSHA
M.D,D.M, Medical Gastroenterology
Consultant Medical Gastroenterologist
- అన్నం మింగుట సమస్య
- అతిసారం, మలబద్దకం
- గ్యాస్ ఇబ్బంది, అల్సర్
- పిత్తవాహిక రాళ్ళు
- ప్యాంక్రియాసిస్ సమస్యలు
- కడుపునొప్పి
- అజీర్తి, వాంతులు
- రక్తవాంతులు, పైల్స్
- పచ్చ కామెర్లు మరియు ఉబ్బు కామెర్లు
- కడుపు మరియు ప్రేగు క్యాన్సర్
- లివర్ సిర్రోసిస్ మరియు హెపటైటిస్ సమస్యలు
- అన్ని రకముల చిన్న ప్రేగు మరియు పెద్దప్రేగు సమస్యలు
ఎండోస్కోపి • ఎంటిరోస్కోపి • కొలనోస్కోపి • ERCP అందుబాటులో కలవు.
గ్యాస్ట్రోఎంట్రాలజీ హెల్త్ ప్యాకేజి :
✓ లివర్ ఫంక్షన్ టెస్ట్ (Liver Function Test)
✓ హిమోగ్లోబిన్ పరీక్షలు (HB%)
✓ ఆర్.బి.ఎస్.
✓ ఎండోస్కోపి
✓ లిపిడ్‌ప్రొఫైల్
✓ కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (Complete Blood Test)
✓ వైరల్ మార్కర్స్ (HIV, HBsAg, HCV)
✓ అల్ట్రాసౌండ్ అబ్డమిన్ (Ultrasound Abdomen)
✓ డాక్టర్ కన్సల్టేషన్
1999/- Only
ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యసేవలు అందుబాటులోకలవు
ఈ ప్యాకేజి ద్వారా మీ సమస్యలకు గల కారణము, వాటి నివారణ తెలుసుకోవడానికి మా వైద్యనిపుణులను సంప్రదించగలరు.
గమనిక : పై ప్యాకేజి జెమ్స్ హాస్పిటల్ నందు మాత్రమే కలదు ఈ ప్యాకేజిలకు వచ్చేవారు ఉదయాన్నే ఏమీ తినకుండా రావలెను.
24 గంటల ఫార్మసీ, బ్లడ్ బ్యాంక్, సెంట్రల్ లాబొరేటరీ, అత్యవసర వైద్య చికిత్స విభాగములు కలవు.
Contact : 6309990630, 7680945347

మేడే శుభాకాంక్షలు
UTF
ప్రపంచ కార్మిక పర్వదినం మేడే...
కార్మిక వర్గ పోరాటాలకు స్ఫూర్తినిచ్చే మేడే...
కార్మిక వర్గ చైతన్యంతో నవ సమాజ నిర్మాణానికి
ఈ మేడే స్ఫూర్తి కావాలని కోరుకుంటూ...
ఐక్య ఉపాధ్యాయ పత్రిక
చదవండి - చదివించండి
సంవత్సరం చందా - 200/-
2 సంవత్సరాల చందా - 375/-
5 సంవత్సరాల చందా - 850/-